thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 357 కరీంనగర్ మంగళవారం, 4 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య కృషి

న్యూఢిల్లీ : వ్యవసాయాభివృద్ధికీ, రైతు సంక్షేమానికీ తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే, దేశంలోని తక్కువ పంట దిగుబడి, ఉత్పాదకత ఉండే వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజన పథకానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా తొలుత ఎంపిక చేసిన 100 జిల్లాల్లో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

2025-26 బడ్జెట్‌కు సంబంధించి వ్యవసాయం-గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటుచేసిన వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యవసాయ సంబంధ కార్యక్రమాలను ముందుగా మొదలుపెట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని, అయినప్పటికీ దేశీయ వినియోగంలో 20% ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు.

# స్పష్టత ఏది?

## ఏడున్నర లక్షలు దాటిన దరఖాస్తులు - మీ సేవ సెంటర్లకు జనాల క్యూ

## ప్రజాప్రతినిధులది ఒకమాట, అధికారులది మరో మాట



### రేషన్ కార్డుల జారీ ఎప్పుడు
### మార్చి 1 దాటినా రాని స్పష్టత

హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గందరగోళంగా మారింది. కార్డుల జారీపై ప్రజాప్రతినిధులదో మాట, అధికారులదో మాటగా ఉంటోంది. ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్చి ఒకటి నుంచి రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు.

దీంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు. కానీ, మూడో తారీఖు వచ్చినా ఆ ఊసే కనిపించడం లేదు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. అంతకు ముందు ఇదే అధికారులు మార్చి మొదటి వారంలో కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఒక్కోసారి ఒక్కోమాట చెప్తుండడంతో జనాలు అసలు రేషన్ కార్డులు ఇస్తారా..ఇవ్వరా అన్న అయోమయంలో ఉన్నారు.

**తికమక ప్రకటనలు**... హైదరాబాద్ కోర్ సిటీ పరిధిలోని 9 సర్కిళ్లలోని ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. మార్పులు, చేర్పులు చేసుకునేందుక, కొత్త పేర్లను నమోదు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు సర్కిల్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఒకసారి దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని ఒకసారి, తర్వాత అందరూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ప్రకటనలు చేస్తుండడంతో తికమకపడుతున్నారు. ఎందుకైనా మంచిదని చాలా మంది ఎన్నిసార్లయితే అన్ని సార్లు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో నగరంలోని మీ సేవ సెంటర్ల వద్ద రోజూ వేల సంఖ్యలో దరఖాస్తుదారులు బారులు తీరుతున్నారు.

**10 రోజుల్లో భారీగా దరఖాస్తులు....** గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటివరకు లక్షల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా చేసుకుంటూనే ఉన్నారు. ప్రస్తుతం 9 సర్కిళ్ల పరిధిలో 6,39,451 రేషన్ కార్డులున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 5.40 లక్షల మంది, నాలుగు నెలల కింద కులగణన సర్వేలో 83 వేల మంది అప్లై చేసుకున్నారు. ఇటీవల మీసేవ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించడంతో జనాలంతా మళ్లీ క్యూలు కట్టారు.

దీంతో రెండు వారాల్లోనే 1,31,484 మంది రేషన్?కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

**అర్హుల జాబితా రాలే : సివిల్ సప్లయీస్....** రేషన్ కార్డుల జారీ ఎందుకింత ఆలస్యం అవుతోందని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారి ఒకరిని అడగ్గా..' నాలుగు నెలల కింద బల్దియా నిర్వహించిన కులగణన సర్వేలో దరఖాస్తుల్లో అర్హుల జాబితా వివరాలు ఇప్పటికీ మాకు అందలేదు. తాజాగా మీసేవ కేంద్రాల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుల వివరాలు కూడా పూర్తిగా అందలేదు. ఈ దరఖాస్తులు మాకు చేరితే ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులను గుర్తిస్తాం' అని సమాధానం ఇచ్చారు. ఇప్పటి వరకూ కార్డుల జారీపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అంటున్నారు.



### రెండో రాజధానిగా హైదరాబాద్ ను ఒప్పుకునేది లేదు

హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన్ భవన్ లో మాట్లాడిన కోదండరాం.. విదేశీ కంపెనీలు వస్తే ఒక్క గుజరాత్, మహారాష్ట్రలకే కాకుండా అన్ని రాష్ట్రాలకు రావాలి. కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాలి. ఉత్తర భారత్ తో పోలిస్తే .. దక్షిణ భారత్ లో జనాభా తక్కువ. జనాభా ఆధారంగా నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణ చేయనున్నారు. దీని వల్ల పార్లమెంట్ లో ఉత్తర భారత్ నుంచి ప్రాతినిధ్యం పెరిగి... దక్షిణ భారత్ ప్రభావం తగ్గుతుంది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ కమిటి ప్రతిపాదనల్లో లోపాలు ఉన్నాయని అంబేద్కర్ చెప్పారు. ఒక భాష మాట్లాడే వాళ్ళు ఒక రాష్ట్రంలో ఉండాలి.. కానీ ఒక భాష మాట్లాడే వాళ్ళందరినీ తెచ్చి ఒక రాష్ట్రంగా చేస్తామంటే సరికాదు. దక్షిణ భారత్ నుంచి డిల్లీకి వెళ్ళాలంటే చాలా కష్టం. దక్షిణ భారత్ ను పట్టించుకోవడం లేదని అంబేద్కర్ చెప్పారు. ఇప్పుడు ఇదే పరిస్థితి దేశంలో కనిపిస్తోంది. జలాశయాలను కేంద్రం కంట్రోల్ చేస్తోంది. ఆర్థిక వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. దక్షిణ భారత్ లోని రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. కేంద్రం తనకు కావాల్సిన వాళ్లకు అన్ని వడ్డిస్తూ మనల్ని మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను దక్షిణాదిలో ఏర్పాటు చేయాలని అంబేద్కర్ చెప్పారు. బలవంతంగా హిందీ రుద్దడంపై హిందియేతర రాష్ట్రాలు అభ్యంతరం తెలుపుతున్నాయి. కేంద్రం అధికారం ఉందని బలవంతంగా హిందీనీ రుద్దే అవసరం లేదు. అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు, న్యాయమైన వాటాలు దక్కాలి అని కోదండరాం అన్నారు.



### హైడ్రా కీలక ఆదేశాలు
### వాటిని మార్చి 9 వరకు తీసేయండి

అక్రమ నిర్మాణాలు, చెరువులు, నాలాల కబ్జాపై ఫోకస్ పెట్టిన హైడ్రా..గత కొన్ని రోజులుగా అడ్వర్టైజ్ మెంట్ హోర్డింగ్స్ పై ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. శివారు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 50 కి పైగా హోర్డింగ్స్ ను హైడ్రా సిబ్బంది తొలగించింది. అయితే లేటెస్ట్ గా హైదరాబాద్ లోని భారీ హోర్డింగ్స్ పై మార్చి 3న హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో భేటీ అయిన హైడ్రా కమీషనర్ రంగనాథ్ అనుమతులు లేని అడ్వర్టైజ్ మెంట్ హోర్డింగ్ లకు డెడ్ లైన్ విధించారు. మార్చి 9 లోపు ఏజెన్సీలు హైదరాబాద్ లో స్వయంగా అనుమతి లేని హోర్డింగులను తొలగించాలని ఆదేశించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. లేకుంటే నిబంధనలు ఉల్లంఘించిన హోర్డింగులను హైడ్రా తొలగిస్తుందని హెచ్చరించారు కమిషనర్ రంగనాథ్. అక్రమ హోర్డింగుల తొలగింపులో ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. హోర్డింగ్ ల ద్వారా ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం రావాల్సి ఉన్నా .. అక్రమ హోర్డింగ్ లు పెట్టడంతో కేవలం రూ. 20 నుంచి 30 కోట్లు మాత్రమే వస్తుందన్నారు కమిషనర్ రంగనాథ్. ఇప్పటికే హైదరాబాద్ లో ప్రభుత్వ స్థలాలు కబ్జాలు.. ఆక్రమణలపై 2025 జనవరి నుంచి ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా కమిషనర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఆక్రమణలు నిజమైతే కూల్చివేతలు చేపడుతున్నారు.



### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మహమూద్ అలీ !

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఎన్నికల హడావిడి నెలకొంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయింది. ఎమ్మెల్యే కోటా ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ స్టార్ట్ అయింది. ఇక నేటి నుంచి ఈనెల 10 వతేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉండనుంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణకు గడువు ఉంటుంది. తెలంగాణ ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీ కాలం ఈ నెల 29తో ముగియనుంది. ఈ ఐదుగురి స్థానంలో కొత్త వారిని ఎన్నుకోనున్నారు. ప్రస్తుతం శాసనసభలో పార్టీలకున్న సంఖ్యా బలాన్ని బట్టి కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీ స్థానాలు, BRS ఒక ఎమ్మెల్సీ సీటు దక్కే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీలు కసరత్తులు ప్రారంభించాయి. అయితే... బీఆర్ఎస్ MLC అభ్యర్థిగా మహమూద్ అలీ కు ఛాన్స్ ఇవ్వనున్నారట కేసీఆర్.



### కృష్ణా జలాల్ని ఏపీ అక్రమంగా వాడుకుంటోంది
### ఏపీ బనకచర్లతో కూడా ఇదే సమస్య వస్తది

# ఇదేం పద్ధతి..

## ఏపీ సర్కార్‌పై కేంద్రానికి సీఎం రేవంత్ కంప్లైంట్!

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. డిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ తో సీఎం రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్. నీటి కేటాయింపులు..ప్రాజెక్టులకు నిధులపై ప్రధానంగా చర్చించామని చెప్పారు.

కృష్ణాజలాల్ని ఏపీ అక్రమంగా వాడుకుంటోందన్నారు. దీనిపై జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ను కోరినట్లు చెప్పారు. ఏపీ కృష్ణా నీటిని అక్రమంగా తరలించుకపోతుందన్నారు. కృష్ణా డెల్టా స్థిరీకరణ చేసుకుని ఎక్కువ నీటిని వాడుకుంటోందన్నారు. గోదావరి ప్రాజెక్టుపై ఏపీ నిర్మిస్తోన్న బనకచర్లపై అభ్యంతరం చెప్పామన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ తో గోదావరిలో కూడా ఇదే తరహా సమస్య వస్తుందన్నారు రేవంత్ రెడ్డి. నికర జలాల కేటాయింపు తర్వాతే ఏదైనా ప్రాజెక్టకు అనుమతివ్వాలన్నారు రేవంత్. మేం నికర జలాలపై సమ్మక సారక్క ప్రాజెక్టు, సీతారామ తదితర ప్రాజెక్టులు కడుతున్నాం. మా శాశ్వత కేటాయింపుల్లోని ప్రాజెక్టులపై ఏపీ ఎందుకు అభ్యంతరం చెబుతోంది?. గోదావరి వరద జలాలపై కట్టే ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలంటే ముందుగా నికర జలాల ప్రాజెక్టుల లెక్క తేల్చాల్సిందే. సముద్రంలో వృధాగా కలిసే వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తామని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. అలాంటప్పుడు నికర జలాలపై ఉన్న మా ప్రాజెక్టులకు ఎందుకు అభ్యతరం చెబుతోంది. వరద జలాలపై కట్టిన ఆయకట్టును స్థిరీకరిస్తే ఆ మేరకు నీటి కేటాయింపులు జరుపుతామంటున్నారు. కృష్ణా జలాలపై కూడా అదే పరిస్థితి ఏర్పడింది. ఆయకట్టు లెక్కల ప్రకారమే తెలంగాణకు తాత్కాలిక వాటా తగ్గింది. కృష్ణా డెల్టాలో ఆయకట్టు స్థిరీకరించడం వల్ల 811 టీఎంసీల ఉమ్మడి వాటాలో 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ వినియోగించుకుంటోంది. తెలంగాణ కేవలం 299 టీఎంసీలు మాత్రమే వినియోగించుకుంటోంది. ఇందుకు ప్రధాన కారణం తెలంగాణ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం, ఏపీలో పూర్తయిన ప్రాజెక్టులకు నీటిని కేటాయించడం వల్లనే. కృష్ణా నదిలో తలెత్తిన పరిస్థితి గోదావరి విషయంలో జరగకూడదు. నికర జలాలపై మా ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతనే వరద జలాలపై నిర్మించే ప్రాజెక్టుల సంగతి చూడండి అని రేవంత్ అన్నారు. కృష్ణా నది జలాలను ఏపీ అక్రమంగా తీసుకెళ్తన్నవిషయాన్ని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కు ఫిర్యాదు చేశామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. పాలమూరు రంగారెడ్డి,సీతారామ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరామన్నారు. ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరాం.. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

చురకలు




# యాక్షన్ షురూ..! ఆ సెగ్మెంట్లపై మీనాక్షి స్పెషల్ ఫోకస్

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్లమెంటు సెగ్మెంట్లపై ఫోకస్ పెట్టారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆయా సెగ్మెంట్ల ముఖ్యనేతలను పిలిచి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని మీనాక్షి భావిస్తున్నారు. ఇందుకోసం సమావేశాలు జరపాలని ఆమె నిర్ణయించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో ఈ మీటింగ్స్ ఏర్పాటు చేయనున్నారు.

**పాత, కొత్త లీడర్ల మధ్య సమన్వయంపై దృష్టి**... ప్రధానంగా ఏయే సెగ్మెంట్లలో పార్టీ నేతల మధ్య సఖ్యత లేదు., ఎవరెవరు వర్గాలను పోషిస్తూ వస్తున్నారు?.. ఎవరు వివాదాలకు కారణమవుతున్నారనే దానిపై సమాచారం సేకరించాలని మీనాక్షి పీసీసీకి సూచించినట్టు తెలిసింది. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన లీడర్లు, పార్టీలో కొనసాగుతున్న పాత వారికి మధ్య సఖ్యత వంటి విషయాలపై తనకు తెలపాలని చెప్పినట్టు సమాచారం. అలాంటి వారిని సమన్వయం చేయడంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు.

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు..** నేతలు వర్గపోరును వదిలి పార్టీ బలోపేతానికి కృషి చేసేలా ఒక ప్రణాళికతో ముందుకెళ్లాలని ఉద్దేశంతో.. నేతలతో ఇంటరాక్ట్ కావాలని మీనాక్షి నటరాజన్ ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. గతంలో జిల్లాలు, వర్గాల వారీగా నేతలు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసి తమ అభిప్రాయాలు, కావాల్సిన వాటి గురించి చెప్పుకునేవారు. ఇప్పుడు అందుకు భిన్నంగా స్వయంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ యాక్షన్‌లోకి దిగనున్నారని పార్టీ వర్గీయుల సమాచారం.

**టీపీసీసీలో భారీ మార్పులు!...** అంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అలా కాకుండా నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన నిర్ణయం తీసుకోవాలని మీనాక్షి పీసీసీకి హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. పైరవీలు, పలుకుబడితో పోస్టులు ఇచ్చే విధానం కూడా ఉండబోదని మీనాక్షి చెప్పినట్టు సమాచారం. నూతంగా తెలంగాణ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆమె తొలుత గత నెల 28వ తేదీన గాంధీ భవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి మీటింగ్‌లో పాల్గొన్నారు. ఫస్ట్?మీటింగ్‌లోనే మీనాక్షి తన మార్క్‌ను చూపించారు. ఆడంబరాలకు దూరంగా ఉండే వ్యక్తినని, తన దృష్టిలో పడటం కన్న పార్టీ కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాకతో టీపీసీసీలో భారీగా మార్పులు రానున్నాయని ఆ పార్టీ వర్గీయులే చెబుతున్నారు.

**రేపు మెదక్, మల్కాజిగిరి నేతలతో భేటీ...** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మెదక్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని నేతలతో భేటీ కానున్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు మెదక్, సాయంత్రం 5 గంటలకు మల్కాజిగిరి పార్లమెంటు సెగ్మెంట్ల లీడర్లతో సమావేశం కానున్నట్టు టీపీసీసీ తెలిపింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ అధ్యక్షతన జరిగే మీటింగ్‌లో మీనాక్షి నటరాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. పార్లమెంటు సెగ్మెంట్ల పరిధిలోని మంత్రు లు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ పాల్గొనాలని టీపీసీసీ విజ్ఞప్తి చేసింది.

# రేవంత్ తప్పిదాల వల్లే ఆర్థిక సంక్షోభం.. కేటీఆర్ ఫైర్



హైదరాబాద్: కరోనా కన్నా డేంజరెస్ వైరస్ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏడాది క్రితం చెప్పింది.. ఇవాళ అక్షరాలా నిజమైందని అన్నారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమర్థ సీఎం ఆర్థిక వృద్ధికి గొయ్యితీసి పాతరేశారని విమర్శలు చేశారు. దేశంలోనే అగ్రభాగాన ఉన్న తెలంగాణను ఆఖరికి పడేశారని కేటీఆర్ మండిపడ్డారు. గతేడాది 10 శాతం నమోదైన జీఎస్టీ వసూళ్లు కేవలం ఒకే ఒక్కశాతం వృద్ధికి పడిపోవడం సిగ్గుచేటని అన్నారు. చెత్త నిర్ణయాలతోనే తెలంగాణ ఆర్థిక రంగంలో ఈ విధ్వంసమని చెప్పారు. మతిలేని ముఖ్యమంత్రి ఘోర తప్పిదాల వల్లే ఈ సంక్షోభమని అన్నారు. ప్రభుత్వ పెద్దల కమీషన్లు ఆకాశాన్ని అంటుతుంటే రాష్ట్ర రాబడులు మాత్రం కుప్పకూలడం క్షమించరాని నేరమని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల స్వర్ణయుగాన్ని చెరిపేసి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాసుకునే "చీకటి చరిత్ర" ఇదేనా..అని కేటీఆర్ ప్రశ్నించారు.




ఆర్మూర్ : నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్ పల్లిలో నూతన విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును కలిసి కోరారు. హైదరాబాద్‌లో కేంద్రమంత్రులిద్దరిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్ పల్లిలో నూతన విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేయాలని వారిని కోరారు. విమానాశ్రయం ఏర్పాటుకు గతంలో పంపిన ప్రతిపాదనలను పరిశీలించాలన్నారు. ఈ ఎయిర్ పోర్టు ఏర్పాటు ద్వారా తెలంగాణ యూనివర్సిటీ, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో చుట్టు పక్కల ప్రాంతాల అభివృద్ధితో పాటు ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక, ఉద్యోగ, వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.




# పీఎం మోడీ చెప్పిన ఈ పంటకు పెట్టుబడి రూ.20వేలు.. రాబడి రూ.3-4లక్షలు..

మనదేశంలో నగరాలు, పట్టణాల కంటే పల్లెల్లోనే ఎక్కువమంది ప్రజలు జీవిస్తుంటారు. వీరిలో అధికశాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే. దేశంలో అన్ని రంగాల్లోని వారు ఆర్థికంగా వృద్ధి సాధిస్తున్నా.. అన్నదాతల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అన్నట్టు అక్కడే ఉంది. రాబడితో పాటే పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతూ కష్టానికి తగ్గ ఫలితం పొందలేకపోతున్నారు. అయితే, రైతులు కేవలం రూ.20వేల పెట్టుబడితో ఒక్కసారి ఈ పంటను వేసుకుంటే చాలు. సులభంగా రూ.3-4 లక్షల ఆదాయం వస్తుంది. అదెలాగో ఈ కథనంలో తెలుసుకుందాం..

**ప్రధాని చెప్పినట్లు.. మీ పంట పండుతుంది..** ఈ పంట సాగు చేయడానికి ఎరువులు అవసరంలేదని స్వయంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల మన్ కీ బాత్ ద్వారా రైతులకు సూచించారు. తక్కువ పెట్టుబడితో నిమ్మగడ్డి సాగు చేసి చాలామంది రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతున్నట్లు పేర్కొన్నారు. మరి, నిమ్మ గడ్డి సాగు చేశాక ఎలా మార్కెట్ చేసుకోవాలి. ఏఏ రంగాల్లో వీటికి డిమాండ్ ఉంది.. ఈ పంటసాగు చేస్తే ఎంత డబ్బు సంపాదించవచ్చు తదితర విషయాల గురించి మీకు చెప్తాం.

**కరవు నేలలోనూ సాగు చేయండి.. లక్షలు పొందండి..** నిమ్మగడ్డి సాగు చేయడానికి మొదట కేవలం రూ.20,000 పెట్టుబడిగా పెడితే చాలు. ఫిబ్రవరి, జూలై మధ్య సమయం పంట నాటుకునేందుకు అనుకూలం. ఒక్కసారి విత్తితే 5-6 సంవత్సరాల వరకూ దిగుబడి వస్తుంది. ఒక ఏడాదిలో ఏడాదిలో 6 నుంచి 7 సార్లు కోతకు వస్తుంది. దీన్ని పండించడానికి ఎరువులు అవసరం లేదు. అడవి జంతువులు ధ్వంసం చేస్తాయేమో అనే ఆందోళనా ఉండదు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ పంటను కరవు ప్రభావిత ప్రాంతాల్లో కూడా సాగు చేయవచ్చు. ఉదాహరణకు 1 హెక్టారులో నిమ్మగడ్డి పంట వేస్తే సంవత్సరం తిరక్కుండానే సుమారు రూ.4లక్షల లాభం చేతికొస్తుంది.

**నిమ్మగడ్డికి ఎంత డిమాండ్ ఉందంటే..** నిమ్మగడ్డి నుంచి తయారు చేసిన నూనెకు మార్కెట్లో భారీ డిమాండ్ ఉంది. దీనిని సబ్బులు, నూనెలు, సౌందర్య సాధనాలు, ఔషధాల తయారీకి వినియోగిస్తారు. ఒక లీటరు నిమ్మనూనె ధర రూ.1000 నుంచి రూ.1500లు ఉం టుంది. ఒక ఏడాదిలో హెక్టార్ భూమిలో 100-150 కిలోల నిమ్మ గడ్డిని వస్తుంది. దీని ద్వారా దాదాపు 325 లీటర్ల నూనెను ఉత్పత్తి చేయవచ్చు. ఏటికేడు దీని ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ఇలా మీరు ప్రతి సంవత్సరం ఈజీగా 4 నుంచి 5 లక్షలు ఆదాయం పొందవచ్చు.




# రాష్ట్రానికి కేంద్రం చేసిందేమీ లేదు : భూపతిరెడ్డి

సిరికొండ : రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీప్రభుత్వం11ఏళ్లలో చేసింది ఏమీ లేదని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆరోపించారు. పలు శుభకార్యాల్లో పాల్గొనేందుకు సిరికొండకు వచ్చిన ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణన విషయంలో రాష్ట్రం క్లారిటీతో ఉందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాకారం రవి, నాయకులు ఎర్రన్న, గంగాధర్, సామెల్, గౌస్, నర్సారెడ్డి, రాములు, నర్సింగ్, తదితరులు ఉన్నారు. ధర్పల్లి, వెలుగు: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట్?గ్రామంలో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన రామాలయం నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఇంటింటికీ నిధులు సేకరించి దాతలు అందించిన నిధులతో కలిపి ఉత్సవాలను బ్రహ్మండంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సుమన రవిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెలిమెల శ్రీనివాస్, గాదరి మనోహర్ రెడ్డి, గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల సుదర్శన్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్ : హెూలీ పండుగ పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు ప్రకటించింది. ఈ రైళ్లు ఈ నెల 9 నుంచి 25 వరకు వివిధ రూట్లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని ఎస్సీఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు.

ఈ నెల 9 నుంచి16 వరకు చర్లపల్లి-షాలిమార్, షాలిమార్ నుంచి చర్లపల్లికి 4 రైళ్లు నడపనున్నట్టు చెప్పారు. చర్లపల్లి - సంత్రాగచి మధ్య 4 సర్వీసులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. ఇవి నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, కొత్త వలస, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, బెర్హంపూర్, కుర్ధా, భువనేశ్వర్, భద్రక్, జలేశ్వర్, ఖరగ్ పూర్‌స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.




హైదరాబాద్ : భార్యను ముక్కలుగా నరికి కుక్కర్‌లో ఉడికించిన మీర్‌పేట్ గురుమూర్తి ఘటన వెలుగుచూసిన నెలల వ్యవధిలోనే మరో దారుణం జరిగింది. భార్యను హత్య చేసి, గుండె పోటు కథ అల్లిన భర్త ఉదంతం హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పరిధిలో వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఓల్డ్ మలకపేట జమున టవర్స్?లో సింగం శిరీష, వినయ్ కుమార్ అనే దంపతులు నివాసం ఉంటున్నారు. శిరీష స్వగ్రామం శ్రీశైలం సమీపంలోని దోమలపేట. శిరీష జమున టవర్స్?లోని తన నివాసంలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. గుండెపోటు అని శిరీష తల్లిదండ్రులకు కాల్ చేసి ఆమె భర్త వినయ్ సమాచారం ఇచ్చాడు. శిరీష కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరకముందే ఆమె మృతదేహాన్ని సొంత గ్రామం శ్రీశైలం సమీపంలోని దోమల పెంటకు అంబులెన్సులో తరలిస్తుండగా పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో కొట్టి చంపి.. గుండెపోటుగా చెబుతున్నారని.. శిరీష భర్త గుండెపోటు కథ అల్లాడని చాదర్ ఘాట్ పోలీసులకు శిరీష కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తన కూతురును అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాడని శిరీష కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనతో ఓల్డ్ మలకపేటలోని జమున టవర్స్? ఉలిక్కిపడింది. మీర్‌పేట్ గురుమూర్తి ఉదంతం వెలుగుచూసిన నెలల వ్యవధిలోనే ఇలాంటి మరో ఘటన జరగడం గమనార్హం. చిన్న చిన్న గొడవల కారణంగానే తన భార్య పుట్ట వెంకటమాధవిని నిందితుడు ముందస్తు ప్లాన్ ప్రకారం హత్య చేశాడని గురుమూర్తి కేసులో పోలీసులు తేల్చిన సంగతి తెలిసిందే. హత్య అనంతరం శిక్ష పడకుండా ఉండేలా ఆధారాలు దొరకకుండా చేయాలనే తన భార్య డెడ్ బాడీని ముక్కలు ముక్కలుగా చేసి డిస్పోజ్ చేసినట్టు గుర్తించారు. వెంకటమాధవి డెడ్ బాడీని ఎలాంటి ఆధారాలు లేకుండా మాయం చేసి, కేసును డైవర్ట్ చేయాలని గురుమూర్తి భావించాడు. ఒకవేళ పోలీసులు హత్య అని గుర్తించినా.. ఆధారాలు దొరకకుండా డెడ్ బాడీని డిస్పోజ్ చేయాలని అనుకున్నాడు. ముందుగా డెడ్ బాడీని బాత్ రూంలోకి తీసుకెళ్లాడు. కండ్లు, ఆ తర్వాత చేతులు, మెడ వేరు చేశాడు. ఎముకల నుంచి మాంసం కోశాడు. తర్వాత మాంసం ముద్దలను చిన్న చిన్న ముక్కలుగా చేసి బకెట్ లో వేసి హీటర్ పెట్టి బాయిల్ చేశాడు. ఆ నీటిని టాయిలెట్ కుండీలో వేసి ఫ్లష్ చేశాడు. తర్వాత మాంసం ముక్కలను స్టవ్ పై కాలుస్తూ బొగ్గుగా మార్చాడు. ఆ బొగ్గు ముక్కలను కూడా టాయిలెట్ లో వేసి ఫ్లష్ చేశాడు. తర్వాత ఎముకలను రోలు, రోకలితో దంచి పిండిగా మార్చి, పక్కకు పెట్టాడు. అనంతరం రూమ్ ను డిటర్జెంట్, ఫినాయిల్, యాసిడ్ తో క్లీన్ చేశాడు. ఆ తర్వాత ఎముకల పిండిని బకెట్ లో తీసుకుపోయి జిల్లెలగూడ సందె చెరువులో కలిపేశాడు. ఉదయం 8 గంటలకు భార్యను హత్య చేసిన గురుమూర్తి.. సాయంత్రం 6 గంటలకల్లా పది గంటల్లోనే డెడ్ బాడీని డిస్పోజ్ చేశాడని పోలీసులు వెల్లడించారు.

# పుత్ర గణపతి వ్రతం




ఫాల్గుణ మాసం లో వచ్చే శుక్ల పక్ష చతుర్థి నాడు పుత్ర గణపతి వ్రతం జరుపుకుంటారు. మంచి సంతానం కోసం, సంతానం లేని వాళ్ళు సంతా నం కలగడం కోసం ఈ వ్రతం జరుపు కుంటారు అని పురాణాలు చెబుతున్నాయి. వారసుడు కావాల నే కోరిక %ొ% తమ తరువాత ఆడపిల్ల ల బాగోగులు చూసుకోవడానికి ఒక మగ సంతానం కావాలనే కోరిక కొంతమందిలో బలంగా కనిపిస్తూ వుంటుంది. ఈ విషయంగా ఎక్కువకాలం నిరీక్షించవలసి వచ్చినప్పుడు, పుత్ర గణపతి వ్రతం జరుపుతుంటారు. త్రిగుణాత్మకం స్వరూపుడు , త్రైమూ ర్త్య భావనతో విరాజిల్లుతున్న వినాయకుడు వైదిక కాలం నుండి భారతా వనిలో ఆది దైవ స్వరూపం గా ఉపాసించ బడుతున్నాడు . ప్రకృతిలో రజస్తమో గుణాది స్వరూపు డైన విఘ్నేశ్వరుని ' గుణేశు డు ' అని అభివర్ణించారు. కాలక్రమేణ గణేశుడు అయినాడు . గాణాపత్యం సంప్రదాయానుసారం గణము అనగా సత్య రజస్తమో గుణ సమ్మేళనం. ఈ త్రిగుణాధిపతి విఘ్నేశ్వరుడు పురాణేతిహాసాల బట్టి సకల దేవతా గణాలకు అధిపతి కనుక గణపతి సార్థక నామధేయం కలిగింది. లింగ పురాణం ప్రకారం బలగర్వితులైన రక్కసులు, స్వర్గ లోకాన్ని ఆక్రమిం చి, దేవతలను అష్ట కష్టాలకు గురి చేయగా వారు పరమ శివుని ప్రార్థిం చగా, ఆయన రాక్షస సంహారానికి గణపతిని సృష్టించి, రాక్షసులను సంహరించ మనగా, అందులో తన ప్రమేయం లేదని, ఆగ్రహించిన పార్వతి, పరమేశ్వరునిపై కోపాన్ని గణపతిపై ప్రదర్శించి, ఏనుగు తలతో, బాన కడుపుతో, వికార రూపుడై ఉ ండునటు శపించగా, చింతా క్రాంతుడైన గణేశుని, శివు దూరడించి, సకల దేవత గణాధి పతిగా, సకల విఘ్న నివారణ దైవంగా అనుగ్రహించాడు. మరో కథనం ప్రకారం గజాసురుని సంహ రించి, పరమేశ్వరుని అనుగ్రహంతో పార్వతి చేత పిండి బొమ్మగా చేయబడి, ప్రాణాలు కోల్పోయిన గణపతి, గణాసురుని తలతో పునరుజ్జీవితుడైనట్లు ప్రచారంలో ఉంది. ఆ సమయంలో పరమేశ్వ రుడితో సహా దేవతలందరూ పార్వతీ ఒడిలో ఉన్న వినాయకుని స్తుతించిన స్తుతిని విన్న అమ్మ వారు, ఎవరైతే ఈస్తుతిని గౌరీ సమేత గణపతిని ఫాల్గుణ శుక్ల చవితి యందు పఠించి నువ్వులు, బెల్లము నివేదన చేసి ప్రసాదముగా స్వీకరిస్తారో అట్టి భక్తులందరికీ నాకే విధముగా అయితే పుత్రశోకము తొలగి పుత్రవృద్ధి కలిగినదో అదే విధముగా అందరికీ పుత్రోత్పత్తి కలిగి వంశవృద్ధి జరుగునని జగదంబ పార్వతి వరమిచ్చినట్లు పురాణ కథనం. భాద్రపద శుద్ధ చవితి నుండి సరిగ్గా180 డిగ్రీలు అంటే 180 రోజులు అంటే ఆరు నెలలు గడిచే సరికి ఫాల్గుణ శుద్ధ చవితి వస్తుంది. ఆనాటికి వినాయక చవితికి గణ పతి నక్షత్ర సమూహం సూర్యాస్త మయం కాగానే ఉదయిస్తుంది. వేదంలో చెప్పిన సూత్రం ప్రకారం – ఆనాడు కూడా పూజ్యదేవత గణపతే. అందుకే ధర్మశాస్త్ర కారకులు ఆనాడు "పుత్ర గణపతి వ్రతం" అన్నారు. పూర్వం మహారాజులు %ొ% చక్రవర్తు లు వారసత్వానికి ఎక్కువగా ప్రాముఖ్యతను ఇచ్చిన కారణంగా వాళ్లంతా పుత్ర సంతానాన్ని ఎక్కువగా కోరుకునేవారు. తమ తరువాత తమ రాజ్య భారాన్ని కొడుకే స్వీకరించాలని వాళ్లు భావించే వాళ్లు. ఇక పున్నామ నరకం నుంచి తప్పించే వాడు పుత్రుడే అనే మహర్షుల వాక్యం కారణంగా కూడా వాళ్లు పుత్ర సంతానం కోసం ఆరాటపడే వాళ్లు. ఇందుకోసం వాళు 'ఫాల్గుణ శుద్ధ చవితి' రోజున 'పుత్ర గణపతి' వ్రతాన్ని ఆచరించే వాళ్లు. అలా ఈ రోజున ఈ వ్రతాన్ని ఆచరించి ఆ పుణ్యఫల విశేషం కారణంగా పరాక్రమవంతులైన పుత్రులను పొందిన రాజులు ఎంతోమంది ఉన్నారు. మొక్కు బడిగా కాకుండా ఎవరైతే అంకిత భావంతో గణపతిని మెప్పిస్తారో ఆ దంపతులకు అనతి కాలంలోనే పుత్ర సంతానం కలుగుతుందని ఆధ్యాత్మిక గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రోజున ఎవరైతే తమకు పుత్ర సంతానం కావాలనే సంకల్పంతో వినాయకుడిని పూజి స్తారో వారి కోరిక తప్పనిసరిగా నెరవేరుతుందని సాక్షాత్తు పరమశివుడే పార్వతీదేవితో చెప్పినట్టుగా ఆధ్యాత్మిక గ్రంధాలు ప్రస్తావిస్తున్నాయి. రాజులు తమ ప్రాభవాన్ని కోల్పోయినా %ొ% రాచరికాలు గత చరిత్రగా మిగిలిపోయినా 'పుత్రగణపతి వ్రతం' మాత్రం నాటి నుంచి నేటి వరకూ ప్రాచుర్యాన్ని పొందుతూనే ఉంది. ఫాల్గుణ శుద్ధ చవితి రోజున ఉదయాన్నే తల స్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాల ను ధరించాలి. వాకిట్లో ముగ్గులు పెట్టి, గడపకు పసుపు రాసి కుంకుమ దిద్ది, గుమ్మానికి తోరణాలుకట్టి, పూజా మందిరాన్ని అలంకరించాలి. ఈ రోజున ఉప వాస దీక్షను చేపట్టి, స్వామి వారిని షోడశ ఉపచారాలతో పూజించాలి. ఆయనకు ఇష్టమైన పండ్లను %ొ% పిండి వంటలను నైవేద్యంగా సమర్పించాలి. సాయంత్రం వేళలో కూడా స్వామిని పూజించి ఆ తరువాత ఉపవాస దీక్షను విరమించాలి. ఈ విధంగా నియమ నిష్టలను ఆచరిస్తూ అంకిత భావంతో ఈ వ్రతాన్ని ఆచరించడం వలన మనోభీష్టం నెరవేరుతుందని చెప్పబడుతోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# 'మామునూర్ ఎయిర్ పోర్టు' క్రెడిట్ ఎవరిది? ఇప్పుడు ఇదే లొల్లి?



కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సాటి తెలుగు రాష్ట్రం తెలంగాణకు 'మామునూర్ ' ఎయిర్ పోర్ట్ రావడంలో కీలక పాత్ర పోషించారు. అన్ని అనుమతులు ఇచ్చేశారు. తెలంగాణకు తీపి కబురును అందించారు. ఇక వరంగల్ లో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ విమానాశ్రయానికి కావాల్సిన భూములు, నిధులను రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాగా అందజేయడంతో ఈ ఎయిర్ పోర్ట్ పట్టాలెక్కింది. అయితే ఇప్పుడు దీని క్రెడిట్ కోసం కాంగ్రెస్, బీజేపీలు కొట్టుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. తాంబూలాలు ఇచ్చిన రామ్మోహన్ నాయుడు కు బీజేపీ, కాంగ్రెస్ తన్నుకు చస్తున్న తీరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. మామునూరు ఎయిర్ పోర్టు తమ వల్లే వచ్చిందంటూ తెలంగాణలోని వరంగల్ లో అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఉదయం ఘనంగా సంబరాలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో కేంద్రంలోని అధికార పార్టీ బీజేపీ శ్రేణులు కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసేందుకు మామునూర్ ఎయిర్ పోర్టు వద్దకు చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ అనూహ్య పరిణామాన్ని తెలుసుకున్న పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకుని పరిస్థితిని నియంత్రించేందుకు ప్రయత్నించారు.

**– ఎయిర్ పోర్టు కోసం ఎవరి బాధ్యత ఎంత?** ఎయిర్ పోర్టును ఏర్పాటు చేయాలని కోరడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. ఈ నేపథ్యంలో, మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ వంతు పాత్ర పోషించాయి. ఈ సందర్భంలో, బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం విమర్శలు చేసుకోవడం మొదలుపెట్టాయి..

**–రామ్మోహన్ నాయుడు కీలకపాత్ర..** కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా టీడీపీ యువ నేత కింజరాపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత పౌర విమానయాన శాఖ కార్యకలాపాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. మామునూరు ఎయిర్ పోర్టు అమలుకు కేంద్రం త్వరితగతిన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిపాదనలను ఆయన అత్యంత ప్రాధాన్యంగా పరిగణించి, వాటిని అమలు చేయించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆయనకు దక్కాల్సిన క్రెడిట్‌ను బీజేపీ, కాంగ్రెస్ లాక్కోవాలనే ప్రయత్నం చేస్తున్నాయా? అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చనీయాంశంగా మారింది. మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటు రాష్ట్ర ప్రజలకు గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. అయితే, ఈ విజయాన్ని రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం వాడుకోవడాన్ని మానుకుని, ప్రజాసేవకే తమ ప్రాధాన్యాన్ని కేటాయించాలి. ఎయిర్ పోర్టు ఏర్పాటులో సహకరించిన ప్రతి ఒక్కరి కృషిని గుర్తించి అభినందించాలి.

# రామలక్ష్మి, ఆరుద్ర రచనలు భవిష్యత్ తరాలకు ప్రేరణలు

## మార్చి 3...కె. రామలక్ష్మి వర్ధంతి



తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రవేసిన రచయిత్రి, విమర్శకురాలు కె. రామలక్ష్మి. ఆమె కథలు, వ్యాసాలు, విమర్శనాత్మక రచనలు సామాజిక స్పృహ, స్త్రీల సమస్యలు, సాహిత్య విశ్లేషణతో నిండినవిగా ఉంటాయి. ఆమె రచనలు సమాజాన్ని ప్రతిబింబించే దర్పణంగా నిలుస్తాయి. కె. రామలక్ష్మి 1930 డిసెంబరు 31న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (ప్రస్తుత) కాకినాడ జిల్లా, కోటనందూరులో జన్మించారు. ఆమె అసలు పేరు కామరాజుగడ్డ రామలక్ష్మి. చిన్నతనం నుంచే ఆమెకు పఠనం, సాహిత్యం పట్ల గాఢమైన ఆసక్తి. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ. పట్టభద్రులుగా పట్టా పొందారు. ఆంగ్ల భాష, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం లో ప్రత్యేకమైన అవగాహన పెంపొందించు కున్నారు. 1954లో ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు ఆరుద్ర (భగవతుల శంకరశాస్త్రి) గారిని వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. కె. రామలక్ష్మి 1951 నుంచి రచనలు ప్రారంభించారు. ఆమె రచనలు విభిన్న కోణాలను, ముఖ్యంగా మహిళా సమస్యలు, సామాజిక సమస్యలను స్పృశించేలా ఉంటాయి."తెలుగు స్వతంత్ర" పత్రికలో ఇంగ్లీష్ విభాగానికి ఉప సంపాదకులుగా పనిచేశారు. పలు రచనలు అనువదించారు. సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసి, ప్రామాణికమైన సాహిత్య విమర్శ అందించారు. తెలుగు సాహిత్యంలో మహిళా రచయిత్రుల స్థానం, వారి రచనల విశ్లేషణపై ప్రత్యేకంగా పరిశోధనలు చేశారు. సామాజిక అసమానతలు, స్త్రీల హక్కులు, జీవితానుభవాలను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత అనుభూతిని సామూహిక చైతన్యంగా మార్చగల శక్తి ఆమె రచనలకు ఉంది. ఆమె రచనల్లో నారీవాదం, జీవిత సత్యాలు, గాఢమైన భావోద్వేగాలు స్పష్టంగా కనిపిస్తాయి. కె. రామలక్ష్మి చిన్న కథలు, వ్యాసాలు, విమర్శలు, అనువాద రచనలు చేశారు. ఆమె రచనల్లో కొన్ని:అంతర్వాహిని, అందం చెడిన కాంతం, అందమైన పొరుగు, అందుకో ఈ ప్రేమలేఖ, అదెక్కడ?అద్దం, అధిక చక్కని పీడకల, ఏ సర్టిఫికెట్?.ఆరుద్ర రచనల మీద ఆమె విశ్లేషణాత్మక వ్యాసాలు వ్రాశారు. చారిత్రక పరిశోధనల లోనూ ఆమె ఆరుద్రకు సహాయ సహకారాలు అందించారు. తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రపై వివిధ వ్యాసాలు రచించారు. మహిళల హక్కుల కోసం స్త్రీ సంక్షేమ సంస్థలలో పనిచేశారు. స్త్రీల సమస్యలపై వ్యాఖ్యానాలు, పత్రికా వ్యాసాలు రాశారు. ఆమె రచనలు సామాజిక చైతన్యాన్ని కలిగించేవిగా ఉన్నాయి. కె. రామలక్ష్మి సాహిత్య సేవలకు గుర్తింపుగా అనేక పురస్కారాలు లభించాయి. ముఖ్యంగా: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి "కళారత్న" (హంస) పురస్కారం 2016, ఏప్రిల్ 8, గృహలక్ష్మి స్వర్ణకంకణం సాహిత్య సేవకు గుర్తింపుగా ప్రదానం కె. రామలక్ష్మి 2023, మార్చి 3న హైదరాబాద్, మలక్‌పేట లో కన్నుమూశారు. ఆమె రచనలు, విమర్శలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తాయి. ఆమె రచనలు ఆదునిక మహిళా రచయిత్రులకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉన్నాయి. కె. రామలక్ష్మి ఒక గొప్ప కథా రచయిత్రి మాత్రమే కాక, సాహిత్య విమర్శకురాలు, సామాజిక పరిశీలకురాలు కూడా. ఆమె రచనలు సమాజాన్ని గమనించడమే కాదు, దానికి మార్గదర్శనం చేసేలా ఉన్నాయి. ఆమె సాహిత్య సేవలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి."సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేసే శక్తిగా ఉండాలి" అనే సిద్ధాంతాన్ని తన రచనల ద్వారా నిరూపించిన కె. రామలక్ష్మి రచనలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ప్రయాణికులకు గుడ్ న్యూస్... 'చిల్లర' సమస్యలకు అలా చెల్లు చీటి!

ఆర్టీసీ బస్సుల్లో ప్రయణించే సమయంలో ప్రధానంగా ఎదురయ్యే సమస్యల్లో టిక్కెట్ కు సరిపడా చిల్లర ఇవ్వలేకపోవడం ఒకటి. 'టిక్కెట్టుకు సరిపడా చిల్లర ఇవ్వండి.. కండక్టర్ కు సహకరించండి' అని సూచనలు బస్సులో కనిపించినప్పటికీ.. 10 రూపాయల దూరానికి 500 నోటు ఇచ్చేవారు.. రూ.12 టిక్కెట్ కి రూ.100 ఇచ్చేవారు కనిపిస్తుంటారని అంటారు. దీంతో.. పెద్ద నోటు ఇచ్చినా, చిల్లర ఇవ్వాల్సి వచ్చినా కండక్టర్ కు అది చికాకుగా అనిపిస్తుంటుంది. కారణం.. ప్రయాణికుడుది ఇండివిడ్యువల్ సమస్య కాగా.. కండెక్టర్ ది అందరికీ సర్దిచెప్పాల్సిన, సమకూర్చాల్సిన సమస్య. ఈ సమయంలో ప్రయాణికులకు, కండెక్టర్ కు పలుమార్లు గొడవలు అవుతుంటాయి. కొన్నిసార్లు టిక్కెట్ వెనుక రాసి ఇస్తుంటారు. దిగేటప్పుడు ఆ టిక్కెట్ చూపించి చిల్లర తీసుకోమని కండక్టర్ చె బుతుంటారు. అయితే.. కొన్ని సందర్భాల్లో ఆ విషయం మరిచిపోయి ఆ తర్వాత బాధపడే ప్రయాణికుల సంఖ్యా తక్కువేమీ కాదు. ఈ నేపథ్యంలో కొంతమంది మాత్రం టిక్కెట్ కు సరిపడా చిల్లర ఇచ్చి సహరిస్తుంటారు. ఏది ఏమైనా... ఈ చిల్లర సమస్యకు చెక్ పెట్టాలని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. అవును... ఆర్టీసీ బస్సుల్లో 'చిల్లర' సమస్యకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా... ఇకపై బస్సుల్లో ఆన్ లైన్ టికెటింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో... సిటీ బస్సుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో ప్రయాణం చేయవచ్చని తెలిపింది. అంటే.. యూపీఐ పేమెంట్స్ ద్వారా టిక్కెట్ తీసుకోవచ్చన్నమాట. ప్యాసింజర్లకు, కండక్టర్లకు మధ్య చిల్లర వల్ల వచ్చే గొడవలకు స్వస్థి పలికేందుకే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో.. ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ లో భాగంగా ఈ విధానం తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు! ఇదే సమయంలో.. త్వరలో మరిన్ని ఆన్ లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు!

# కాంగ్రెస్ మహిళా నేత హిమాని కేసులో షాకింగ్ ట్విస్ట్.. నిందితుడు ఎవరంటే?

హర్యానాలో కాంగ్రెస్ మహిళా నేత హిమాని నర్వాల్ దారుణ హత్యకు గురవడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, హిమాని హత్య కేసులో సోమవారం ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు ఢిల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించబడగా, అతడు హిమాని సన్నిహితుడు అని పోలీసులు అనుమానిస్తున్నారు.

**– హిమాని హత్య కేసులో కీలక మలుపు...** హిమాని నర్వాల్ హత్య కేసులో అరెస్టయిన నిందితుడి వివరాలను పోలీసులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే, అతని వద్ద నుంచి హిమాని మొబైల్ ఫోన్, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు విచారణలో నిందితుడు హిమాని స్నేహితుడిగా, అత్యంత సన్నిహితుడిగా ఉన్నట్లు తేలింది. అంతేకాదు అతడు హిమాని నివాసానికి సమీపంలోనే ఉంటున్నాడని సమాచారం.

హిమాని అతడిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిందని కొన్ని ఆరోపణలు కూడా వెలువడుతున్నాయి. ఈ అంశంపై మరింత సమాచారం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

**– హత్యకు దారితీసిన ఘటన..** హిమాని నర్వాల్ గత శనివారం హత్యకు గురయ్యారు. హత్య అనంతరం దుండగులు ఆమె మృతదేహాన్ని



సూట్ కేసులో మూటగట్టి ఓ నిర్మానుష ప్రాంతంలో పడేశారు. రోహతక్ జిల్లాలోని సంప్లా బస్టాండ్ సమీపంలో ఓ అనుమానాస్పదమైన సూట్ కేసు కనపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు కేసును పరిశీలించగా, అందులో హిమాని మృతదేహం బయటపడింది. మృతదేహంపై గాయాలున్నాయని, ప్రత్యేకించి మెడపై గాయాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. దీంతో, ఇది హత్యేనని స్పష్టమైంది.

**– హిమనీ తల్లి సంచలన ఆరోపణలు**... హిమాని నర్వాల్ గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో పదేళ్లుగా సేవలందించినట్లు తెలిసింది. హిమాని హత్యపై ఆమె తల్లి సవిత తీవ్ర ఆరోపణలు చేశారు. తన కూతురు కాంగ్రెస్‌లో ఎదుగుదలను తట్టుకోలేక కొందరు నేతలే హత్య చేయించారని ఆమె ఆరోపించారు. పార్టీలో కొంతకాలంగా గొడవలు, వాగ్వాదాలు జరుగుతున్నాయని, తన కూతురు తనతో చెప్పేదని తెలిపారు. హిమాని హత్యపై న్యాయం జరిగే వరకు ఆమె అంత్యక్రియలు చేయనని తల్లి స్పష్టం చేశారు.

**– దర్యాప్తు వేగవంతం**... హిమాని నర్వాల్ హత్య కేసును వీలైనంత త్వరగా ఛేదించేందుకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సంప్లా డీఎస్పీ రజనీష్ కుమార్ మాట్లాడుతూ, బాధితురాలి కుటుంబం ఢిల్లీలో ఉండగా, హిమాని ఒంటరిగా హర్యానాలో ఉంటున్నారని వెల్లడించారు. ఈ హత్య కేసులో మరిన్ని నిజాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. హిమాని హత్య కేసు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపుతోంది. ఈ హత్యకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# రూ.1,83,01,500 కోట్లు..

## ఏడాదిలో మనోళ్లు దేనికి ఖర్చు చేశారో తెలుసా?

ఏడాది వ్యవధిలో వస్తు సేవల కోసం భారతీయులు ఖర్చు చేసిన మొత్తంపై డెలాయిట్ – ఆర్ఏఐలు తాజాగా విడుదల చేసిన అధ్యయన వివరాలు ఆసక్తికరంగానే కాదు.. ఆశ్చర్యానికి గురి చేసేలా ఉన్నాయని చెబుతున్నారు. 2024లో రూ. 1,83,01,500 కోట్ల భారీ మొత్తాన్ని దేశ ప్రజలు వస్తు సేవల కోసం వెచ్చించారని.. అంతకు ముందు ఏడాది (2023లో) ఇది రూ. 87,15,000 కోట్లు మాత్రమేనని అధ్యయనం వెల్లడించింది. 7.2 శాతం వృద్ధితో అమెరికా.. చైనా.. జర్మనీ కంటే భారత్ వేగంగా ఉన్నట్లు ఈ రిపోర్టు పేర్కొంది. 2026 నాటికి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ గా అవతరించే దిశగా వెళుతుందని పేర్కొన్నారు. ఇది 2030 నాటికి రూ. 20,04,450 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. 2030 నాటికి ఏడాదికి రూ. 8.71 లక్షల కంటే ఎక్కువ సంపాదించే



భారతీయుల సంఖ్య దాదాపు మూడు రెట్లు దూసుకెళ్లి 16.5 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. 2024లో ఇది కేవలం 6 కోట్లు మాత్రమే కావటం గమనార్హం. దేశంలో మధ్యతరగతి వర్గాల వృద్ధి.. విచక్షణ వ్యయంవైపు ప్రాథమిక మార్పును చెబుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. జనాభాలో 52 శాతం ఉన్న జనరేషన్ జెడ్.. మిలీనియల్స్ ఈ మార్పునకు కారణంగా చెబుతున్నారు ప్రీమియం బ్రాండ్లు.. స్థిర ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నట్లుగా వెల్లడించారు. 2030 నాటికి భారతదేశ తలసరి ఆదాయం రూ. 3,48,600 దాటుతుందని అంచనా వేశారు. వివిధ రంగాల్లో కొత్త అవకాశాల్ని ఇది తెరుస్తుందని పేర్కొన్నారు. తమ వాదనకు బలం చేకూరేలా ఒక ఉదాహరణను ఇందులో పేర్కొన్నారు, గత ఏడాది క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లు ఉందని.. 2030 నాటికి ఈ సంఖ్య 29.6 కోట్లకు దూసుకెళుతుందని చెబుతున్నారు. దీంతో.. వినియోగదారులు చేసే ఖర్చులు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

# చురకలు


## సంపాదకీయం

### ఉచిత బస్సుకు బ్రేకులు వేస్తున్నట్లేనా ?

ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచి అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం బడ్జెట్ ని తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఏకంగా 3 లక్షల 22 వేల పై దాటిన ఈ భారీ బడ్జెట్ లో ఉచిత బస్సు పథకానికి సంబంధించిన ప్ర స్తావన ఏదీ లేకపోవడంతో బ్రేకులు పడినట్లేనా అన్న డౌట్లు వ్యక్తం అవుతున్నాయి. ఏపీలో ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంటే బడ్జెట్ లో నిధుల కేటాయింపు జరగాలి కదా అన్న వాదన కూడా ఉంది. నిజానికి చూస్తే ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తారు అని అంతా అనుకున్నారు. ఎందుకంటే తెలంగాణా కర్ణాటక లో ఎన్నికల హామీలలో మొదటిదానిగా ఉచిత బస్సుకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు కాబట్టి. పైగా సామాన్య మహిళలను ఆకట్టుకోవాలన్నా ప్రచారం పీక్స్ కి చేరాలన్నా ఇంతకు మించిన భారీ పథకం వేరొకటి లేనే లేదు కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయలేదు దాని కోసం అధ్యయనాలు కమిటీలు నివేదికలు అంటూ కాలం వెళ్ళబుచ్చింది. అలా ఇతర రాష్ట్రాలలో ఉచిత బస్సు పథకం ఏ తీరున సాగుతుందో అధ్యనం చేయడానికి ఒక కమిటీ ని వేసింది. ముందుగా అధికారులతో కమిటీని వేసి ఆనక మంత్రులతో కూడా కమిటీని వేసింది. ఇలా ఈ కమిటీలు ఇచ్చిన నివేదికలను చూసిన మీదటనే సర్కార్ ఆలోచనలో పడింది అని అంటున్నారు. ఉచిత బస్సు పథకం వల్ల రాజకీయ లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని కూడా ఆయా రాష్ట్రాల పరిణామాలు చెబుతున్నాయని అంటున్నారు. అంతే కాదు మరో వైపు చూస్తే ఆటో కార్మికులు దీని వల్ల నష్టపోతున్నారు. పురుష ప్రయాణీకులలో అవేశం కలుగుతోంది. అలాగే ప్రభుత్వానికి ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఆర్టీసీకి నష్టాలు అలా పెరిగిపోతున్నాయి. దాంతోనే మొదట దసరా నుంచి అనుకున్న ఉచిత బస్సు సంక్రాంతికి అలా ఉగాదికి మారింది కానీ ఇంకా బస్సు రోడ్డెక్కలేదు అని అంటున్నారు. తాజా బడ్జెట్ లో కూడా ఆ ఊసే లేకపోవడంతో సర్కార్ పునరాలోచనలో పడిందా అన్న చర్చ వస్తోందిట. ఇక ఇతర రాష్ట్రాలలో ఉచిత బస్సు పథకం ద్వారా ప్రభుత్వానికి భారం బాగా పెరిగిందని తెలుస్తోంది. అక్కడ అదనపు బస్సులను కూడా కొనుగోలు చేయడం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడం తో ఆర్టీసీ చార్జీలు కూడా పెంచాల్సి వచ్చిందని అంటున్నారు. ఏపీలో చూస్తే ఉచిత బస్సుని జిల్లాలకే పరిమితం చేయాలని చూసినా దానికి కూడా అదనపు సిబ్బంది అవసరం అలాగే అదనపు బస్సులు అవసరం అని అంటున్నారు ఇపుడు ప్రభుత్వం ఉన్న ఈ పరిస్థితులలో అంత ఖర్చు చేయడం కష్టమే అన్న భావన ఉంది. దాంతోనే ఉచిత బస్సు విష్యంలో బ్రేకులు పడ్డాయని అంటున్నారు. అయితే ఇవి తాత్కాలిక బ్రేకులా లేక పూర్తిగానా అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా కర్ణాటక తెలంగాణా ఏపీలలో మహిళలకు ఉచిత బస్సు హామీని ఇచ్చిన పార్టీలు అధికారం అందుకున్నాయి. ఆ రెండు రాష్ట్రాల్లో ఈ పథకం అమలు అయింది. ఏపీలో మాత్రం కాలేదు. మరి దీని మీద కూటమి వేరే ఏ రకమైన ఆలోచన చేసినా మహిళా లోకం ఊరుకుంటుందా అన్నది ఒక చర్చ. ప్రతిపక్షాలు సైతం దీనిని అస్త్రంగా వాడుకోకుండా ఉంటాయా అన్నది మరో చర్చ.

# ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం - మార్చి 4...జాతీయ భద్రతా దినోత్సవం

జాతీయ భద్రతా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 4న నిర్వహించ బడుతుంది. హిందువులు, ముస్లిం లు, పార్సీలు, జైనులు, సిక్కులు, క్రైస్తవులు వివిధ మతాల ప్రజలకు చెందిన ప్రజలతో భిన్న సంస్కృతు లు ఆచార వ్యవహారాలు, వివిధ రకాల వేడుకలు, ఉత్సవాలు జరుపుకునే పెద్ద లౌకిక దేశం మనది. చైనా తర్వాత రెండో అత్యధిక జనాభా కలిగిన దేశం. భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తూ, దేశాన్ని ఒకటిగా నిలపడానికి అవాంఛిత సంఘటనల నుండి ప్రజలను రక్షించడానికి దేశ అన్ని రక్షణ దళాలు తమ కర్తవ్యంలో ఎల్లప్పుడూ ఉంటాయి. పోలీసులు, కమాండోలు, దేశంలో శాంతి భద్రతలను కాపాడు కోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న భద్రతా దళాల కృషిని అభినందించడానికి జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మార్చి 4వ తేదీని జాతీయ భద్రతా దినోత్సవం లేదా రాష్ట్రీయ సురక్ష దివాస్‌గా జరుపు కుంటారు. ప్రతి వ్యక్తికి దేశం పట్ల వారి వ్యక్తిగత బాధ్యతల గుర్తు చేయడం ఈ దిన లక్ష్యం. ముంబైలో కార్మికుల భద్రత గురించి చర్చ మొదలై, 1962లో జరిగిన రాష్ట్ర కార్మిక శాఖా మంత్రుల సమా వేశంలో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాల మీద, ప్రమా దాల పట్ల అప్రమత్తత పెంచాలంటే చేయవలసిన ప్రచారంపైన, కార్మికు లలో భద్రతపట్ల అవగాహన పెంచ డం పైన నిర్వహణ కొరకు ప్రభుత్వ పరంగా ఒక సంస్థ అవసరమని ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ తర్వాత 1965 డిసెంబర్ లో పారిశ్రామిక భద్రత గురించి తొలి సమావేశం ఢిల్లీలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, పలు సంస్థలు పాల్గొన్న ఆ సభలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో భద్రతా మండలి ప్రారంభించాలని నిర్ణయిం చారు. అలా 1966, మార్చి 4న జాతీయ భద్రతా మండలి ఏర్పడింది. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860 క్రింద సొసైటీగా నమోదు చేయ బడింది. తరువాత బాంబే పబ్లిక్




ట్రస్ట్ చట్టం 1950 ప్రకారం పబ్లిక్ ట్రస్ట్ గా నమోదు చేయబడింది. కార్మిక మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఆ మండలి ప్రారంభమయిన మార్చి 4నే "జాతీయ భద్రతా దినోత్సవం"గా జరపాలని నిర్ణయించారు. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ లాభా పేక్షలేని సంస్థ. ఇది ప్రమాదాలు, విపత్తుల నుండి ఉత్పన్నమయ్యే మానవ బాధలను, ఆర్థిక నష్టాలను నివారించడానికి, తగ్గించడానికి తగిన విధానాలు, పద్ధతులు, విధానాలను అవలంబించడానికి సమాజానికి తెలియ జేయడానికి, సమాజాన్ని ప్రభావితం చేయడానికి స్థాపించ బడింది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ భద్రత, ఆరోగ్యం, పర్యావరణ అంశాలను దేశం లోని వివిధ ప్రాంతాలకు చేరవేయడం, పారిశ్రామిక రంగానికి చెందిన వారినందరినీ ఇందులో భాగస్వాములను చేయడం, భద్రత కల్పించ డంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను గుర్తెరిగి అనుసరింప చేయడం లక్ష్యంగా కృషిచేస్తున్నది. సాంప్రదాయకంగా జాతీయ భద్రతా మండలి పరిధిలో నేడు ఉగ్రవాదం నుండి భద్రత, ఆర్థిక భద్రత, శక్తి భద్రత, పర్యావరణ భద్రత, నేరాలను తగ్గించడం, ఆహార భద్రత, సైబర్ - భద్రత మొదలైన ఇతర సైనిక రహిత ప్రమాణాలు ఉన్నాయి. జాతీయ భద్రతా ప్రమాదాల పరిధిలోకి ఇతర దేశ - రాష్ట్రాలు మాత్రమే కాకుండా హింసాత్మక కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల కేసులు, బహుళ జాతి సంస్థల చర్యలు కూడా ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలు కూడా జాతీయ భద్రతలోకి వస్తాయి. ప్రతి పనిలోను ఏదో ఒక ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అధిక ప్రమాదాలు అజాగ్రత్తవల్ల సంభవిస్తున్నవే. రహదారి ప్రమాదాలైనా, పారిశ్రామిక ప్రమాదాలైనా మానవ నిర్లక్ష్యం వల్ల జరగడం దురదృష్టకరం. క్రమక్రమంగా ప్రమాదాల సంఖ్య పెరుగు తున్నందున పారిశ్రామిక , రహదారి భద్రతల మీద ప్రత్యేక దృష్టి పెట్టి, ముందస్తు తగు జాగ్రత్తలు పాటించడం వల్ల కొంతై నా ప్రమాదాలను తగ్గించ వచ్చు. అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి ఎలా బయట పడాలో అవగాహన ఉండడంవల్ల మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంది. అందుకే ఈ సందర్భంగా సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, ఉద్యోగులు, కార్మికులకు ప్రమాదాలు ఎలా జరిగే అవకాశాలు, అవి జరిగినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవన విధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణను ఒక అంతర్గత భాగంగా మలుచు కునేలా చేయడం వల్ల ప్రమాదాలను ఎలా నివారించ వచ్చునో పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మార్చి 4... సంగ్మా వర్ధంతి



లోక్ సభ చరిత్రలో, అన్ని రాజకీయ పార్టీల సార్వత్రిక మద్దతుతో, స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మొదటి వ్యక్తి సంగ్మా. ప్రతిపక్షం నుండి స్పీకర్ పదవిని నిర్వహించిన మొదటి వ్యక్తి, అతి పిన్న వయస్కుడు. పి.ఎ.సం.గ్మా (1947 సెప్టెంబరు 1 %-% 2016 మార్చి 4) ఒక ప్రొఫెసర్, న్యాయవాది, జర్నలిస్ట్, సీనియర్ రాజకీయ నాయకులు. భారత దేశ లోక్ సభా స్పీకరుగా 1096 నుండి 1998 వరకు పనిచేసారు. ఆయన మేఘాలయ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా 1988 నుండి 1990 వరకు పని చేసారు. 1996 నుంచి 1998 వరకు లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించిన సంగ్మా, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపీ)కి ఆయన అధ్యక్షుడు కూడా. పి.ఎ.సంగ్మా పూర్తిపేరు పూర్ణో అజితోక్ సంగ్మా. ఆయన 1947, సెప్టెంబరు 1న మేఘాలయ పశ్చిమ గారో పర్వత ప్రాంతంలోని ఛాపతి గ్రామంలో మరక్ సంగ్మా, చింగ్మీ సంగ్మా దంపతులకు జన్మించారు. షిల్లాంగ్ లోని ఆంటోనీ కాలేజీలో బీఏ (హానర్స్) పూర్తిచేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో పని చేశారు. కాలేజీ చదువుల అనంతరం పూర్తికాలం రాజకీయ నేతగా కెరీర్ ప్రారంభించిన సంగ్మా. 1973లో మేఘాలయ యూత్ కాంగ్రెస్ కమిటీకి ఉపాధ్యక్షుడయ్యారు. తర్వాతి ఏడాది ఆ విభాగానికి జనరల్ సెక్రటరీ అయ్యారు. 1975-1980 మధ్య కాలంలో మేఘాలయ పీసీసీ సెక్రటరీగా వ్యవహరించారు. తురా ఎస్టీ నియోజకవర్గం నుంచి 1977లో (6వ లోక్ సభకు) పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన సంగ్మా, ఎంపీగా కొనసాగుతూ, 1996 మే 25 నుంచి 1998 మార్చి 23 వరకు (11వ లోక్ సభకు) లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించారు. కేంద్రమంత్రి వర్గంలోనూ పలు శాఖలు నిర్వహించిన సంగ్మా. 1988 నుంచి 1990 వరకు మేఘాలయ ముఖ్యమంత్రిగా పని చేశారు. అటుపై మళ్లీ కేంద్ర పదవులు చేపట్టారు. ఈశాన్య ఎంపీల ఫోరం ఛైర్మన్ గా మరణించే వరకూ ఉన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై 1999లో తిరుగుబాటు బావుటా ఎగరేసిన పీఏ సంగ్మా. శరద్ పవార్, తారీఖ్ అన్వర్ లతో కలిసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని ఏర్పాటు చేశారు. అయితే 2011లో రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలవాలనుకున్న ఆయన నిర్ణయాన్ని ఎన్సీపీ సమర్థించక పోవడంతో ఆ పార్టీని వీడి సొంతగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపీ)ని స్థాపించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రణబ్ ముఖర్జీపై పోటీచేసి ఓటమి పాలయినప్పటికీ గిరిజన నేతగా ఆయన చేసిన రాజకీయ పోరాటం చరిత్రలో నిలుస్తుంది. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా పేరుపొందిన ఆయన గిరిజనుల అభ్యున్నతి కోసం కృషిచేశారు. సంగ్మాకు భార్య, కుమార్తె అగాథా, కుమారులు కొన్రాడ్, జేమ్స్ సంగ్మాలు ఉన్నారు. ఆయన ముగ్గురు పిల్లలు కూడా రాజకీయ రంగంలో రాణిస్తుండటం గమనార్హం. అగాథా సంగ్మాకు పార్లమెంట్ కు ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా, తర్వాత కేంద్ర మంత్రిగా రికార్డు ఉంది. గుండెపోటుతో ఆయన 2016 మార్చి 4 న ఉదయం ఢిల్లీలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అనితర సాధ్యం...బులుసు త్యాగం - మార్చి 4...బులుసు సాంబమూర్తి జయంతి

దేశ స్వాతంత్ర్య పోరాటంలో సర్వం త్యాగం చేసిన ఒక చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీ గల వ్యక్తి తీవ్ర నిరాదరణకు గురైన విషయం చాలా మందికి తెలియనిది. ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం కృషి చేసిన నేతను రాష్ట్రం ఏర్పడిన సందర్భం లో ఆయన అహ్వానింప బడని బాధాకరమైన నేపథ్యం ఉంది. రాష్ట్ర శాసన సభాపతిగా పని చేసిన ఓ నేత స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ పొందలేని దుస్థితికి, తిండిలేక భిక్షాటనం చేసిన హృదయ విదారక సన్నివేశాలకు ఆంధ్ర రాష్ట్ర చరిత్ర మౌన సాక్షీభూతంగా నిలిచి ఉంది. కాంగ్రెస్ పార్టీ, స్వాతంత్ర్యానికి ముందు, అధిక శాతం దేశభక్తుల, త్యాగ ధనుల పార్టీగా వుండేది. అలాంటి నిస్వార్థ త్యాగాల భాగస్వామ్య ఫలితంగానే స్వాతంత్ర్య సాధన సాధ్యమైంది. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే నేటి నాయకుల లాగా కాకుండా, స్వాతంత్ర్య సాధనకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని, ఎన్నో రకాలుగా లక్ష్య సాధనలో సకలం ఫణంగా పెట్టి పోరాడిన వారెందరో. లక్ష్య సాధన జరిగాక, నిర్లక్ష్యానికి గురైన వారింకెందరో. అలాంటి వారిలో అగ్రగణ్యుడు... బులుసు సాంబమూర్తి. సుఖమయ జీవితాన్ని గడపడానికి అన్ని అవకా శాలు అంది పుచ్చుకుని కూడా, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన త్యాగధనుడు, అసలు సిసలైన దేశభక్తుడు బులుసు సాంబమూర్తి. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర మరచి పోలేనిది. మహాత్మా గాంధీ కన్నా ముందుగానే కొల్లాయి కట్టి సామాన్య ప్రజలతో మమేక మైన నిస్వార్థ సేవా పరాయణుడు బులుసు సాంబమూర్తి అని, ఈతరం వారికి తెలియక పోవచ్చు. ఆయన తూర్పు గోదావరి జిల్లా, దుళ్ల గ్రామంలో 1886, మార్చి 4 న జన్మించారు. ఆయన తండ్రి సుబ్బావధానులు వేదపండితులు. కుటుంబమంతా దానధర్మాలు చేస్తూ ధార్మిక జీవనం సాగించే వారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులై, విజయనగరం మహారాజా కళా శాలలో కొంతకాలం భౌతిక శాస్త్రం బోధించారు. స్వేచ్ఛా స్వభావి అయిన సాంబమూర్తికి ఈ ఉద్యోగం అంతగా నచ్చలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి న్యాయవాద వృత్తి చేపట్టాలని నిర్ణయించు కున్నారు. బి.ఎల్. పరీక్షలో ఉత్తీర్ణులై 1911లో కాకినాడలో న్యాయవాద వృత్తిని స్వీకరించి, మహాత్ముని పిలుపు నందుకొని న్యాయవాద వృత్తిని వదలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1919లో హెూంరూల్ ఉద్యమంలోను, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోను, 1932లో శాసనో ల్లంఘన ఉద్యమంలో, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో, పలు సత్యాగ్రహాలలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించారు. 1927లో నాగపూరు పతాక సత్యాగ్రహ దళానికి నాయకులు గాను, 1928 లో హిందూస్థానీ సేవా దళానికి అధ్యక్షులుగా పని చేశారు. తరువాత తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా, 1929లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా వ్యవహ రించారు. 1930 ఉప్పు సత్యాగ్రహ సమయంలో తన సహచరులతో చొల్లంగి సముద్ర తీరానికి వెళ్ళి ఉప్పును తయారు చేశారు. సాంబ మూర్తిని అరెస్టుచేసి వెల్లూరు జైలు కు తరలించారు. 1935-37 మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా వ్యవహ రించారు. 1935లో మద్రాసు ప్రోవిన్షియల్ ఎస్సెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి నప్పుడు, చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సాంబమూర్తి 1937 నుంచి 1942 వరకూ స్పీకరుగా ఉన్నారు. 1937లో కాంగ్రెసు మంత్రివర్గ పరిపాలనలో మద్రాసు రాష్ట్ర శాసనసభకు సభాపతిగా విధులను సంప్రదా యాలకు అనుగుణంగా, మర్యా దగా, అద్వితీయంగా నిర్వహించి సభకు గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 1923 లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ కాకినాడలో మూడు రోజులపాటు నిర్వహించిన సభకు దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రాగా, ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా దేశభక్త కొండ వెంకట ప్పయ్య, కార్యదర్శిగా ఉండగా, ఆ సమయంలోనే సాంబమూర్తి ఏకైక కుమారుడు మరణించాడు. అయినా ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అద్భుతమైన బులుసు బాధ్యతగా ఏర్పాట్లు చేసారు. జరిగిన విషాదం తెల్సుకున్న గాంధీజీ ఆ సభ సెషన్ ను ఆపేశారట. భారత కోకిల సరోజినీ నాయుడు సాంబమూర్తి స్థిత ప్రజ్ఞతకు చలించి అప్పటి కప్పుడు ఆ సభలో ఆశువుగా గీతాన్ని ఆలపించారట. ఉప్పు సత్యాగ్రహ సమయంలో ఉప్పు మీద పన్ను ఎత్తివేసే వరకు ఆహారంలో ఉప్పు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడాన్ని బట్టి అయన వ్యక్తిత్వం అర్థం అవుతుంది. 1937లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు స్పీకర్ గా ఎన్నికై, పని చేసి, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనేంచుకు ఆ పదవి వదులు కున్న దేశభక్తులు బులుసు. చెన్నపట్నంలో ఆంధ్ర మహాసల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషించటమే కాక తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటును రాజాజీ, నెహ్రూ వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షకు సిద్ధమైతే, ఆయనను తన ఇంటినే వేదికగా చేసుకో మన్న నాయకుడు సాంబ మూర్తి, అమరజీవి ప్రాణత్యాగం చేసిన ఆ ఇంటిని స్మారక భవనంగా వదిలి కాకినాడకు చేరిన త్యాగమూర్తి బులుసు సాంబమూర్తి. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్ర అవతరణకు నెహ్రూ విచ్చేసినా, కాంగ్రెస్ నాయకులు నెహ్రూకు భయపడి బులుసు సాంబమూర్తికి కనీసం ఆహ్వానం కూడా పంపని నాటి కాంగీయుల వ్యవహార శైలి బులుసుకు చేసిన అవమానికి, నిర్లక్ష్యానికి, నిరాదరణకు పరాకాష్ట . దేశస్వాతంత్ర్యం కోసం ఆదాయం ఇచ్చే న్యాయవాద వృత్తిని ఆయన వదులు కున్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం మద్రాసులో తన ఇల్లు పదులు కున్నారు. స్వాతంత్ర్యం వచ్చింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ బులుసు లాంటి త్యాగమూర్తి ఒంటరివారయ్యారు. భార్య గతించింది. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక మద్రాసులో నివాసం అనవసరంగా భావించి, సొంత ఊరు కాకినాడ చేరితే జీవితం బాగుపడుతుందని అనుకున్నారు. ఆయన నమ్ముకున్న కాకినాడలో పరిస్థితులు మరింతగా మారి పోయాయి. ఒకప్పుడు మహర్షి అని గుర్తింప బడి,ఆయన దర్శనం కోసం వెళుతున్నామని నలుగురిలో చెప్పుకుని బులుసు గారింటికి వెళ్ళటం గొప్పగా భావించిన కాంగ్రెస్ వాదులు, మహర్షి ఎదురుగా కనిపించినా పట్టించు కోని దుస్థితి. ఒకప్పుడు ఆయన్ని ఆరాధించిన వారే ముఖం చాటేశారు. ఆయన ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు అన్నిరకాలుగా సహాయం పొందిన వారు, సాంబమూర్తి ఎదురు పడితే డబ్బులు అడుగుతాడని తప్పుకుని తిరిగారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, సాంబమూర్తికి వయసు మీద పడింది. పేదరికం వెంటాడింది. వేళకు తినలేని పరిస్థితి. ఆదుకునే వారు లేకుండా పోయారు. ఒకనాడు కాకినాడ వీధుల్లో ఖరీదైన




వాహనం మీద లాయర్ గా తిరిగిన సాంబమూర్తి చివరి రోజుల్లో అదే వీధుల్లో కంటి చూపు మందగించి, కాళ్ళకు సరైన చెప్పులు లేక చిరిగిన దుస్తులతో, చేతికర్ర సహాయంతో తిరుగుతూ భిక్షాటనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతిరోజూ సాయంత్రం వేళ దేవాలయాల దగ్గర సమయం గడిపే వారు. దేవాలయాలమ దర్శించి అక్కడి ప్రసాదాలతో కడుపు నింపుకున్నారు. కొన్ని సందర్భా లలో దేవాలయం ముందు బిచ్చగాళ్ళతో చేరి క్షుద్బాధ భరించ లేక చేతులు చాపాడని అంటారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పంపితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి... బులుసు సాంబమూర్తి అనే ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు అనేందుకు తగిన ఆధారాలు ప్రభుత్వ రికార్డులలో లేవని సమాధానం వచ్చిందట. దేశం, నాయకులు విస్మరించిన దేశభక్తుల జాబితాలోని ఒక ప్రముఖుడు మహర్షి బులుసు సాంబమూర్తి. పేదరికంలో మగ్గుతున్న సాంబ మూర్తి గురించి తెలుసుకున్న నాటి కేంద్ర హెూమ్ శాఖ మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ మాత్రమే ఆర్థిక సహాయం అందించారని, రాష్ట్ర నేతలు పట్టించుకోలేదని చెపుతారు. పేదరికం దానికి తోడు మానసిక వ్యథ తోడు కాగా చివరికి 1958 ఫిబ్రవరి 3న కాకినాడలోనే బులుసు సాంబమూర్తి అంతిమ శ్వాస విడిచారు. రాజకీయాలను స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడం నిత్యం కనిపించే నేటి సమాజంలో అఖిలాంధ్ర ప్రజలచే మహర్షి అని గుర్తింప బడిన సాంబమూర్తి వంటి స్వార్థ త్యాగుల త్యాగ నిరతిని ప్రజలు గుర్తుకు చేసుకోవాల్సిన, ఈనాటి నాయకులు గుర్తు చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ఆయన చరిత్రను భావి తరాలకు గుర్తు చేసేందుకు పాఠ్య అంశంగా చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సిబ్బంది లేక ఇబ్బంది..!

ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ బోధనాసుపత్రి (సర్వజనాసుపత్రి)లో వైద్యనిపుణుల కొరత వేధిస్తోంది. కీలకమైన రేడియాలజీ విభాగంలో నిపుణులు లేకపోవటంతో స్కానింగ్ పరీక్షల నిర్వహణ, వ్యాధి నిర్ధారణ నివేదికల జారీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు పలుమార్లు వైద్యాధికారులు నోటిఫికేషన్ వెలువరించినా అభ్యర్థుల నుంచి స్పందన లేదు. ప్రభుత్వం చెల్లించే వేతనాల పట్ల నిరాసక్తతే పోస్టుల భర్తీకి ఆటంకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలు ఎక్కడెక్కడంటే.. సర్వజనాసుపత్రిలో 34 విభాగాలు ఉంటాయి. 115 పోస్టులకు 39 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 21విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ అధ్యాపక పోస్టుల్లో



ఏదో ఒకటి ఖాళీగా ఉంటోంది. రేడియాలజీలో నాలుగు, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్, హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడేసి చొప్పున, జనరల్ మెడిసిన్, అనాటమీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనకాలజీలో రెండేసి చొప్పున, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, డెంటల్, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.


భోధనాసుపత్రిలో ఆచార్యుల పోస్టుల భర్తీకి పలుమార్లు నోటిఫికేషన్లు ఇచ్చాం. అభ్యర్థుల నుంచి స్పందన కనిపించలేదు. దరఖాస్తులు వచ్చిన వాటిలో అర్హులుంటే వెంటనే భర్తీ చేస్తున్నాం. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒకట్రెండు విభాగాలు మినహాయిస్తే వైద్యసేవలు, భోధనకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఖాళీలను భార్తీ చేసేందుకు మరోమారు నోటిఫికేషన్ ఇచ్చేందుకు యత్నిస్తున్నాం.డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, సర్వజనాసుపత్రి, ఖమ్మం

# ఆదాయం ఘనం.. వసతులు గగనం..!

వేంసూరు : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక దేవాలయాలకు వందలు, వేలాది ఎకరాల భూములున్నా, అధికాదాయం సమకూరుతున్నా.. ఆమేరకు అభివృద్ధి పనులు జరగటం లేదు. ఉభయ జిల్లాల్లో రూ.2లక్షల్లోపు ఆదాయం కలిగిన ఆలయాలకు భక్తుల విన్నపాల మేరకు పాలకవర్గాలను అధికారులు నియమించారు. రూ.25లక్షల ఆదాయం కలిగిన ఆలయాలకు జిల్లా కమిషనరేట్ స్థాయిలో పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో జమలాపురం, కందుకూరు, భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, పెద్దమ్మగుడి తదితర ఆలయాలకు సుమారు దశాబ్దకాలంగా పాలకవర్గాలు లేవు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 190, భద్రాద్రి జిల్లాలో 32 ఆలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14,391.32 ఎకరాల భూముల్లో 1,284.07 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూశాఖ లెక్కలు చెబుతున్నాయి.

తాత్కాలిక కమిటీలతోనే సరి.. రూ.25లక్షల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న ఆలయాలకు ఉత్సవాల సమయంలో మూడు నుంచి ఆరునెలల కాలపరిమితితో తాత్కాలిక కమిటీలను దేవాదాయశాఖ అధికారులు నియమిస్తున్నారు. ఈ కమిటీలకు పర్యవేక్షణ మినహా ఎలాంటి అధికారాలు ఉండవు. ఆలయ నిర్వహణలో దేవాదాయశాఖ, ఆలయ అధికారులు ఏపని చేయాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పాలకవర్గాలను నియమిస్తే ప్రధానంగా ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవచ్చు. ప్రభుత్వంతో చర్చించి ఆలయాల పునరుద్ధరణ, అదనపు శాశ్వత నిర్మాణాలకు నిధులు రాబట్టే అవకాశముంది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

వేంసూరు మండలం కందుకూరులో కాకతీయుల కాలం నాటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 365 ఎకరాల భూమి ఉంది. ఏటా రూ.30లక్షల పైచిలుకు ఆదాయం వస్తుంది. ఆలయ ముఖమండపం శిథిలావస్థకు చేరుకుంది. మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మందిరాలు, రథశాలను పునర్నిర్మించాలి. ఆలయాభివృద్ధికి అదే గ్రామానికి



చెందిన హెటిరో(డ్రగ్స్) అధినేత, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రెండేళ్ల క్రితం రూ.2కోట్లు విరాళం ప్రకటించారు. తితిదే నుంచి మరో రూ.4కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆలయాభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు.

అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి 2,224 ఎకరాల భూములున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో దుకాణాల సముదాయం, కోనేరు నిర్మించాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రేణుకాచౌదరి కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆలయాభివృద్ధికి రూ.కోటి ప్రకటించినా వినియోగించుకోలేదు.తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.50 ఎకరాల భూమి ఉంది. దీనిపైనా, భక్తుల కానుకల రూపంలో ఏటా సగటున రూ.6కోట్లు ఆదాయం సమకూరుతుంది. అన్నదానం నిమిత్తం మరో రూ.3కోట్లు ఉన్నాయి. అయినా ఆలయంలో భోజనశాల సౌకర్యాలు మెరుగుపడటం లేదని భక్తులు వాపోతున్నారు.రూ.25లక్షల కన్నా ఎక్కువ ఆదాయం కలిగిన ఆలయాలకు సంబంధిం చి ప్రకటనలిచ్చాం. త్వరలో పాలకవర్గాలను నియమిస్తాం. జీపీఎస్ పద్ధతిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. వీరస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

# వివరాల పరిశీలన ..తప్పుల సవరణ



పెద్దపల్లి : పాఠశాలల్లో సమగ్ర సమాచార సేకరణ ప్రక్రియ పూర్తయింది. 2024-25 విద్యా సంవత్సరానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ (యూడైస్ ప్లస్) సర్వేను గతేడాది సెప్టెంబరులో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి నిధులు కేటాయించనున్నాయి. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారానికి సంబంధించి జిల్లా స్థాయిలో తప్పులేమైనా ఉన్నాయో పరిశీలించిన అనంతరం సవరించి, ప్రభుత్వానికి నివేదించనున్నారు.

**అయిదు రోజుల పాటు నిశితంగా..**

పాఠశాల స్థాయిలో ప్రత్యేక యాప్‌లో ప్రధానోపాధ్యాయుడు నమోదు చేసిన వివరాలపై ఇటీవల అయిదు రోజుల పాటు పునఃపరిశీలించారు. జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆపరేటర్లు ఒక్కో అంశాన్నీ నిశితంగా పరిశీలించారు. పేర్లు, ఇతర వివరాలు నమోదు కాకుంటే ఆయా పాఠశాలల నుంచి తెప్పించుకొని పోర్టల్‌లో పొందుపరిచారు. జిల్లావ్యాప్తంగా 781 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1,02,760 మంది విద్యార్థులున్నట్లు తేలింది. పాఠశాల స్థాయిలో అత్యంత కీలక సమాచారం కావడంతో ఆన్‌లైన్‌లో రాష్ట్ర అధికారులకు నివేదించేందుకు సిద్ధం చేస్తున్నారు.

**మౌలిక వసతుల కల్పనకు కీలకం**

పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు సరిపడా మౌలిక వసతులు కల్పించడానికి యూడైస్ ప్లస్ సర్వే కీలకం. అందుబాటులోని తరగతి గదులు, క్రీడా స్థలాలు, వంట గదులు, తాగునీరు, శౌచాలయాలు, ఇతర మౌలిక వసతుల వివరాలు నమోదు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర వివరాలు, హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు నిక్షిప్తమయ్యాయి. ఆన్‌లైన్ వివరాల ప్రకారం కల్పించాల్సిన వసతులు, అవసరమైన ఉపాధ్యాయుల సంఖ్య తేలనుంది.

తప్పులు లేని జాబితా సిద్ధంజిల్లాలో నిర్వహించిన యూడైస్ ప్లస్ సర్వేపై ప్రధానోపాధ్యాయులతో పలుమార్లు సమీక్షించాం. పాఠశాల స్థాయిలో సేకరించిన వివరాలపై అయిదు రోజుల పాటు నిశితంగా పరిశీలించాం. తప్పులు లేకుండా జాబితా సిద్ధం చేశాం. -మల్లేశంగౌడ్, సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త

# సిబ్బంది ఘనం.. సేవలు శూన్యం



జగిత్యాల : పురపాలికల్లో సేవలను విస్తరింపజేసేందుకు గ్రూప్-4 స్థాయి సిబ్బందిని ప్రభుత్వం 2 నెలల కిందట జిల్లాలోని పురపాలికలకు వార్డు అధికారులుగా నియమించింది. ఇందులో భాగంగా జగిత్యాలకు 48, కోరుట్లకు 18, మెట్‌పల్లికి 11 మందిని కేటాయించారు. వార్డులకు సంబంధించి ప్రజలకు అవసరమైన పారిశుద్ధ్య, మౌలిక సదుపాయాలతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి వీరిని వినియోగించుకోవాల్సి ఉంది. కోరుట్లలో 18 మందికి పన్నుల వసూలు, సర్వే, టౌన్‌ప్లానింగ్ ఇతరత్రా బాధ్యతలు అప్పగించారు. వీరి సేవలతో కోరుట్ల పురపాలిక ఆస్తిపన్ను వసూళ్లలో ముందంజలో నిలిచింది. మెట్‌పల్లిలోనూ 11 మంది వార్డు అధికారుల సేవలను పురపాలిక పూర్తిస్థాయిలో వినియోగించుకుంటుంది.


**జగిత్యాలలో నామమాత్రంగా 48 మంది..**

ప్రత్యేక హోదా కలిగిన జగిత్యాల పురపాలికలో 48 మంది వార్డు అధికారులను నియమించారు. 2 నెలలవుతున్నా ఇప్పటి వరకు వీరికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించలేదు. కేవలం ఆస్తిపన్నుకు సంబంధించి వసూళ్లకోసం వీరి సేవలను వినియోగిస్తున్నారు. వాస్తవంగా ఆస్తిపన్ను వసూలు కోసం 11 మంది బిల్ కలెక్టర్లున్నారు. పన్ను వసూళ్లకు సంబంధించి రశీదులిచ్చే యంత్రాలు వీరివద్దే ఉంటాయి. వార్డు అధికారుల చొరవతో వచ్చిన వినియోగదారులకు బిల్లులు మాత్రం బిల్ కలెక్టర్లే ఇవ్వడం గమనార్హం. జిల్లాకేంద్రమైన పట్టణంలోని 48 వార్డుల్లో నిత్యం పారిశుద్ధ్య సమస్యలు అధికంగా ఉంటాయి. కానీ వీటికి ఔట్‌సోర్సింగ్ సిబ్బందినే వినియోగిస్తున్నారు. వార్డు అధికారులకు పారిశుద్ధ్య బాధ్యతలు అప్పగిస్తే చాలావరకు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. జగిత్యాలలో రెండేళ్లుగా పూర్తిస్థాయి కమిషనర లేక ఇన్‌ఛార్జులే ఉండటంతో వార్డు అధికారులకు ఎలాంటి బాధ్యతలు అప్పగించకలేకపోతున్నారు.

**అన్నింటా ప్రైవేటు సిబ్బందిదే పెత్తనం**

పురపాలికలో పారిశుద్ధ్య, ఆస్తిపన్ను, జనన మరణ ధ్రువీకరణ ఇలా ఏ విభాగంలో చూసినా జగిత్యాల పురపాలికలో ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే పెత్తనం చెలాయిస్తున్నారు. 48 మంది వార్డు అధికారులకు కనీసం కార్యాలయంలో కూర్చుకునేందుకు ప్రత్యేక స్థానమంటూ లేదు. మొన్నటి వరకూ కార్యాలయంలో సిబ్బంది కొరతతో సేవలకు విఘాతం కలిగింది. ఇప్పుడు 48 మంది గ్రూప్-4 స్థాయి అధికారులున్నా ఎలాంటి సేవలు పొందలేకపోవడం దురదృష్టకరం.

# ఉపాధి నిధులు.. పడకేసిన పనులు



సిరిసిల్ల: ఉపాధి హామీ పథకంలో తాత్కాలిక పనులను నిలిపివేసి శాశ్వత నిర్మాణాలు.. జాబ్ కార్డు కలిగిన కూలీలకు ఆదాయం వృద్ధిచేసుకునే వాటికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నెలరోజుల్లో ముగుస్తుంది. జిల్లాకు కేటాయించిన బడ్జెట్లో 65శాతం ఖర్చు చేయాలి. కాగా 40 శాతం కూడా పూర్తికాలేదు. పశువులు, కోళ్ల షెడ్లు, పశుగ్రాసం పెంపకం, భూ అభివృద్ధి, పొలం బాటలు, వర్షం నీటి సంరక్షణకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పథకాలన్నీ పాతవే అయినప్పటికీ.. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో ప్రగతి లేదు. వీటి పట్ల గ్రామాల్లోని రైతులకు అవగాహన కొరవడటమే కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో 98వేల జాబ్‌కార్డులు రెండు లక్షల మంది కూలీలు ఉన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు ఉపాధి పనులకు అధిక ప్రాధాన్యం ఉంది. వీటిలో ప్రధానంగా పశువుల పాకల నిర్మాణం ఉంది. దీనిలో కూలీల వేతనం రూ.1081 మినహా మిగతా నిధులన్నీ నిర్మాణం పూర్తయ్యాక అందిస్తున్నారు. జిల్లాలో 259 షెడ్లు మంజూరుకాగా 199 పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.82,400 లబ్ధిదారులకు చెల్లించే అవకాశం ఉంది.

గతంలో కోళ్లపెంపకానికి మండలానికి ఒకటి వెయ్యికోళ్లను పెంచేలా షెడ్ల నిర్మాణాలను మంజూరు చేశారు. జిల్లా మొట్ట ప్రాంతం కావడంతో వాననీటిని ఒడిసిపట్టే నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. రైతులు వ్యవసాయ పొలాల్లోనూ నీటి సంరక్షణకు కుంటలు తవ్వుకునేందుకు అవకాశం ఉంది. అటవీ ప్రాంతాల నుంచి వరద వచ్చే మార్గాలను పటిష్ఠం చేసుకుని ఆయా ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టవచ్చు. జిల్లాలో వాననీటి సంరక్షణ పనులకు బడ్జెట్లో 1907 పనులకు రూ.160.8 కోట్లు కేటాయించగా ఇప్పటికీ కేవలం రూ.47.5కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి.

పనుల ప్రగతిపై డీఆర్‌డీఏ పీడీ శేషాద్రిని సంప్రదించగా ఆయన మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వీటి నిర్మాణాల్లో మరింత వేగం పెంచేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తామని తెలిపారు.

# ఏపీకి న్యాయం.. మాకూ కావాలి సాయం

ఖమ్మం : ప్రస్తుతం మిరప ధరలు భారీగా పతనమైన దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు ఆపన్న హస్తం అందించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభ్యర్థన మేరకు 'ప్రైస్ డెఫిషెన్సీ పేమెంట్'(పీడీపీ)' అనే పథకాన్ని వర్తింప చేసింది. మార్కెట్ ఇన్వెన్షన్ స్కీం(ఎంఐసీ)లో భాగంగా ఎండు మిరపకు ఉత్తర్వులు జారీ చేసింది. తొలి కొనుగోలు నాటి నుంచి నెల వరకు ఈ పథకం వర్తిస్తుంది. దీని ప్రకారం మిరప ధరలు మరింత దిగజారకుండా రైతులను ఆదుకునేందుకు క్వింటా రూ.11,781.25 పైసల చొప్పున ధర నిర్ణయించారు.

**వారికి మేలు..**

పీడీపీ ద్వారా ఏపీలోని పలు వ్యవసాయ మార్కెట్లలో మిరప రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఆ రాష్ట్రంలో పలు మిరప రకాలు సాగవుతున్నాయి. ప్రస్తుతం క్వింటాకు రూ.9-10 వేల మధ్య ఉంది. పండించాలంటేనే రైతుకు రూ.10-11 వేలు ఖర్చవుతున్నాయి. చేసిన ఖర్చు సైతం వచ్చే పరిస్థితి లేక తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులకు చేయూతనిచ్చింది.

**మరి మనకో..**

ప్రస్తుతం తెలంగాణలో కూడా మిర్చి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ అత్యధికంగా 'తేజ' రకాలు సాగు చేస్తారు. క్వింటాకు కనీసం రూ.13వేల నుంచి రూ.14వేల వరకు ఉత్పత్తి వ్యయం అవుతుంది. ప్రస్తుతం గరిష్ఠంగానే క్వింటా ఎండుమిరపకు ఇంత ధర పలుకుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో అయికాడికి తెగనమ్ముకుంటున్నారు. గత



నాలుగేళ్లుగా తేజ రకం క్వింటా రూ.17-24 వేల మధ్య ఉన్నాయి. ఈ ఏడాది అధ్వానంగా ఉంది. పెట్టుబడులు పెరిగి, తెగుళ్లు, ఇతర కారణాలతో ఆశించిన స్థాయిలో దిగుబడులు లేవు. ధరలు గతంలో ఎన్నడూలేనట్టు తగ్గటం శరాఘాతంగా మారింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ తరహాలో పీడీపీని రూ.17-18 వేలు నిర్ణయించి ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**బోర్డు ఏర్పాటుకు డిమాండ్**


ఎండు మిరప ధరల పతనం దృష్ట్యా రైతు సంఘాలు ఖమ్మంలో మిరప బోర్డు ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇక్కడ బోర్డు ఏర్పాటుతో రాష్ట్రంలోనే ఎక్కువ సాగు చేసే ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఏపీలో మిరప పండించే జిల్లాలకు సైతం అందుబాటులో ఉంటుందని వారి అభిప్రాయం. ఏటా చైనా, మలేషియా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు పెద్ద ఎత్తున తేజ మిరప ఎగుమతవుతోంది. విదేశీ ఆర్డర్లు వస్తున్నాయి. ధర పడిపోయినప్పుడు ఆదుకోకుంటే దాని ప్రభావం సాగుపై పడే ప్రమాదం ఉందని, పసుపు తరహాలో మిరప బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# జీసీసీలో ఇదో 'గమ్ము'త్తు..!

భద్రాచలం : భద్రాచలం గిరిజన సహకార సంస్థ(జీసీసీ)ని అంతుచిక్కని గమ్మత్తు పట్టిపీడిస్తోంది. సుమారు పదకొండేళ్లుగా జిగురు లెక్కలపై స్పష్టత రావటం లేదు. దీన్ని నిల్వ చేసిన గోదాము వైపు చూడాలంటేనే సిబ్బంది వణికిపోతున్నారు. గోదాము తాళాలుతీసి సరకును పరిశీలించేందుకు సాహసించటం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**ఏం జరిగిందంటే..?**

రాష్ట్ర విభజన సమయంలో వివిధ చోట్ల నుంచి తప్సితో పాటు ఇతర రకాల జిగుర్లను కొని భద్రాచలం జీసీసీ కార్యాలయం ప్రాంగణంలోని గోదాములో భద్రపరిచారు. 2014లో ఏపీ నుంచి తెలంగాణ విడిపోవటంతో ఈ జిగురులో చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), కుక్కునూరు (ఏలూరు జిల్లా) వాటా ఎంత అన్నది తేల్చటానికి తర్జనభర్జన పడ్డారు. 2016లో జిల్లాల విభజన జరగటంతో వెంకటాపురం, వాజేడు మండలాలు ములుగు జిల్లాలో విలీనమయ్యాయి. ఆ ప్రాంతాల నుంచి కొనుగోళ్ల లెక్కలను పరిశీలించినప్పటికీ స్పష్టత



రాలేదు. భద్రాచలం గోదాములోని సరకు అంశం తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారుల పరిధికి చేరటంతో ఎటూ తేలకుండా పోతోంది.

**ఇంకెప్పుడు మేల్కొంటారో..?**

జీసీసీ అనుమతితో జిగురును విక్రయించేందుకు అప్పట్లో అధికారులు ప్రయత్నించారు. సరైన ధర రాలేదంటూ ప్రక్రియను నిలిపేశారు. ఈలోగా దళారుల జోక్యం పెరిగింది. అటవీ ఉత్పత్తులైన ముష్ఠి గింజల రవాణాలో అక్రమాలు చోటుచేసుకోవటంతో కొందరు సిబ్బందిపై అధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో విచారణకు కాలయాపన చేశారు. ఏళ్ల తరబడి జిగురు నిల్వలు ఉన్న గోదాము తాళాలను తీయటమే మరిచారు. సుమారు పదేళ్లు నిల్వ ఉంచటంతో జిగురు నాణ్యత కోల్పోయే వీలుంది. రూ.అర కోటి విలువైన జిగురును ఇందులో నుంచి బయటకు తీస్తేనే ఈ గోదాము మిగతా అవసరాలకు ఉపయోగపడుతుంది. ఈ వ్యవహారంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారా.. లేదా అక్రమం చోటుచేసుకుందా అనేది తేలాల్సి ఉంది. ఇకనైనా లక్ష్యాలను చేరుకునేందుకు చొరవ చూపాలి.

అటవీ ఉత్పత్తుల్లో భాగమైన విప్ప పువ్వు గోదాముల్లో నిల్వ ఉంది. దీన్ని విక్రయించేందుకు చర్యలు చేపట్టాం. చాలాకాలం నుంచి జిగురు గోదాము తాళాలను తెరవని మాట నిజమే. త్వరలోనే గోదాములన్నింటినీ పరిశీలించి టెండర్ ద్వారా జిగురు విక్రయిస్తాం.సమ్మయ్య, డీఎం, జీసీసీ

చురకలు
మంగళవారం 4 మార్చి 2025

## అనర్హులైన అర్హులకు మరో అవకాశం.. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై నిర్ణయం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి అధ్యయన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,70,859 దరఖాస్తులు అందాయి. వీటిలో చిరునామాలు గుర్తించలేకపోయినవి 10 వేలలోపు ఉంటాయని సమాచారం. ప్రస్తుతం వారు ఎక్కడ ఉంటున్నారో పరిసరాల్లోని వారు సైతం చెప్పలేకపోతున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 99.99 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. క్షేత్రస్థాయి పరిశీలన తరవాత దరఖాస్తులను మూడు భాగాలుగా విభజించారు. ఇల్లు లేకపోయినా సొంత స్థలం ఉన్న వారిని ఎల్-1గా, ఇల్లు, స్థలం లేని వారు ఎల్-2గా, అర్హులు కాని వారు ఎల్-3గా విభజించారు.



**దరఖాస్తుదారులకు మరో అవకాశం...?**

క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హులుగా కొన్ని దరఖాస్తులను అధికారులు గుర్తించారు. సొంత ఇల్లు ఉండటం, ఆదాయపన్ను చెల్లిస్తుండటం తదితర కారణాలతో వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. వారికి మరో అవకాశం ఇవ్వాలని ఉన్నతస్థాయిలో అధికారులు భావిస్తున్నారు. అనర్హులుగా వారిని పక్కన పెడితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న అభిప్రాయంతో ఆ జాబితాలోని వారికి మరో అవకాశం ఇవ్వాలని అధికారులు ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. మూడు విభాగాలకు చెందిన జాబితాను గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ జాబితాలోని వారు అర్హులమని నిర్ధారించేందుకు అనువైన అంశాలతో మరోదఫా దరఖాస్తులను ఆహ్వానించి వాటిని పరిశీలించటంతో ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకున్నట్లు అవుతుందని అధికారుల యోచన. జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచడంతోపాటు చరవాణికి సంక్షిప్త సందేశాలు పంపేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

## ఇంకేదే లేదు.. ఇంకెలా..?

హైదరాబాద్: జీవ జలాలను పరిరక్షించుకునే అవకాశాన్ని నగరవాసులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ మహానగరంలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా డిసెంబరు నాటికే భూగర్భజలాలు అట్టడుగుకు చేరుకుంటున్న ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో వర్షపునీరు ఇంకే పరిస్థితి లేకపోవడంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి. 300 చదరపు మీటర్లు మించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**నోటీసులు ఇస్తున్నా..**

భూగర్భజలాల సమస్యకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ వాటిని నిర్మించుకునేందుకు జలమండలి



గతంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తగిన సాంకేతిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. ఇంకుడుగుంతలు నిర్మించని వారికి నోటీసులు జారీ చేసింది. అయినా ఆశించిన ప్రయోజనం దక్కలేదు. 40 వేల క్యాన్ నంబర్ల వినియోగదారులు తరచూ ట్యాంకర్లు బుక్ చేసినట్లు గుర్తించారు. ఎక్కువమంది ఇంకుడు గుంతలు లేని ఇళ్ల నుంచే బుకింగ్ జరుగుతున్నట్లు వెల్లడవుతోంది.

**ట్యాంకర్లకు రెట్టింపు ధర ప్రతిపాదనకు కసరత్తు**

జలమండలి పరిధిలో నిబంధనల మేరకు ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించి చట్టబద్ధంగా చర్యలకు జలమండలి శ్రీకారం చుడుతోంది. లేని ఇళ్లకు నోటీసులు జారీచేస్తున్నారు. నిబంధనల మేరకు ఇంకుడుగుంతలు లేని ఇళ్ల యజమానులు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే రెట్టింపు ధర వసూలు చేయాలనే ప్రతిపాదనలపై కసరత్తు చేస్తున్నారు.ఖైరతాబాద్, నాంపల్లి, ముషీరాబాద్, షేక్‌పేట, ఆసిఫ్‌నగర్, చార్మినార్, సికింద్రాబాద్, బాచుపల్లి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో సాధారణం కంటే 20 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ 1, 2024 నుంచి జనవరి 31, 2025 వరకు వర్షపాతం వివరాలు (మి.మీ.లలో..)

## నగరంలో స్మార్ట్ పార్కింగ్

హైదరాబాద్: ఇంటి నుంచే.. వెళ్లబోతున్న ప్రాంతంలో మన వాహనానికి పార్కింగ్ వసతిని రిజర్వు చేసుకోవచ్చు. జీహెచ్ఎంసీ నూతన పార్కింగ్ విధానం రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఆసక్తిగల సంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో బూస్ట్(బిల్డ్ ఓన్ ఆపరేట్ షేర్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ప్రాజెక్టును అమలు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని, సమగ్ర ప్రతిపాదనలు, ప్రణాళిక అందజేస్తే.. ఉత్తమ పద్ధతిన ఎంపిక చేస్తామని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం తాజాగా టెండరు నోటిఫికేషన్ విడుదల చేసింది.

**రద్దీకి అనుగుణంగా ఛార్జీలు..**గత సర్కారు హయాంలో కూకట్‌పల్లి జోనల్ అధికారులు.. కూకట్‌పల్లి ఫోరంమాల్ వద్దనున్న పైవంతెన కింద 200 ద్విచక్ర వాహనాలకు స్మార్ట్ పార్కింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. తర్వాత.. సికింద్రాబాద్ తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాల భూమిని.. ఆ శాఖ పార్కింగ్ వసతికి ఇచ్చింది. ః ఇప్పుడు కొత్తగా ఖైరతాబాద్ జోన్ ప్రయత్నం చేస్తోంది. జీహెచ్ఎంసీ కేటాయించే ప్రాంతాల్లోనేగాక.. ప్రైవేటు వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. వారి ఇంటి ముందున్న పార్కింగ్ కేంద్రాన్ని, ఆఫీసుల్లోని ఖాళీ స్థలాలను, అపార్ట్‌మెంట్లలోని పార్కింగ్ వసతులను బల్దియాతో కలిసి వాహనదారులకు అద్దెకు ఇచ్చుకోవచ్చు. మొబైల్‌యాప్, వెబ్‌సైట్‌ను ఉపయోగించి ప్రజలు స్మార్ట్ పార్కింగ్ సేవలు పొందవచ్చు. నిర్వాహకులకు రద్దీకి తగ్గట్టుగా ఛార్జీలను వసూలు చేసుకునే అధికారం ఉంటుంది. పార్కింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు.. వాహనాన్ని, వాహనంలోని డ్రైవరు, నంబరు ప్లేటును కృత్రిమ మేధ సాయంతో గుర్తించేలా ఏర్పాట్లు ఉండాలి.

**మొదలైన సర్వే..**స్మార్ట్ పార్కింగ్‌కు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో సర్వే చేస్తున్నారు. ఏ వీధిలో.. ఎన్ని వాహనాలను పార్కింగ్ చేయొచ్చు, ప్రైవేటు స్థలాలు ఎక్కడున్నాయి,

# ఎల్‌ఆర్‌ఎస్‌లో ఎల్-1 కష్టాలు



హైదరాబాద్: మేడ్చల్‌లో గ్రామ పంచాయతీ (జీపీ)లో ప్లాట్ ఉన్న ఓ వ్యక్తి గతంలో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఫీజు చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. ఆన్‌లైన్లో రుసుము చెల్లించడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా.. దరఖాస్తు ఎల్1 అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. తాజాగా మార్చి 31లోపు ఈ స్కీం వినియోగించుకున్న వారికి 25 శాతం రాయితీ ప్రకటించడంతో ఇంకోసారి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇది ఆ ఒక్కరి సమస్య కాదు.. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో ఎంతోమంది ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) పథకంతో ప్లాట్లను సక్రమం చేసుకునేందుకు చాలామంది ఆశతో ఉన్నా అధికారులు మోకాలడ్డుతున్నారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారించడంలో జాప్యం చేస్తున్నారు. ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. 3.2 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం 1 శాతం కూడా పరిష్కారానికి నోచుకోలేదు. వీటిని యుద్ధప్రాతిపదికన పరిశీలిస్తే హెచ్ఎండీఏ ద్వారా రూ.వేయి కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. పైనుంచి నుంచి కిందిస్థాయి వరకు సరైన ప్రణాళిక లేదు.

**ఇబ్బందులు ఇలా...**

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్లాట్‌ను సక్రమంగా మార్చుకోవాలంటే తొలుత లెవల్-1లో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి. చెరువులు, నీటి వనరులు, కాలువలకు 200 మీటర్లలోపు లేఅవుట్ లేదని.. దేవదాయ, అసైన్డ్ ఇతర వివాదస్పద భూముల జాబితాలో లేదని అధికారులు ధ్రువీకరించాలి.

గ్రామ, రెవెన్యూ మ్యాపులు పరిశీలించి లేఅవుట్ చుట్టుపక్కల ఎలాంటి నీటి వనరులు లేవని ధ్రువీకరించిన తర్వాత ఎన్‌వోసీ జారీ చేయాలి.

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఎన్‌వోసీ వచ్చిన తర్వాత హెచ్ఎండీఏలో పీవో లేదా సీపీవో అనంతరం డైరెక్టర్ పరిశీలించి ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. దీంతో ఆన్‌లైన్ లేదా నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లిస్తే యజమాని పేరుతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేశారు.

చిన్నచిన్న లోపాలను చూపించి కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. పలు జోన్లలో ఈ తంతు యథేచ్ఛగా నడుస్తోందనే మాటలు వినిపిస్తున్నాయి.

ఎల్ 1 అనుమతుల విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను భాగస్వాములను చేశారు. హెచ్ఎండీఏతోపాటు పరిశీలించి పచ్చజెండా ఊపాకే దరఖాస్తులు కదులుతాయి. ఇక్కడే జాప్యం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒక అధికారి వస్తే... ఇంకొకరు రావడం లేదని అంటున్నారు.మాస్టర్‌ప్లాన్‌లోని తప్పులను చూపించి కొర్రీలు పెడుతున్నారు.

గతంలో ఇలాంటి స్కీం అందుబాటులోకి తెచ్చిన సందర్భంలో సహాయ కేంద్రం, ఫోన్ నంబరు ఇచ్చేవారు. అక్కడ సంప్రదిస్తే సందేహాలను నివృత్తి చేసేవారు.

# పన్ను బూచి.. అధికారులు దోచి



హైదరాబాద్: గ్రేటర్‌లో తెలియకుండానే ఆస్తిపన్ను పెరుగుతోంది. పెరిగిన విలువతో బకాయి చెల్లించాలంటూ యజమానులకు సందేశాలూ వెళ్తున్నాయి. ఏప్రిల్, 2024లోనే పన్ను కడితే బకాయి ఏంటని ఆశ్చర్యపోతున్నారు. కింది స్థాయి సిబ్బందిని ఆశ్రయిస్తే.. పన్ను తగ్గిస్తామంటూ రూ.10వేల నుంచి రూ.50వేలు తీసుకుని ఫోన్ నంబర్లను బ్లాక్ చేస్తున్నారు. మరికొందరు జీహెచ్ఎంసీ చట్టం సెక్షన్ 213 కింద భవనాలకు నోటీసులివ్వడం.. ఆస్తిపన్ను పెరుగుతుందనే భయాందోళనలు సృష్టించి వసూళ్లకు పాల్పడుతున్నారు. అదే సమయంలో.. చట్ట ప్రకారం జారీ అయిన ఇంటి నంబర్లను రద్దు చేస్తూ నిషేధిత కేటగిరీల్లోని వాటికి ఇచ్చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. పలువురు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రైవేటు సిబ్బందిని నియమించుకుని జేబులు నింపుకొంటున్నారు. ఈ నెల 24న కాటేదాన్ పారిశ్రామికవాడలోని ఓ రేకుల షెడ్డుకు నోటీసు ఇచ్చి రూ.45వేలు లంచం తీసుకుంటూ బిల్ కలెక్టరు, అతని సహాయకుడు అనిశాకు పట్టుబడిన విషయం తెలిసిందే.

**ఇవిగో ఉదాహరణలు..**

సైదాబాద్ కుర్మగూడలోని ఏళ్ల నాటి ఇల్లు అది. ఇంటి నంబరు 17-2-427, 428, పీటీఐఎన్ నంబరు 1041705849 కలిగిన ఆ రెండంతస్తుల ఇంటికి గతంలో ఆస్తిపన్ను రూ.3వేలుగా ఉండేది. యజమానికి నోటీసు ఇవ్వకుండా అక్టోబరు 15, 2024న ఆస్తి పన్నును సవరించింది. దానికి ముందే యజమాని పూర్తిగా చెల్లించారు. పన్ను సవరణ జరిగాక.. ఉన్నట్టుండి బకాయి చెల్లించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి సందేశం వెళ్లడంతో కంగుతిన్నారు. వెబ్‌సైట్‌లో చూసుకోగా.. పన్ను విలువ నాలుగు రెట్లకుపైగా పెరిగింది. స్థానిక బల్దియా సిబ్బందిని సంప్రదిస్తే.. రూ.10వేలు తీసుకుని ఉడాయించారని, ఇప్పుడు ఫోన్‌లోనూ స్పందించడం లేదని బాధితులు 'ఈనాడు'తో వాపోయారు. కూకట్‌పల్లి శంశిగూడ గ్రామం పరిధిలో 180 గజాల్లో నిర్మాణం చేసుకున్న ఇంటికి ఆస్తిపన్ను మదింపు చేయాలని యజమాని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆశ్రయించగా.. నోటరీ స్థలానికి ఇంటి నంబరు రాదని, అలా ఇవ్వాలంటే రూ.3లక్షలు ఖర్చవుతుందని సిబ్బంది బేరం కుదుర్చుకున్నారు.

గ్రేటర్‌లో ఆస్తిపన్ను పరిధిలోని నిర్మాణాలు 23 లక్షలు
ఇటీవల పన్ను సవరణ జరిగిన భవనాలు 800
సవరణతో పెరిగిన ఆస్తిపన్ను విలువ రూ.2 కోట్లు
సవరణ పురోగతిలో ఉన్న భవనాలు సుమారు 50 వేలు

# ఎన్‌డీఎస్ఎల్ పునః ప్రారంభంపై ప్రతిష్టంభన!



మల్లాపూర్ : రాష్ట్రంలోని ఎన్‌డీఎస్ఎల్ (నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్) పరిశ్రమల పునః ప్రారంభంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరుద్ధరణ కమిటీ గతేడాది నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట వద్దనున్న పరిశ్రమలను సందర్శించి పలు సూచనలు చేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని మూడు పరిశ్రమల స్థితిగతులపై అంచనాలను రూపొందించేందుకు పరిశ్రమల పెట్టుబడులు, నిర్వహణపై పట్టున్న ఫార్చ్యూన్ సంస్థను డిసెంబరు-2024లో సంప్రదించింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ముత్యంపేట, బోధన్, ముంబోజిపల్లి (మెదక్) జిల్లాల్లో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సంస్థ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం పరిశ్రమల పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**స్థితిగతులపై అధ్యయనం**

రాష్ట్రంలో మూసివేసిన ఎన్‌డీఎస్ఎల్ పరిశ్రమలను పునః ప్రారంభించేందుకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. మూడు యూనిట్లలో పరిశ్రమలను తెరిపిస్తే ఎంత ఖర్చవుతుంది? పాత యంత్రాలకు మరమ్మతులు జరిపి పునరుద్ధరించడమా? కొత్త యంత్రాలను అమర్చితే వచ్చే ఖర్చు ఎంత? ఆయా ప్లాంట్లలో 10వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయడంతోపాటు డిస్టిలరీ (అల్కహాల్ తయారీ) యూనిట్లను ఏర్పాటు చేస్తే ఎంత ఖర్చు వస్తుంది? భవిష్యత్తులో వీటి ఉపయోగాలు తదితర వాటిని ప్రభుత్వానికి ఫార్చ్యూన్ సంస్థ ప్రతినిధులు కూలంకుషంగా నివేదించనున్నట్లు సమాచారం.

**మరమ్మతుకు రూ.150 కోట్లు?**

మూడు యూనిట్ల పరిధిలో పాత యంత్రాలకు మరమ్మతులు చేస్తే దాదాపు రూ.150 కోట్ల మేర ఖర్చవుతుందని కమిటీ అంచనాకు వచ్చినట్లు సమాచారం. పాత యంత్రాలకు మరమ్మతులు జరిపి క్రషింగ్‌ను నడిపిస్తే రికవరీ శాతం సరాసరి 9 శాతానికి మించకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతోపాటు క్రషింగ్‌లో అంతరాయాలు కలిగితే మరింత నష్టం వాటిల్లే అవకాశాలు ఉండటంతో భవిష్యత్తులో ఉపయోగపడేలా కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు డిస్టిల్లరీ, విద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పితేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**సాగు పెరిగితేనే..**

ముత్యంపేట పరిశ్రమ పరిధిలో ప్రస్తుతం 2024-25 సీజన్‌కు లక్ష టన్నుల మేర చెరకును రైతులు సాగు చేశారు. 2025-26 సీజన్‌కు మూడు లక్షల టన్నుల మేర చెరకు పంటను రైతులు పండిస్తేనే క్రషింగ్ సాధ్యపడుతుంది. పరిశ్రమలో వచ్చే ఏడాది క్రషింగ్ నిర్వహించాలంటే రైతులతో ఒప్పందం చేసుకోవడంతోపాటు మూడు లక్షల టన్నుల సరిపడా చెరకును సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. ఎన్‌డీఎస్ఎల్ యాజమాన్యం బ్యాంకుల నుంచి గతంలో తీసుకున్న రుణాలు రూ.210 కోట్లు ఉండగా, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.192 కోట్లను చెల్లించింది. ఫార్చ్యూన్ సంస్థ నివేదిక వస్తే గానీ ప్రభుత్వమే నడిపిస్తుందా? ప్రైవేటుకు అప్పగిస్తుందా? అనేది తేలే అవకాశం ఉంది.

## కళ.. కలేనా..?

నారాయణగూడ: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ పదేళ్ల క్రితం వరకు చిన్నారులతో కళకళలాడింది. ప్రస్తుతం చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. పిల్లలు వేసవి సెలవులను బాలభవన్‌లో ఆస్వాదిస్తారు. 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీన్ని ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేసవి శిబిరాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారు. బాలభవన్ తరఫున 'బాలశ్రీ, బాలసూర్య, బాలరత్న' పురస్కారాలు అందించేవారు. ప్రస్తుతం అవి లేవు. ప్రతినెలా బీసీ, ఓసీ పిల్లలకు నామమాత్రపు రుసుము రూ.50, ఎస్సీ, ఎస్టీ పిల్లలకు రూ.20 ఉండేది. ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలను బాలభవన్‌కు బస్సులో తీసుకొచ్చేవారు. ఇప్పుడా బస్సు నిరుపయోగంగా మారింది.



పోస్టులన్నీ ఖాళీ..బాలభవన్‌లో లైబ్రేరియన్, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్రం, తబలా గురువులు మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సంగీతం, తబలా, మృదంగం, కథక్, కూచిపూడి, జానపదం, నాటకం, కరాటే, స్కేటింగ్ గురువులు కావాలి. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ఇక్కడికి పంపించారు. ఒకే పోస్టులో ముగ్గురు సైన్స్ టీచర్లున్నారు. ఒక ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి బాధ్యతల్ని అప్పగించడంపై విమర్శలున్నాయి. మరో ఎస్జీటీ టీచర్‌ను లైబ్రేరియన్‌గా పంపించారు. పదేళ్లుగా ఇన్‌ఛార్జి డైరెక్టర్.. ఇంతకుముందు బాలభవన్‌కు ప్రత్యేకంగా డైరెక్టర్ ఉండేవారు. పదేళ్లుగా అదనపు బాధ్యతలతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

## గోదావరి జలాల విడుదల

అశ్వాపురం : భీమునిగుండం కొత్తూరు సీతారామ ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఫేజ్-2 పంప్‌హౌస్ వైపు నీళ్లు పయనిస్తున్నాయి. ములుగు జిల్లా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి విడుదల చేసిన 1,200 కూసెక్కుల గోదావరి జలాలు దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకొని పొంగిపొర్లుతున్నాయి. బెల్‌మౌత్ వద్ద గోదావరికి, సీతారామ ప్రధాన కాల్వకు మధ్యనున్న మట్టి కట్ట తొలగింపు పనులు పూర్తయ్యాయి. గోదావరి జలాలు సీతారామ ప్రధాన కాల్వలోకి ప్రవేశించాయి. అమెర్దా వద్ద సీతారామ హెడ్ రెగ్యులేటర్ ద్వారాలను అధికారులు తెరిచారు. గోదావరి జలాలు



భీమునిగుండం కొత్తూరు ఫేజ్-1 పంప్‌హౌస్‌కు చేరుకున్నాయి. పంప్‌హౌస్‌లోని ఏ-3 విద్యుత్తు మోటారును ఆన్ చేసి డెలివరీ సిస్టర్న్ ద్వారా సీతారామ రెండో ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్నాయి. అక్కడి నుంచి పూసుగూడెంలోని ఫేజ్-2 పంప్‌హౌస్, కమలాపురంలోని సీతారామ ఫేజ్-3 పంప్‌హౌస్‌కు చేరుకుంటాయి. జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆనకట్ట పైనుంచి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండటంతో సీతారామ ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తున్నామని తెలిపారు.

## విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహమూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

# మారాలి మనం.. కేరళలా..!

సూర్యాపేట : ఈ తరుణంలో దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళ అనుసరిస్తున్న విధానాలతోనే సర్కారు పాఠశాలలు బలోపేతం చేయవచ్చని విద్యారంగ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం పట్టణాలకు బస్సుల్లో తమ పిల్లల్ని పంపుతుండగా సంఖ్య తగ్గిపోతుంది. మరోవైపు గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ విద్యా సంస్థల్లో పోటీ పరీక్షలు రాసి నిరుపేద విద్యార్థులు చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య ఏటా తగ్గిపోతోంది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా 3,151 మంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోయింది.

సూర్యాపేట జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం 4,522 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

కేరళ విద్యారంగం విధానాలు మచ్చుకు కొన్ని...

దేశంలోనే మొదటిసారి 2007లో ఈ సూచనలను కేరళ వంద శాతం అమలు చేసి విజయం సాధించింది.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

5 కిలోమీటర్లను యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. అన్ని వసతులు, తరగతి గదులు కల్పించారు.




కేరళలో 40వేల జనాభా దాటిన చోట ఒక్క ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నారు. ఐదంచెల విధానంలో తనిఖీ చేసిన తరువాతే ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇస్తూ పూర్తిగా నియంత్రించారు. కేరళలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 10 శాతం మిషనరీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉండగా కేవలం 10 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

'తల్లిదండ్రులు, టీచర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి..వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. ప్రతి 2 నెలలకు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు.

ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నిధులలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవోకు ఉండే అధికారాలు కల్పించారు. క్రమశిక్షణ పాటించని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌తో పాటు సర్వీసు నుంచి తొలగించే అధికారాలు ఉంటాయి.

జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 2005లో విద్యారంగ ప్రమాణాల పెంపునకు గాను 2005 జాతీయ పాఠ్యపుస్తకాల నిర్ణయ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా రాష్ట్రాలలో పూర్తి అధ్యయనం తరువాత ప్రాంతీయ భాషకు, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక స్థితిగతులు, స్థానిక పరిస్థితులను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆదేశించారు.

# సమీకృతం.. సగం సగం..!

నల్గొండ : పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం అటకెక్కింది. గత ప్రభుత్వం కూరగాయలు, మాంసాహారం తదితరాలు అన్నీ ఒకేచోట విక్రయాలు జరగాలని భావించి సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట, నల్గొండ మినహా అంతటా పనులు పడకేశాయి. పునాదులకే పరిమితమయ్యాయి. కేటాయించిన నిధులు కూడా మంజూరు కాక నిర్మాణం కలగానే మారింది. పూర్తయిన రెండు చోట్ల ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రూ.కోట్లు కేటాయించినా నిష్ఫలం కావడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే విక్రయాలు**

సూర్యాపేటలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.30.18 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. గతేడాది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు వ్యాపారులు అక్కడ విక్రయాలు చేపట్టడం లేదు. ఆరుబయటనే తమ క్రయవిక్రయాలు చేపడుతున్నారు.

**నల్గొండలో నిరుపయోగంగా..**

నల్గొండలో రూ.8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

**అదనపు నిధులు మంజూరైనా..**

చిట్యాలలో ఇన్‌గ్రాంట్ బడ్జెట్ కింద 2021లో రూ.2 కోట్ల అంచనాతో సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించారు. డిజైన్ మాత్రం రూ.5 కోట్లకు రూపొందించారు. అదనంగా రూ.3 కోట్ల నిధులు మంజూరైనా గుత్తేదారుతో అదనపు నిధుల పనుల ఒప్పందం జరగలేదు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్లాబ్‌ల వరకు పనులు జరిగాయి.

నకిరేకల్‌లో రూ.2 కోట్లతో ప్రారంభించి రెండు స్లాబుల వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో జాప్యం కారణంగా గుత్తేదారును మార్చి మరొకరికి అప్పగించినా ముందుకు సాగటం లేదు.

దేవరకొండలో రూ.4.5 కోట్లు మంజూరవగా స్థల సమస్యతో కొంతకాలం వాయిదా పడింది. ప్రస్తుతం అంచనా విలువ రూ.11 కోట్లకు పెంచారు. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

హాలియాలో రూ.2 కోట్లతో పనులు చేపట్టగా స్లాబ్ వరకు నిర్మించారు. అంచనా వ్యయం రూ.5 కోట్లకు పెంచారు. పనులు నిలిచిపోయాయి.

**బిల్లులు అందక.. పనులు సాగక**

చండూరులో పిల్లర్ల దశ వరకే నిర్మించారు. దీని నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగతా పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి.

మిర్యాలగూడలో రూ.1.20 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగానే ఉంది. ఇక్కడ కూడా నిధులు సరిపడక పనులు ముందుకు సాగటం లేదు.

భువనగిరిలో రూ.8.40 కోట్ల అంచనాతో చేపట్టగా నిధుల కొరత కారణంగా నిర్మాణం ముందుకుసాగటం లేదు.

ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికలలో ఒక్కో దానికి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

**రాకపోకలకు ఇబ్బంది...**

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు, సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు రావడంతో దారి మళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జనసందడి పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.

# జల దోపిడీకి అడ్డుకట్ట ఏదీ!




పెద్దపల్లి : ప్రకృతి సంపద అయిన నీటిని పారిశ్రామిక అవసరాలకు విచ్చలవిడిగా తోడేస్తున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యంతో జలాలు వృథా అవుతున్నాయి. ఇంకుడుగుంతల తవ్వకాల నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. కలుషిత నీరు జనావాసాల్లోకి చేరడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. పరిశ్రమల్లో అవసరానికి మించి నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట చేపట్టిన 'వాటర్ ఫ్లో మీటర్' విధానం అటకెక్కింది. ప్రతి పరిశ్రమ నిర్వాహకులు తప్పనిసరిగా మీటరు బిగించుకోవాలన్న నిబంధనలు పాటించడం లేదు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా ఫలితం కనిపించడం లేదు.

**సమన్వయ లోపం**

కర్మాగారాల్లో నీటి వినియోగంపై పర్యవేక్షణ కొరవడింది. ప్రతి పరిశ్రమకు వాటర్ ఫ్లో మీటర్ బిగించాలనే నిబంధన అమలు కావడం లేదు. రెవెన్యూ, పోలీసు, భూగర్భ జల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా సమన్వయ లోపం కనిపిస్తోంది. మూడు నెలలకోసారి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమీక్షల ఊసే లేదు. నీటి వినియోగంపై నిఘా పెట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. పరిశ్రమల నిర్వాహకులకు అవగాహన కల్పించినా మీటర్ల ఏర్పాటుకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటుపై కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖకు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.

**నోటీసులు జారీ చేసినా అంతే..**

ఉమ్మడి జిల్లాలో ఎన్టీపీసీ, బొగ్గు, సౌర విద్యుత్తు, గ్రానైట్, వాటర్ ప్లాంట్లు, బాయిల్డ్ రైస్ మిల్లులు, క్రషర్లు, ఇతర పరిశ్రమలున్నాయి. వీటిలో నిత్యం లక్షల లీటర్ల నీరు వృథా అవుతోంది. కొందరు అడ్డదారిలో నీటి అనుమతులు పొందుతున్నారనే విమర్శలున్నాయి. ఎన్ని బోర్లు, ఎన్ని లీటర్ల అవసరం వంటి అంశాలకు సంబంధించి తప్పుడు అంచనాతో దరఖాస్తు చేసుకుంటున్నారు. మరికొందరు అనుమతి లేకుండా బోర్లు తవ్వుతున్నారు. మీటర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ భూగర్భ జల శాఖ అధికారులు పలుమార్లు నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని తప్పించుకుంటున్నారు. ఈ విషయంలో భూగర్భ జల శాఖకు మిగిలిన శాఖలు సహకరించడం లేదు.

**అధిక వినియోగానికి అదనపు ఛార్జీలు**

పరిశ్రమకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసే సమయంలో ఎంత నీటిని వినియోగించనున్నారో కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది.

నిబంధనలు పట్టించుకోకుంటే పరిశ్రమకు సంబంధించిన బోరును ప్రభుత్వం సీజ్ చేయాల్సి ఉంటుంది.

పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలతో పరిసర ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నీటిని అధికంగా వినియోగిస్తే ప్రభుత్వానికి అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

మీటర్లు లేకుంటే అనుమతి రద్దు

-లావణ్య, భూగర్భ జలవనరుల శాఖ అధికారి, పెద్దపల్లి

ప్రతి పరిశ్రమలో వాటర్ ఫ్లో మీటర్ తప్పనిసరిగా బిగించాలి. ఈ విషయమై యాజమాన్యాలకు అవగాహన కల్పించనున్నాం. వృథా నీటిని అరికట్టేందుకు ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి. తనిఖీల్లో బోర్లకు మీటర్లు లేకుంటే అనుమతి రద్దు చేస్తాం. కంపెనీలకు నోటీసులు జారీ చేస్తున్నాం.

ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు

గ్రానైట్: 139

బిల్డింగ్ స్టోన్: 126

రైస్ మిల్లులు: 294

భారీ పరిశ్రమలు: 59

వాటర్ ప్లాంట్లు: 221 టీఎస్ ఐపాస్ పరిశ్రమలు: 1,368

# నిర్వాసితుల దారిపై నిర్లక్ష్యపు వరద



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాసకాలనీ వరకు రహదారిపై ఎప్పుడూ నీరు పారుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపరితల గని విస్తరణ కోసం రచ్చపల్లిలో భూములు, ఇళ్లు సేకరించిన సింగరేణి యాజమాన్యం నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ నిర్మించింది. అక్కడి వరకు వేసిన తారు రోడ్డును ఆర్‌అండ్‌బీకి గాని, పంచాయతీరాజ్ శాఖకు గాని అప్పగించడం లేదు. దీంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోవడం లేదు. కేవలం 2 కిలోమీటర్ల దూరం రోడ్డుపై దాదాపు ఎనిమిది చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. దారిపై అడుగడుగునా గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

**ఏడాదిలో తొమ్మిది నెలలు నీళ్లే**

సూరయ్యపల్లి-రచ్చపల్లి రహదారి పల్లపు ప్రాంతంలో ఉండటం, పక్కన పొలాలు ఎత్తులో ఉన్నాయి. దీంతో జనగలంత వాగు కాలువ నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు జలాలు పొలాల మీదుగా ప్రవహించడంతో ఏడాదిలో తొమ్మిది నెలల పాటు రహదారిపై నీరు పారుతోంది. రహదారిపై గుంతలు, రాళ్లు, పాకురుతో వాహనాలు జారి ప్రమాదానికి గురవుతున్నాయి. కల్వర్టు నిర్మాణంతో పాటు రోడ్డును రెండు వరుసలుగా విస్తరిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

గతంలో ఈ ప్రాంత వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ నిర్వాసితుల కోసం పునరావాస కాలనీ నిర్మించింది. రూ.2 కోట్ల వ్యయంతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించారు. గతంలో రోజుకు దాదాపు 20 వాహనాలు రాకపోకలు సాగించేవి.

ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లెలపల్లి గ్రామాల ప్రజలు ప్రయాణిస్తారు.

ఏడాది కిందట ఖమ్మంపల్లి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో రోజుకు వెయ్యి వాహనాలు నడుస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి-సదానందం, రచ్చపల్లి

రహదారిపై పారుతున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలి. గుంతలు, పాకురుతో వాహనాలు పట్టు తప్పుతున్నాయి. నీరు పారే ప్రదేశంలో కల్వర్టు నిర్మించాలి.

విస్తరణపై స్పందన కరవైంది-నాగరాజు, రచ్చపల్లి

అసలే మలుపులు, గుంతలతో ఇబ్బందులు ఎదురవుతుండగా నీరు నిలుస్తుండటంతో మరిన్ని అవస్థలు పడుతున్నాం. రహదారి విస్తరణపై సింగరేణి అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు.

# అర్ధాకలి చదువులకు స్వస్తి

కరీంనగర్ : పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముందుకొచ్చింది. మెరుగైన ఫలితాల సాధనకు గత నవంబరు నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. తాజాగా ఆ విద్యార్థుల ఆకలి తీర్చేందుకు స్నాక్స్ అందించేందుకు నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకూ ఆదేశాలు జారీ చేసింది. సాయంత్రం జరిగే స్టడీ అవర్స్‌కు హాజరయ్యే ఒక్కో విద్యార్థికి నిత్యం స్నాక్స్ కోసం రూ.15 ఖర్చు చేయాలని సూచించింది. ఇందుకయ్యే ఖర్చులను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో త్వరలో వేయనుంది.


**13,741 మందికి..**

మార్చిలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉదయం ప్రార్థనకు ముందు, సాయంత్రం బడి ముగిశాక గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉదయం ఖాళీ కడుపులతో, సాయంత్రం ఆకలితో హాజరవుతున్నారు. స్నాక్స్ అందించాలని విద్యార్థులే కోరినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం, దాతలు స్పందించలేదు.

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు సాయంత్రం వేళ స్నాక్స్ అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముందుకు రావడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13,741 విద్యార్థుల ఆకలి తీరనుంది. 38 రోజులు అందించే మొత్తం ఈ స్నాక్స్ కోసం ఉమ్మడి జిల్లాకు రూ.73,32,370 మంజూరు చేశారు. స్నాక్స్ మధ్యాహ్న భోజనం నిర్వాహకులే సమకూర్చాలని పేర్కొనడం, వాటి తయారీకి అదనంగా డబ్బులు ఇవ్వకపోవడంపై స్పష్టత లేని కారణంగా దీని అమలుపై ఉపాధ్యాయుల్లో సంశయం నెలకొంది.

# కంచెలు తెంచి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : ప్రభుత్వ భూములకు సరిహద్దులు.. కంచెలు.. జియోట్యాగింగ్‌లు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు వాటిని చెరిపేసి ప్రైవేటు పట్టాభూముల ఖాతాల్లోకి మార్చుకుంటున్నారు. ఈ దందా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా సాగుతోంది. ధరణి పోర్టల్‌లోని లోపాలతో కొందరు రియల్ సంస్థల ప్రతినిధులు, వ్యక్తులు ఇప్పటికే రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు చెరపట్టారు. ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తామని అధికారులు ప్రకటించినా...ఇప్పటి వరకూ ఎక్కడా సర్వే చేయలేదు.



ఆక్రమణ ఇక్కడే.. : రంగారెడ్డి జిల్లాలో సుమారు 500 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 300 ఎకరాలను ఆక్రమించుకున్నారని విశ్వసనీయంగా తెలుస్తోంది.

**పేరుకే డిజిటల్ సర్వేలు**

పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లో ప్రభుత్వ భూముల వివరాలున్నా... వీటిల్లో చాలావరకూ నవీకరణ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో కొన్నింటిని హెచ్‌ఎండీఏకు, ఐటీ, పరిశ్రమలశాఖలకు కేటాయించారు. వీటితో పాటు కొన్ని ధార్మిక సంస్థలు, కుల సంఘాల కార్యకలాపాలకు ప్రభుత్వ భూములను అప్పటి ప్రభుత్వం ఇచ్చేసింది. మిగిలిన ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే ద్వారా గుర్తిస్తామని, జియోట్యాగింగ్ చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. డిజిటల్ సర్వేనే కాదు..అసలు సర్వేచేయడానికి సర్వేయర్లు రెండు జిల్లాల్లోనూ లేరు.

**రికార్డులు సరిగా లేక..**

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని చాలామందికి తమ భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరు అక్రమార్కులు రెవెన్యూ విభాగంలోని కిందిస్థాయి సిబ్బందితో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి కోర్టుకెళ్తున్నారు. ఇటీవలే గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో ఇలాంటివి వెలుగు చూశాయి. అయినా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూ రికార్డులను సరి చూడటం లేదు.

# ఆపదలో అతివలకు ఆర్థిక వరం

తాండూరు : బషీరాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అయితే ఆమె మండల కేంద్రంలోని బ్యాంకులో రూ.లక్షకుపైగా రుణం తీసుకుంది. ఇంకా కొంత చెల్లించాల్సి ఉండగా...తాజాగా రుణ బీమా పథకం వర్తింపుతో మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే మాఫీ చేస్తోంది. మర్పల్లి మండలానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు కొన్ని నెలల క్రితం మరణించింది. మహిళా సంఘం ఆధ్వర్యంలో రూ.80వేల అప్పు తీసుకుంది. సగం చెల్లించగా.. మిగతా మొత్తాన్ని కట్టాల్సిన పని లేకుండా పోయింది. ఎందుకంటే ఆమెకు రుణ బీమా పథకం వర్తిస్తోంది. అతివల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణానికి బీమా సౌకర్యాన్ని కొత్తగా అమలు చేయడంతో



సభ్యురాలి కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. రుణం తీసుకున్న సభ్యురాలు సాధారణ మరణం లేదా ప్రమాదంలో మరణిస్తే పక్షం రోజుల్లోగా అధికారులు బ్యాంకులకు ఆ మొత్తం చెల్లించే విధంగా ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

**జిల్లాలో 53 మంది..** జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మహిళా సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత, సంఘ రుణాలతో పాటు వ్యాపార పురోగతికి రుణాలను అందిస్తున్నారు. 2024 మార్చి 14వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సహజ, ప్రమాద మరణాలు కలిపి మొత్తం 53 మంది ఉన్నారు. ఇవి సమర్పించాల్సి ఉంటుంది..: మరణించిన సభ్యురాలి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, సంఘంలో సభ్యురాలేనని వీఓ ధ్రువపత్రం, రుణం తీసుకున్న బ్యాంకు ఖాతా, మరణించిన నాటికి ఎంత రుణం ఉందనే బ్యాంకు వివరాలు, తదితరాలు. మహిళా సంఘం అధ్యక్షుల నుంచి వీఓ, సీసీ, ఏపీఓ పూర్తి వివరాల దస్త్రాలను సమర్పిస్తే రుణ బీమా నగదు బ్యాంకు అప్పు ఖాతాకు, ప్రమాద బీమా నగదు సభ్యురాలు కుటుంబ సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డీపీఎం నర్సింహులు'కు వివరించారు.

# ఎంఎన్‌జే వైద్యశాలకు జవసత్వాలు

హైదరాబాద్: ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి జవసత్వాలు రానున్నాయి. కొత్తగా 47 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ పూర్తికానుంది. కొత్త సంవత్సరం నుంచి వీరంతా విధుల్లో చేరనున్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు మరింత నాణ్యమైన చికిత్సలు అందించేందుకు ఆస్కారం కలగనుంది. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల నుంచి ఎంఎన్‌జేకు నిత్యం క్యాన్సర్ రోగుల తాకిడి ఉంటోంది. ఇక్కడ అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలు ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన రోబోట్ చికిత్సలను కూడా ఎంఎన్‌జేలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం 150 వరకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. మరో 50 పీజీలు, కాంట్రాక్టు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా రానున్న వైద్యులతో ఇబ్బందులు తీరనున్నాయి.

# నంబర్ 5, 341 మిర్చి రకాలకు గిరాకీ

అమరావతి: మిర్చి నంబర్ 5, 341 రకాలకు మిగతా వెరైటీలతో పోలిస్తే ధర మెరుగ్గా ఉంది. తేజ, బాడిగ రకాల మిర్చి కంటే కూడా ఈ రెండు రకాలకు మంచి ధర పలుకుతుంది. 341 రకం ఎండు మిరపకాయల్ని కారానికి, నంబర్ 5 రకం మిర్చిని పచ్చళ్లకు వినియోగిస్తారు. 341 రకం మిర్చిని దేశీయంగా కారం వ్యాపారులు, నంబర్ 5 మిర్చిని రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆయా రకాలకు గిరాకీ ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది ఈ రెండు రకాలకు అంతగా డిమాండ్ లేకపోవడం, ఆశించిన ధర



దక్కకపోవడంతో రైతులు సాగుకు వెనుకంజ వేశారు. ప్రస్తుత సీజన్‌లో పంట తక్కువగా ఉండటం.. డిమాండ్ అధికంగా ఉండడంతో ధర పలుకుతుందని చెబుతున్నారు.

**గరిష్ఠ ధర రూ.14,500**

కామన్ వెరైటీలో నంబర్ 5, 341 రకాల మిర్చి గరిష్ఠ ధర రూ.14,500 ఉంది. ఎప్పుడూ స్పెషల్ వెరైటీలోని తేజ, బాడిగ రకాల మిర్చి ధరలు వీటి కంటే అధికంగా ఉంటాయి. తేజ రకాల గరిష్ఠ ధర రూ.14,200 ఉండగా, బాడిగ రకాలకు రూ.14,100 లభిస్తుంది. కామన్ వెరైటీలోని మిగతా రకాలైన 334 రకం మిర్చికి రూ.9,000–13,900, 273 రకానికి రూ.10,000–13,000, 4884 రకం మిర్చికి రూ.9,000–13,000, సూపర్ 10 రకానికి రూ.10,500–13,000 ధర లభించింది. స్పెషల్ వెరైటీలోని తేజ రకాల రూ.10,000–14,200, బాడిగ రకానికి రూ.10,000–14,100, సింజెంటా బాడిగకు రూ.10,000–12,500, దేవనూరు డీలక్స్‌కు రూ.10,000–13,500, ఆర్మూర్ రకానికి రూ.10,000–11,500, తాలు రకాలకు రూ.5,000–7,700 ధర లభించింది.

**తగ్గిన నిల్వలు**రైతులు మహా శివరాత్రి తిరునాళ్లకు వెళ్లడంతో యార్డుకు లక్ష బస్తాల కంటే తక్కువగా బస్తాలు వచ్చాయి. అయితే విక్రయాలు మాత్రం అధికంగా జరిగాయి. శుక్రవారం రైతులు 99,747 బస్తాలు యార్డుకు తరలించగా.. గత నిల్వలతో కలిపి 1,03,526 బస్తాలు విక్రయాలు జరిగాయి.

# యువతకు ఉపాధి బాటలు

భీమవరం : పట్టణాల్లోని మెప్మా కుటుంబ సభ్యుల్లో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. అర్హత సాధించిన వారికి ఏడాదిపాటు వర్చువల్‌గా శిక్షణనిచ్చి.. ఉపాధి బాటలు వేయనున్నారు. ఆశా సొసైటీ సహకారంతో 2024- 25 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 వేలు మందికి అప్రెంటిస్‌షిప్ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మెప్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2021 తర్వాత డిగ్రీ పూర్తయిన వారిని జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం(ఎన్.ఎ.టి.ఎస్) ద్వారా ఎంపిక చేయనున్నారు. వారికి వృత్తి, జీవన నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఏడాది నిర్వహించే శిక్షణకు ప్రతి నెలా రూ.4,500 భృతి ఇవ్వనున్నారు.అర్హతలు ఇవీ.. 2021 తర్వాత రెగ్యులర్‌గా ఏదైనా డిగ్రీ పూర్తి చేయాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, చరవాణి, బ్యాంకు ఖాతా నంబర్లు, ఇ–మెయిల్ ఐడీ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఏడాది శిక్షణ కాలంలో మొత్తం 150 గంటలు వర్చువల్ శిక్షణ పొందాలి.

నమోదు చేసుకోండి.. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ద్వారా పొందే శిక్షణ ధ్రువీకరణ పత్రంతో ఉపాధి అవకాశాలుంటాయి. మెప్మా కార్యాలయంలో లేదా ఎస్‌ఎల్‌ఎఫ్ ఆర్పీ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు. సీహెచ్ నానిబాబు, మెప్మా జీవనోపాధుల విభాగ నిపుణుడుఉభయ జిల్లాల్లో పట్టణాల వారీగా అభ్యర్థుల లక్ష్యమిలా..

భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, నూజివీడు, జంగారెడ్డిగూడెం: 300 చొప్పున

ఏలూరు : 500

ఆకివీడు, చింతలపూడి : 150

# అరకొర సిబ్బంది అంతటా ఇబ్బంది

భీమవరం : ఇరగవరం మండలంలో ఏపీవో 1, సాంకేతిక సహాయకులు (టీఏ) 2 ఉండాల్సి ఉండగా టీఏ ఒకరే ఉన్నారు. భారమంతా ఒకరి మీదే పడటంతో సమయానికి చేయలేకపోతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ముగ్గురు కొరత ఉండటంతో ఆ పనులు సైతం ఉన్న ఒక్కరి మీదే పడుతున్నాయి.తాడేపల్లిగూడెంలో ఏపీవో 1, సాంకేతిక సహాయకులు (టీఏ) అయిదుగురు పనిచేయాల్సి ఉండగా ఇద్దరు టీఏలు మాత్రమే ఉన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉండటంతో ఉన్నవారిపైనే పని భారం పడుతోంది.ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంలో పలు అభివృద్ధి పనులు చేపడుతుండటం, సిబ్బంది కొరతతో ఇబ్బంది నెలకొంది.

గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు, క్షేత్రస్థాయి సహాయకుల నిర్వాకంతో ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారింది. తప్పుడు మస్తర్లతో పనిచేయని వారికి నగదు జమయ్యేలా చేశారు. సామాజిక తనిఖీల్లో గతేడాది అక్టోబరులో నలుగురు అధికారులను సస్పెండ్ చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**ఏళ్లగా ఖాళీ..**

ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. పనులను గుర్తించి, కూలీలను నియమించడం, అంచనాలు రూపొందించడం, చేసిన పని కొలతలు తీసుకోవడం తదితర పనులను సాంకేతిక సహాయకులు చేయాల్సి ఉండగా, వాటిని ఏపీవో పర్యవేక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. కొన్నేళ్లగా భర్తీ లేకపోవడంతో ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

**ఇష్టానుసారంగా..**జాబ్‌కార్డు ఉన్నవారికి తప్పనిసరిగా పని కల్పించాల్సి ఉన్నా క్షేత్రస్థాయి సిబ్బంది తమకు కావాల్సిన వారికే పని కల్పిస్తున్నారంటూ ఇటీవల కాలంలో ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఆచంటలో ఉపాధి హామీ పనులు చేసేందుకు కొంతమంది కూలీలు రాకపోయినా మస్తరు వేయడం, జాబ్‌కార్డులు సృష్టించి కూలి డబ్బులు చెల్లించినట్లు చూపించి అధికారులు చేతి వాటానికి పాల్పడ్డారు.

# ప్రయోగం వినూత్నం.. ఉపయుక్తం



అనంతపురం : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వినూత్న ప్రయోగాలవైపు ఎంత ఎక్కువ దృష్టి సారిస్తే సమాజాభివృద్ధికి అంతే స్థాయిలో పునాదులు పడతాయి.. తద్వారా విద్యార్థులకు రావాల్సిన గుర్తింపు దక్కుతుంది. భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీరామన్ 1928లో రామన్ ఎఫెక్ట్ అనే ప్రయోగానికి నోబెల్ బహుమతి దక్కింది. ఫిబ్రవరి 28న ఆయన ప్రయోగం చేశారు. అదే రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకొంటాం. ఎస్కేయూ, జేఎన్‌టీయూలో పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయోగాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.

**వ్యర్థాలు.. మూడు భాగాలు**

ప్రయోగం : గార్బేజి సార్టింగ్ మిషన్

విద్యార్థులు : ప్రశాంత్, గుణశేఖర్, మనూష, పారిజాత, మదన్‌మోహన్ (ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల)

అవసరమైన వస్తువులు: ప్రాక్స్‌మెటీ సెన్సార్, మాయిశ్చరైజర్ సెన్సార్, అల్ట్రాసోనిక్ సెన్సార్, డీసీ మోటర్, ఆర్డినో నానో, ఎల్‌సీడీ డిస్‌ప్లే, బెల్ట్ కన్వర్షన్, వ్యర్థాలతో నింపిన డ్రమ్ము

ప్రయోగ విధానం: ఒక ప్లాట్‌ఫారంపై పైన పేర్కొన్న వస్తువులన్నీ అమర్చాలి. డీసీ మోటర్ సాయంతో బెల్ట్ కన్వర్షన్ తిరుగుతూ ఉంటుంది. వ్యర్థాలు బెల్ట్‌పై పడేలా ఏర్పాటు చేసుకోవాలి. బెల్ట్‌పై చెత్త నెమ్మదిగా ముందుకు వెళ్తుంటాయి. వ్యర్థాల్లో లోహ వస్తువులను ప్రాక్స్‌మెటీ సెన్సార్, తడిపొడి చెత్తను మాశ్చరైజర్ సెన్సార్, ప్లాస్టిక్ వ్యర్థాలను అల్ట్రాసోనిక్ సెన్సార్లు 3 భాగాలుగా వేరు చేస్తాయి. పట్టణాలు, నగరాల్లో వెలువడే చెత్తను ఇలా వేరువేరు చేసి సులువుగా రీసైక్లింగ్ చేయవచ్చు.

**విద్యుత్తు సరఫరా లోపాలు తెలిపేలా..**

ట్రాన్స్‌మిషన్ లైన్ పార్ట్స్ ఫాల్ట్ సేఫ్టీ అండ్ ప్రొటక్టివ్

శ్రీనివాసులు నాయక్, రహంతుల్లా, మధుసూదన్‌రెడ్డి, మహేష్, తిమ్మప్ప (ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల)

ట్రాన్స్‌ఫార్మర్, రిలేస్, ఎల్‌ఈడీ బల్బులు, జీఎస్‌ఎం మాడ్యూల్స్, బ్యాటరీలు,

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రిలేస్, జీఎస్‌ఎం మాడ్యూల్స్ అమర్చాలి. ఏఏ ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య విద్యుత్తు లైన్లు పాడైనా, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైనా రిలే గుర్తిస్తుంది. జీఎస్‌ఎం మాడ్యూల్స్ ద్వారా ఆ ప్రాంతాన్ని విద్యుత్తుశాఖ అధికారుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. విద్యుత్తు తీగలు పడిపోతే క్షణాల్లో సమాచారం తెలుస్తుంది.

**వంతెనలు కూలిపోకుండా నియంత్రణ**

స్మార్ట్ క్రౌడ్ కంట్రోల్ సిస్టమ్ ఫర్ ప్రివెన్సీ ఆఫ్ బ్రిడ్జి ఓవర్‌లోడ్ అండ్ కొలాప్స్(విద్యార్థుల పేర్లు: శశిధర్‌రెడ్డి, మోహన్‌కుమార్, వెంకటేష్‌నాయక్, సురేష్, కాత్యాయని (జేఎన్‌టీయూ)

ఐర్ సెన్సార్లు, ఆర్డినోబోర్డు, సర్వో మోటర్, లోడ్‌సెల్, ఎల్‌సీడీ డిస్‌ప్లే, సర్వో మోడల్ గేటు నిర్ణీత బరువు కంటే అధికలోడుతో వాహనాలు వంతెనపైకి వెళ్లకుండా నియంత్రించేందుకు వంతెన ఇరువైపులా ఐర్ సెన్సార్లు ఏర్పాటు చేయాలి. వంతెన ప్రవేశ మార్గంలో సర్వోమోడల్ గేటు అమర్చాలి. వంతెనపైకి వాహనాలు ప్రవేశించినపుడు వాటి బరువును లోడ్ సెల్ కొలుస్తుంది. గరిష్ఠ బరువు పెరిగితే ఐర్ సెన్సార్లు గుర్తించగానే సర్వోమోడల్ గేటు ఆటోమేటిక్‌గా మూతపడతుంది. వంతెనలు దెబ్బతిని కూలిపోయే ప్రమాదాలను అరికట్టవచ్చు.

# అంగన్‌వాడీలకు టీఏ ఎగనామం!



అనంతపురం : ఒకో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.300.. ఇలా మొత్తం 2079 మందికి రూ.6.24 లక్షలు రవాణా ఛార్జీ(టీఏ) రూపంలో చెల్లించాలి. సదరు మొత్తాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేసినట్లు గుట్టుచప్పుడు కాకుండా ఏకంగా అక్విటెన్స్ (ఆధారం) కూడా తీసుకున్నారు. కాని.. జిల్లాలో ఎవరికి నయాపైసా ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. రెండు రోజుల క్రితం జరిగిన 'జ్ఞానజ్యోతి' శిక్షణలో చోటు చేసుకున్న అక్రమ బాగోతమిది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ద్వారా మీకు అందజేస్తామంటూ కొందర ఎంఈఓలు చెప్పినా ఇప్పటికీ అతీగతీలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు వినూత్న పద్ధతిలో బోధనలు చేసేందుకు కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'జ్ఞానజ్యోతి' పేరుతో ఈ తర్ఫీదుకు శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా మండలాలు, ప్రాజెక్టుల వారీగా ఈనెల 18, 19, 20, రెండో విడతగా ఇదే నెల 22, 24, 25వ తేదీల్లో శిక్షణ ఇచ్చారు.

**బడ్జెట్ రూ.35.35 లక్షలు**అనంత జిల్లాకు ఆరు రోజుల శిక్షణకే రూ.35.35 లక్షల బడ్జెట్ కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) సారథ్యంలో ఎంఈఓ/హెచ్ఎంలు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ జ్ఞానజ్యోతి శిక్షణకు కేవలం అంగన్‌వాడీ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం బడ్జెట్టులో ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.50 చొప్పున ఆరు రోజులకు రూ.300 ప్రకారం 2079 మందికి రూ.6.24 లక్షలు, భోజనం, స్నాక్స్ కోసం రోజుకు రూ.200 ప్రకారం ఆరు రోజులకు 2079 మందికి రూ.24.95 లక్షలు, స్టేషనరీ, జ్ఞానజ్యోతి మాడ్యువల్స్ ముద్రణ కోసం రూ.200 ప్రకారం రూ.4.16 లక్షలు ప్రకారం కేటాయించారు. ఆరు రోజులూ భోజనం కూడా నాసిరకంగా పెట్టారన్న విమర్శలు వచ్చాయి. మాడ్యువల్స్ ముద్రణ స్థానంలో పీడీఎఫ్ ఇచ్చినట్లు సమాచారం. తాజాగా... ఏకంగా టీఏ కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడం విమర్శలకు దారి తీసింది.

**ఫిర్యాదులు వచ్చాయి - బీఎన్ శ్రీదేవి, ఇన్‌ఛార్జి పీడీ, ఐసీడీఎస్**జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి హాజరైనందుకు టీఏ రూపంలో డబ్బులు ఇవ్వలేదని తనకు కూడా కొందరు అంగన్‌వాడీల సంఘం నాయకులు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. శిక్షణ ప్రక్రియ మొత్తం ఎస్ఎస్ఏ యంత్రాంగం చూస్తోంది.

# పునాది దశలోనే ఆగింది

బాపట్ల: బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం పునాది దశలో నిలిచింది. నిర్మాణానికి నాబార్డు రుణాన్ని గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. నిధుల కొరతతో గత జూలై నుంచి పనులు ఆగాయి. పీపీపీ విధానంలో కళాశాల భవనాలు నిర్మించి ప్రారంభించాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు తిరిగి పట్టాలెక్కే అవకాశం ఉంది. వైకాపా ప్రభుత్వం 2020 మార్చిలో బాపట్లలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పట్టణ శివారున జమ్ములపాలెం రోడ్డు 500 పడకల బోధనాసుపత్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతి గృహాలు, నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి 54 ఎకరాల అసైన్డ్ భూములు కేటాయించింది. రూ.510 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 2021 మే 31న భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేసి 2025 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు.

నిధుల కొరతతో భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. వైద్య కళాశాల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.270 కోట్ల రుణం తీసుకున్నారు. నాలుగేళ్లలో కేవలం పునాది దశ వరకు మాత్రమే పనులు చేశారు. రూ.78 కోట్ల విలువైన పనులు చేయగా.. గుత్తేదారుకు రూ.30 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.48 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నాబార్డు రుణాన్ని ఇతర అవసరాలకు వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధుల కొరత ఏర్పడి గతేడాది జూన్ నుంచి పనులు నిలిచాయి. వైద్య కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలని కూటమి ప్రభుత్వం భావించింది. నీతి ఆయోగ్ ద్వారా నిధులు సాధించటానికి ప్రయత్నాలు ప్రారంభించింది.

కేంద్ర బడ్జెట్లో దేశవ్యాప్తంగా రానున్న ఐదేళ్లలో 75 వేల ఎంబీబీఎస్ సీట్లు పెంచుతామని ప్రకటించారు. ఈ ఏడాది పది వేలు, మిగిలిన నాలుగేళ్లలో మరో 65 వేల సీట్లు పెంచాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం



ఉన్న వైద్య కళాశాలల్లో అదనంగా సీట్లు పెంచటంతో పాటు కొత్త కళాశాల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వనుంది. కొత్త కేంద్ర బడ్జెట్‌తో బాపట్ల వైద్య కళాశాల నిర్మాణానికి నిధులు సాధించే అవకాశం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో కొంత నిధులు కేటాయిస్తే వెంటనే కళాశాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించవచ్చు. కేంద్ర నిధులు సాధిస్తే రెండేళ్లలో భవనాల నిర్మాణం పూర్తయి వైద్య కళాశాల ప్రారంభమై విద్యార్థులకు వైద్య విద్య సీట్లు అందుబాటులోకి వస్తాయి. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం. వైద్య సేవలకు జిల్లా ప్రజలు 60 కి.మీ. దూరంలోని గుంటూరు లేదా ఒంగోలు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర వైద్యం అందక మార్గమధ్యలో రోగులు, రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు చనిపోతున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఓ వైద్య కళాశాల ఉండాలని గతంలో నీతి ఆయోగ్ ప్రతిపాదించింది.

**నిధుల మంజూరుకు కృషి**

బాపట్లలో వైద్య కళాశాల, బోధనాసుపత్రి నిర్మాణ ఆవశ్యకతను కేంద్రానికి వివరిస్తా. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి పునాది దశలో నిలిచిన వైద్య కళాశాల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా కృషి చేస్తా. ఈ ప్రాంతంలో 500 పడకల బోధనాసుపత్రి వస్తే ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. తెన్నేటి కృష్ణప్రసాద్, ఎంపీ, బాపట్ల

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0–216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముందదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)

గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది.ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

చురకలు




# పేద రోగులకు కొండంత సాయం



అమరావతి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఇమ్యునో ఫ్లోరోసెన్స్ మైక్రో స్కోపీ. ఇది మూత్రపిండాలు.. చర్మ సంబంధిత వ్యాధులను నిర్ధారిస్తుంది. ఇప్పటివరకు గుంటూరు జీజీహెచ్‌లో ఇది లేక నెఫ్రాలజీ, స్కిన్ విభాగాలకు వచ్చే పేషెంట్ల నుంచి ముక్క(బయాప్సీ) తీసి హైదారాబాద్ పంపి పరీక్షలు చేయించేవారు. ఇందుకోసం జీజీహెచ్‌కు సాలీనా రూ.లక్షలు ఖర్చయ్యేది. నెలకు సగటున నెఫ్రాలజీ విభాగం నుంచి 5-6, స్కిన్ విభాగం నుంచి 12-15 శాంపిళ్లు వచ్చేవి. వీటిని బయటకు పంపి పరీక్షలు చేయించడానికి ఆలస్యమయ్యేది. కిడ్నీ వ్యాధుల నిర్ధారణకు ఖరీదైన రియోజన్స్ వాడతారు. ఒక లీటర్ రియోజన్స్ ద్రావకం ఖరీదు రూ.40 వేల దాకా ఉంటుంది. ఈ పరీక్షకు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు రూ.25 వేల దాకా ఛార్జి చేస్తాయి. కొందరికి చర్మంపై అంతుచిక్కని మచ్చలు వస్తాయి. వైద్య పరిభాషలో వాటిని బుల్లస్ లిజిన్స్ అంటారు. అది ఎందువల్ల వచ్చిందో ఈస్కోపీ కచ్చితంగా నిర్ధారిస్తుంది. ఎంతో ప్రయోజనకరమైన యంత్రాన్ని దాత ఒకరు రూ.10 లక్షల వెచ్చించి అందజేశారు. ఇకమీదట జీజీహెచ్ రోగులకు బయాప్సీ పరీక్షలు వైద్యకశాశాల పెథాలజీ విభాగమే చేసి రిపోర్టులు ఇస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు మహర్దశ పట్టుకుంది. దేశ, విదేశాల్లో స్థిరపడిన అనేక మంది వైద్యులు విరాళాలిచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. న్యూరాలజీ వైద్యంలో విశేషానుభవం కలిగిన ఆచార్య సుందరాచారిని ప్రభుత్వం రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా నియమించడం విరాళాలు రావడానికి మరింత తోడయింది. ఆయన వద్ద వైద్య మెలకువలు నేర్చుకున్న వారు, సన్నిహితులు కళాశాల అభివృద్ధికి సాయం చేస్తున్నారు. నగదు, వస్తు, వైద్య పరికరాల రూపాల్లో ఇవి అందుతున్నాయి. క్లిష్టతరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి పరికరాలు ఇస్తుండడంతో రోగులకే కాదు వైద్య విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. మనం చూస్తున్నది కారియో టైపింగ్ మిషన్. రాష్ట్రంలోని బోధనాసు పత్రుల్లో ఎక్కడా లేదు. రూ.అరకోటికి పైగా విలువ చేసే మిషన్‌ను యూఎస్‌లో ఉంటున్న వైద్యురాలొకరు కొనుగోలు చేసి కళాశాలకు అందజేశారు. ఇది జన్యుపరంగా వచ్చే వ్యాధులను ముందుగానే పసిగడుతుంది. క్రోమోజోమ్స్‌ను మ్యాపింగ్ చేసి ఈ పరీక్ష చేస్తారు. జన్యుపరంగా ఇంట్లో పెద్దలకున్న వ్యాధులు కొన్ని పిల్లలకు వస్తాయి. బ్లడ్ క్యాన్సర్ తదితరాలు ఈ కోవలోకి వస్తాయి. పెద్దల నుంచి పిల్లలకు రాకుండా ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. వైద్య పరిభాషలో దీన్ని బ్రాకా అని పిలుస్తారు. జన్యుపరంగా పిల్లలకు ఏ జీన్ వల్ల వస్తుందో గుర్తించి దాన్ని తొలగించి ముందుగానే వ్యాధి రాకుండా నియంత్రించుకోవచ్చని వైద్యులు తెలిపారు. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష.

# వైకాపా ఇచ్చిన పట్టాలు మాకొద్దు.. వెనక్కి తీసుకోండి

అమరావతి: పేదలకు గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో మేం ఇళ్లు కట్టుకోలేదు. అవి ఊరికి దూరంగా ఉన్నాయి. నివాసయోగ్యంగా లేవని కొందరు.. చెరువులు, శ్మశానవాటికల పక్కన ఇస్తే అక్కడెవరుంటారని మరికొందరు లబ్ధిదారులు.. అధికారులను కలిసి ఆ పట్టాలను రద్దు చేయాలని కోరుతున్నారు. అప్పట్లో మా పేరు మీద ఇచ్చిన పట్టాలను వెనక్కి ఇచ్చేస్తాం.. కూటమి ప్రభుత్వం ఇచ్చే స్థలం తీసుకుంటామంటూ అర్జీలు ఇస్తున్నారు. గతంలో ఇళ్ల స్థలాలను అర్హులే పొందారా? అనర్హులున్నారా? అన్న అంశంపై అధికారులు సర్వే చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయికి వెళ్లిన సచివాలయ, మున్సిపల్ ఉద్యోగుల ఎదుట చాలామంది లబ్ధిదారులు తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఇలాంటి వినతులు మిగిలిన పట్టణాలతో పోలిస్తే గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కువగా వస్తున్నాయి. వీరికి ఏం చెప్పాలో తెలియక అధికారులు ఎలాంటి హామీ ఇవ్వడం లేదు.తాము అధికారంలోకి వస్తే ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. గతంలో



వైకాపా హయాంలో పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున స్థలాలిచ్చారు. సెంటు స్థలంలో నిర్మించే ఇల్లు నివాసానికి ఏమాత్రం అనువుగా ఉండదని లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. పైగా నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో ఇవ్వడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేదు. వీరి విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు వెలువడలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే గతంలో పట్టాలు పొందినవారిలో అనర్హులను మాత్రమే గుర్తిస్తున్నామన్నారు. గుంటూరు నగరానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలోని పేరేచర్ల, కొర్నెపాడు లేఔట్లు పొలాల్లో ఉన్నాయి. ఇక్కడ నివసించడం కష్టమని అత్యధిక లబ్ధిదారులు అసంతృప్తితో పట్టాలను వెనక్కి ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. లాం వద్ద లేఔట్‌పైనా ఇదే పరిస్థితి. అంత దూరం నుంచి నగరంలోకి రావాలంటే రెండు ఆటోలు మారాలని, ప్రయాణ వ్యయం ఎక్కువవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంతమందైతే నేతలతో సిఫార్సు చేయించుకుని అర్జీలిస్తున్నారు.

# కరవు సీమపై కరుణ చూపేనా?



అనంతపురం : ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉమ్మడి అనంతను ప్రగతి వైపు నడిపించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సాగునీరు, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గతేడాది నవంబరులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.1867 కోట్లు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం పక్కనపెట్టేసిన పేరూరు, బైరవానితిప్ప ప్రాజెక్టులను మళ్లీ గాడిలో పెట్టాల్సి ఉంది. రైతులకు రాయితీ అందించే పథకాలకు నిధుల కేటాయింపులు పెరగాలి. జిల్లాకు చెందిన పయ్యావుల కేశవ్ ఆర్థికమంత్రిగా ఉండటంతో బడ్జెట్‌పై అనంత జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

**ఉన్నత విద్యలో రాణించాలంటే..**

కొన్నేళ్లుగా జేఎన్టీయూ, ఎస్కేయూలకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోంది. ఏటా రెండింటికి కలిపి రూ.150 కోట్లకు మించి ఇవ్వడం లేదు. ఇవి జీతాలకే సరిపోతున్నాయి.

**ఉద్యానానికి ఊతమిస్తేనే..**

ఉమ్మడి జిల్లాలో అరటి, మామిడి, మిరప, చీని, టమాటా, వక్క, దానిమ్మను 1,51,876 హెక్టార్లలో పండిస్తున్నారు. ప్రస్తుతం 31.2 లక్షల టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో 38.2 లక్షల టన్నులకు పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.

**ఆసుపత్రుల నిర్వహణకు..**

ఉమ్మడి జిల్లాలో జీజీహెచ్, జిల్లా ఆసుపత్రి, వైద్యకళాశాల, 6 ప్రాంతీయ ఆసుపత్రులు, 14 సీహెచ్‌సీలు, 86 పీహెచ్‌సీలు ఉన్నాయి. చాలావాటిల్లో ఇప్పటికీ తగిన సదుపాయాలు లేవు. అనంతపురంలో మాతా, శిశు కేంద్రం, పెనుకొండ వైద్య కళాశాల నిర్మాణానికి నిధులు వస్తేనే పనులు ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

**బిందుసేద్యం స్పష్టత రానుందా..!**

గతేడాది ఉమ్మడి జిల్లాలో 67 వేల హెక్టార్లలో బిందుసేద్యం చేయాలని లక్ష్యం విధించగా 30 వేల హెక్టార్లకే అనుమతులు ఇచ్చారు. వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం మాత్రమే రాయితీ అందుతోంది. 90 శాతం రాయితీ ఇవ్వాలనే డిమాండ్ ఉంది. దీనిపై బడ్జెట్‌లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కాలి**

తెదేపా ప్రభుత్వం 2018లో చేపట్టిన జీడిపల్లి-పేరూరు, జీడిపల్లి-బైరవానితిప్ప ప్రాజెక్టులను వైకాపా ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. జీడిపల్లి-పేరూరుకు అప్పట్లోనే రూ.803 కోట్లు కేటాయించారు. ఇప్పుడు అంచనా వ్యయం రూ.900 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. జీడిపల్లి-బైరవానితిప్ప ప్రాజెక్టుకు అప్పటి తెదేపా సర్కారు రూ.968 కోట్లు కేటాయించి ప్రధాన కాలువ పనులు చేపట్టింది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే సుమారు లక్ష ఎకరాలకు నీరు అందించవచ్చు. మడకశిర బ్రాంచి కెనాల్‌కు సంబంధించి రూ.730 కోట్లతో గత తెదేపా ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తిచేసింది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రూ.214 కోట్ల అంచనాతో బైపాస్ కెనాల్ నిర్మాణానికి జీవో జారీ చేశారు. ఈ బడ్జెట్‌లో మడకశిర బ్రాంచి కెనాల్‌కు నిధులు కేటాయించాలి.

**పరిశ్రమలకు పెద్దపీట అవసరం**

జగన్ పాలనలో ఉమ్మడి జిల్లాలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు భారత్ ఫోర్జ్, కియా అనుబంధ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

# విరబూసిన పూత.. దిగుబడిపై ఆశ



అనంతపురం : ఈ ఏడాది విభిన్న వాతావరణ పరిస్థితులతో మామిడి పంట ఆశాజనకంగా ఉంది. పూత కాస్త ఆలస్యంగా విరబూసింది. దిగుబడులు బాగా పెరిగి మంచి ధరలు వస్తాయని అటు అన్నదాతలు, ఇటు ఉద్యానశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టపర్తి, కొత్తచెరువు, తనకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, గుత్తి, కంబదూరు తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. చీనీ తర్వాత మామిడి సాగు రెండో స్థానంలో ఉంది. గతేడాది అధిక వర్షాలతో పంట పూత ఆలస్యమైంది. నవంబరు, డిసెంబరు నెలల్లో పూత రావాల్సి ఉంది. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయ దశల్లో ఉంది. హెక్టారుకు 10 టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. దిల్లీ, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బళ్లారి తదితర ప్రాంతాలకు మామిడి ఎగుమతి అవుతుంటుంది.

**పక్వ దశలోనే కోతలు:** కాయ పక్వ దశకు వచ్చినప్పుడే కోయాలి. ఆరు సెంటీమీటర్లు తొడిమి ఉండేలా ఉదయం వేళల్లో కోస్తే మంచిది. హార్వెస్టర్లు వినియోగిస్తే కాయలు దెబ్బతినవు. కోతకు 40 రోజుల ముందే నీటి తడులు ఆపేయాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సహజ సిద్ధంగా మాగబెడితేనే..**

బేనీషా, మల్లికా, తోతాపురి, అల్ఫన్‌షో, బెంగళూరు, నీలిమా తదితర రకాలు సాగులో ఉన్నాయి. కాయలు మాగబెట్టేందుకు వ్యాపారులు కార్బైడ్ వాడుతున్నారు. దీంతో పండ్లు నిగనిగలాడుతాయి. కాయల లోపల మాత్రం తెల్లగానే ఉంటుంది. పండ్లకు కార్బైడ్ వాడకం ప్రమాదకరం కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించాయి. ప్రధానంగా రిటైరింగ్ ఛాంబర్లలో మాగబెట్టాలి. సహజ సిద్ధంగా వరిగడ్డిలో మాగబెడితే మరీ మంచిది.

**కవర్ల వాడకంతో మరింత నాణ్యత**–నరసింహారావు, ఉప సంచాలకులు, ఉద్యానశాఖ

ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా మామిడి కాయలకు 50 శాతం రాయితీతో కవర్లు అందించి ప్రోత్సహిస్తున్నాం. హెక్టారుకు రూ.10 వేలు ఇస్తున్నాం. వీటి ద్వారా కాయలు నాణ్యతతో పాటు చీడపీడలు నివారణకు తోడ్పడుతుంది. ఎండకు కాయలు చీలిక రాకుండా నివారిస్తోంది. కాయ సహజ రంగు కోల్పోదు. మంచి ధర దక్కుతుంది. సాగు చేసిన ప్రతి రైతుకు కవర్ల రాయితీ వర్తిస్తుంది. ఇందుకు ఆయా డివిజన్లలో ఉద్యానాధికారులకు సంప్రదించవచ్చు.

ఉమ్మడి అనంత జిల్లాలో సాగు ఇలా..

సాగు విస్తీర్ణం 55 వేల హెక్టార్లు
కాపుకొచ్చిన పంట 42 వేల హెక్టార్లు
దిగుబడి అంచనా 4.20 లక్షల టన్నులు
తాజా మార్కెట్ ధర టన్ను రూ.1.10 లక్షలు

# అసైన్డ్ భూముల్లో రియల్ దందా



అనంతపురం : గుత్తి పురపాలికతోపాటు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు అసైన్డ్‌భూముల్లో దందా సాగిస్తున్నారు. రూ.150 కోట్లు విలువైన సర్కారు స్థలాలు చేతులు మారుతున్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులతో కుమ్మక్కు అవుతూ దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తాడిపత్రి రోడ్డు, కొత్తూరు, తురకపల్లిరోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ లేఅవుట్‌లు... మిగిలిన చోట్ల ప్రభుత్వ భూములు ఉన్నాయి.

**తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ..**

గుత్తి పట్టణంతోపాటు శివారులోని అసైన్డ్‌భూములను లబ్ధి పొందుతున్న వారి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. వెంచర్లు వేస్తూ రూ.కోట్లు కూడగట్టుకుంటున్నారు. గుత్తిలోని సర్వేనంబరు 725లో నాలుగు ఎకరాల అసైన్‌భూమిని కొనుగోలు చేసి.. లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించారు. సెంటు స్థలాన్ని రూ.1లక్ష నుంచి 2లక్షలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. సర్వేనంబరు 728లో రెండు ఎకరాల అసైన్డ్‌భూమిలో లేఅవుట్ వేసి రూ.లక్షలు దండుకున్నారు. 644లో మూడు ఎకరాలు, 590లో ప్రభుత్వ భూమిలో రియల్ దందా సాగించి దండుకున్నారు. ఓ ప్రజాప్రతినిధి కుమారుడు నేమితాబాదు సమీపంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో వెంచర్ వేసి.. జేబు నింపుకొన్నాడు. కరిడికొండ పంచాయతీ పరిధి బాచుపల్లిలో ఓవైకాపా నాయకుడు, ప్రజాప్రతినిధి సర్వేనంబరు 848లో 5ఎకరాల అసైన్డ్‌భూమిని ఒకరి నుంచి రూ.22 లక్షలకు కొనుగోలు చేసి.. ప్లాట్లువేసి విక్రయానికి పూనుకున్నాడు. అదే గ్రామంలోని 188,179 సర్వేనంబర్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది.

**క్రయవిక్రయాలు చేస్తే చర్యలు తప్పవు- ఓబిలేశు, తహసీల్దారు**

అసైన్డ్‌భూములను క్రయవిక్రయాలు చేయకూడదు. ప్రభుత్వ భూముల్లో స్థిరాస్తి వ్యాపారానికి సంబంధించి పరిశీలించి చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూస్తాం.

# గురుకులాలు.. సరస్వతీ నిలయాలు

పర్చూరు : గురుకులాలు సరస్వతీ నిలయాలుగా నిలుస్తున్నాయి. వీటిల్లో చేరేందుకు ఎన్నడూ లేనంతగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025-2026 విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాగా ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అర్జీలు స్వీకరిస్తున్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు మార్చి 6 చివరి తేదీ కాగా ఏప్రిల్ 6న ప్రవేశపరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా 1280 సీట్లు ఖాళీగా ఉన్నాయి. బాలురకు రెండు, బాలికలకు ఆరు పాఠశాలలు, కళాశాలలు అనుబంధంగా ఉన్నాయి. ఒక్కొక్క పాఠశాలలో ఐదో తరగతికి 80, ఇంటర్మీడియట్‌కు 80 సీట్లుగా ఖాళీగా ఉన్నాయి. వీటిలో 75శాతం సీట్లు షెడ్యూల్డ్ కులాలకు, 12శాతం(బీసీ-సీ), 6శాతం(ఎస్టీ), 5శాతం(బీసీ), 2శాతం ఇతరులకు కేటాయిస్తారు. ఆయా తరగతులకు సంబంధించి ఇప్పటికే 1600 దరఖాస్తులు చేరినట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సమన్వయకర్తలు తెలుపుతున్నారు.

**జిల్లాలోని గురుకుల పాఠశాలలు**

బాలికలు: బాపట్ల, నరసాయపాలెం, రేపల్లె, అద్దంకి, పర్చూరు, యద్దనపూడి పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి.

బాలురకు: చుండూరు, నిజాంపట్నం పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ



తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతికి, పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు.

**మెరుగైన వసతులు కల్పిస్తున్నాం**

ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నాం. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్ ఉచితంగా అందిస్తున్నాం. నాణ్యమైన విద్యతోపాటు పరిపూర్ణ వికాసం కోసం క్రీడలు, సంగీతం, నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యేకించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ ఇస్తున్నాం. విద్యార్థినుల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఈ అవకాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కె.పద్మజ, జిల్లా కో-ఆర్డినేటర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు

# పింఛన్లకూ బదిలీలు

విజయవాడ : రొంపిచర్లకు చెందిన లక్ష్మీ భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో విజయవాడలో ఉంటున్న కుమార్తె తల్లిని తన వద్ద ఉంచి బాగోగులు చూసుకుంటున్నారు. దీంతో ఆమె పింఛను తీసుకునేందుకు ప్రతి నెలా స్వగ్రామానికి రావాల్సి వస్తోంది. వయసు మీద పడటంతో కూతురు, మనవడు ఎవరో ఒకరిని తోడు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రతి నెలా రావడంతో తీసుకునే పింఛను నగదు కొంత ఖర్చులకే సరిపోతుంది. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన ఠంచనుగా పింఛను అందజేస్తోంది. నెలలో మొదటి తేదీ సెలవు వస్తే ముందు నెల చివరి రోజే పింఛను నగదు లబ్ధిదారులకు చేరేలా చూస్తోంది. దీంతో దూర ప్రాంతాల్లో ఉంటున్న కొందరు లబ్ధిదారులు వ్యయప్రయాసలకోర్చి సొంతూళ్లకు రావాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టిసారించింది. లబ్ధిదారులు తాము కోరుకున్న చోటుకు పింఛను బదిలీ చేసుకునే అవకాశాన్ని సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది.

**ఇలా చేయాలి**

ఎన్టీఆర్ భరోసా పింఛను బదిలీ చేయించుకోవాలనుకునే లబ్ధిదారులు గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయాలి. పింఛను వెబ్‌సైట్‌లో దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్ ఇచ్చింది. పింఛను ఐడీ, ఏప్రాంతానికి బదిలీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంతం చిరునామా ఇవ్వాలి. నివాసం ఉంటున్న జిల్లా, మండలం, గ్రామసచివాలయం పేర్లను పేర్కొనాల్సి ఉంటుంది. దీనివల్ల స్వగ్రామానికి రాలేని వారు ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో పింఛన్లు తీసుకోవటానికి దోహద పడుతుందని రొంపిచర్ల ఎంపీడీవో మాథ్యూబాబు తెలిపారు.

# అపరాల ధరలు.. నేలచూపులు

చెరుకుపల్లి : నూర్పిళ్లు మొదలై పంట ఉత్పత్తులు అమ్ముకొనే సమయంలో ధరలు పతనమై రైతులను దిగాలు పడేలా చేస్తున్నాయి. రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది దాదాపు 32 వేల ఎకరాల్లో అపరాలు సాగు చేశారు. కొద్ది మంది మాత్రమే అపరాలు గిట్టుబాటు కావటం లేదని మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. గూడవల్లి, నడింపల్లి ప్రాంతాల్లో పెసర నూర్పిళ్లు పూర్తయి, పంట ఉ



త్పత్తులు ముమ్మరంగా మార్కెట్‌కు రావటం ప్రారంభమయ్యాయి. ఆరంభంలోనే ధరలు రైతులను నిరాశకు గురిచేశాయి. గత రబీలో మినుములు ప్రారంభ ధర క్వింటాలుకు రూ.8800, పెసలు రూ.8500 ఉండగా ఈ సంవత్సరం క్వింటా మినుములు రూ.7900, పెసలు రూ.7300 మించి ధర పలకటంలేదు. కేంద్ర ఈ యేడు మద్దతు ధరగా మినుముకు రూ.7400, పెసలుకు రూ.8650 ప్రకటించింది. గిట్టుబాటు ధర కాకపోయినా మినుముకు మాత్రం మద్దతు ధరకన్నా నాలుగైదు వందలు అధికంగా లభిస్తున్నా పెసలుకు మాత్రం మద్దతు ధరకన్నా క్వింటాలుకు రూ.1350 తక్కువగా వ్యాపారాలు జరుగుతున్నాయి. మరి కొద్దిరోజుల్లో నూర్పిళ్లు ముమ్మరంగా సాగి సరకు మార్కెట్‌ను ముంచెత్తే అవకాశం ఉంది. పెసలు త్వరగా పుచ్చుపట్టే అవకాశాలున్న దృష్ట్యా రైతులు నూర్పిళు కాగానే విక్రయాలు చేసే పరిస్థితి ఉండటంతో పెసల ధర మరింత దిగజారవచ్చని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తీరం.. కాలుష్య కాసారం

పాయకరావుపేట : తీర ప్రాంతం కాలుష్య కాసారంగా మారుతోంది. బంగాళాఖాతాన్ని డంపింగుయార్డుగా మార్చేస్తున్నారు. తీరప్రాంతం వెంబడి వెలిసిన రసాయన పరిశ్రమలతో ఇప్పటికే జలాలు కలుషితం అవుతున్నాయి. వీటికి పోటీగా హేచరీలు, రొయ్యల చెరువుల నుంచి వస్తున్న వ్యర్థాలతో సంద్రం మరింత కాలుష్యం బారిన పడుతోంది. అడిగే నాథుడు, తీరప్రాంతాన్ని సంరక్షించే అధికారులు కనిపించకపోవడంతో అంతా మా ఇష్టం అన్న రీతిలో సాగిపోతోంది. పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట, కొర్లాయంపేట, రత్నాయంపేట, వెంకటనగరం, కుమారపురం, రాజానగరం తదితర తీర ప్రాంతాల పరిధిలో 10కి పైగా హేచరీలు ఉన్నాయి. ఇవన్నీ తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నవే. వీటిలో వచ్చే వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదులుతున్నారు. దీనికోసం ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా సముద్రపు ఒడ్డున నిర్మాణాలు చేపట్టారు. అక్కడి నుంచే ప్లాస్టిక్ పైపుల ద్వారా కలుషిత జలాలను నేరుగా విడుదల చేస్తున్నారు. పాల్మన్‌పేట నుంచి రత్నాయంపేట తీరం పొడవునా అనధికారికంగా ఏర్పాటు చేసిన పైపులే దర్శనమిస్తాయి. హేచరీల్లో వచ్చిన నీటిని ఏమాత్రం శుద్ధి చేయకుండా పంపిస్తున్నారు. నల్లరంగులో ఉన్న జలాలు సముద్రంలోకి చేరుతున్నాయి. నీరంతా దుర్వాసన వస్తోంది. సాయంత్రం సమయాల్లో వీటిని దర్జాగా వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కలుషిత జలాలను శుద్ధి చేయాల్సి ఉంది. అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నీటిని సంద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల సముద్ర జలాల్లో పీహెచ్‌లో మార్పు వచ్చే ప్రమాదముందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల చిన్న చేపలు, గుడ్డు దశలో ఉన్న మత్స్యసంపద చనిపోయే అవకాశముంది. పైపులైన్లు ఉంచేందుకు వీలుగా షెడ్లు నిర్మించారు. సముద్రానికి 10 మీటర్ల దూరంలోనే



వీటిని ఏర్పాటు చేశారు. ఏవిధమైన అనుమతులు తీసుకోలేదు. బహిరంగంగానే నిబంధనలు అతిక్రమిస్తున్నా పట్టించుకునే వారే కనిపించడం లేదు. దీంతో అడ్డగోలుగా తీరాన్ని కలుషితం చేస్తున్నారు. తీరప్రాంతం వెంబడి అనధికారికంగా పైపులు ఏర్పాటుతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు ఇబ్బందులు వస్తున్నాయని వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చేపల లభ్యత తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తీరంలో రొయ్యల చెరువులు**

రత్నాయంపేట తీర ప్రాంతంలో జెట్టీ పక్కనే సముద్రానికి కేవలం 20 మీటర్ల దూరంలో రొయ్యల చెరువులు తవ్వారు. ప్రభుత్వ స్థలంలో చెరువుల్లో రొయ్యల పెంపకం చేపట్టారు. అంతేగాక రొయ్యల సాగు తర్వాత మిగిలిన వ్యర్థ జలాలను మోటార్ల ద్వారా సముద్రంలోకి వదులుతున్నారు. ఇదంతా మండల స్థాయి అధికారులు కనుల ముందే సాగుతోంది. అయినా ఎలాంటి చర్యలు లేవు.

**తాఖీదులు జారీ చేస్తాం**

హేచరీల్లో వచ్చే కలుషిత నీటిని ముందుగా శుద్ధి చేయాలి. ఆ తర్వాత వాటిని బయటకు పంపాలి. నిబంధనలు పాటించకపోతే తాఖీదులు జారీ చేస్తాం. చర్యలు తీసుకుంటాం.

– పి.శృతి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి.

# 'ఉక్కు'లాంటి మనుషుల్లోనూ వేదన

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశం ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్లో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరిగాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం ఆచార్యులు ఎంవీఆర్ రాజు, జి.శర్వాణి చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది.

ఈ పరిశోధన పత్రం 'ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లైడ్ సైకాలజీ' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది. దీనికి ముందుగా వివిధ సంస్థల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలను పరిశీలించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. సంస్థలో ప్రస్తుతం జరుగుతున్న మార్పుల నేపథ్యంలో ఉద్యోగుల పనితీరు, శ్రేయస్సును మెరుగుపరచడమే లక్ష్యంగా పరిశోధన సాగినట్లు తెలిపారు.

ఉద్యోగ భద్రతపై ఆందోళన ఉద్యోగుల్లో వివిధ ..వయసుల వారీగా మానసిక ఆరోగ్యంలో చాలా వ్యత్యాసం కనిపించింద్ది.

46 ఏళ్లు దాటిన, డిప్లొమో, ఐటీఐ, డిగ్రీ చదివిన వారితో పోలిస్తే పీజీ చదివినోరూ.11 లక్షల వార్షికాదాయం గల ఉద్యోగులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు..

25–35 ఏళ్ల వయసున్న ఉద్యోగులు నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకుంటున్నారు

ప్రైవేటీకరణ ప్రతిపాదనతో బయట అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.దతపై ఆందోళన నెలకొంది. దీంతో వారి ఖర్చులు, వ్యక్తిగత అవసరాలు, పిల్లల ఉన్నత చదువులు, సరైన వివాహ సంబంధాలు తీసుకురావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్లోనే అధికం: ప్రైవేటీకరణ ప్రకటనతో స్టీల్‌విశాఖ స్టీల్‌ప్లాంట్ 100 శాతం ప్రైవేటీకరణకు 2021లో కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. నాటి నుంచి ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రైవేటీకరణ అంశం కారణంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (స్టీల్‌ప్లాంట్) ఉద్యోగుల మానసిక ఆరోగ్యం ఏవిధంగా ప్రభావితమైందో తెలుసుకోవాలని పరిశోధకులు భావించారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేసేందుకు వయసు, విద్యార్హత, వార్షికాదాయం, హోదా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. వాటి ఆధారంగా 96 మంది ఎగ్జిక్యూటివ్, నాన్‌ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులపై పరిశోధన చేపట్టారు. ఈ పరిశోధనలో పలు అంశాలు వెల్లడయ్యాయి. ప్లాంట్‌లో నాన్‌ఎగ్జిక్యూటివ్ కంటే ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఎక్కువగా మానసిక అనారోగ్యం బారిన పడుతున్నారు. వారంతా ఆత్మవిశ్వాసం, జీతం, సీనియారిటీ, అనుభవం తదితరాల ఆధారంగా సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు సంపాదించుకున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటు చేతుల్లోకి వెళ్తే ఎదురయ్యే పర్యవసనాలపై ఆందోళన చెందుతున్నారు. సామాజిక వేర్పాటు, అసమగ్రత తదితర అంశాలు వారిని మరింత కుంగదీస్తున్నాయి. పైగా బాధ్యతల నిర్వహణ భారం, క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవడం, సుదీర్ఘ పనివేళల వల్ల వారిలో ఒత్తిడి స్థాయులు పెరుగుతున్నాయి.ఆ లేఖతో మరింత ఆందోళన: ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్ఎండీసీ నగర్నార్ ప్లాంటుకు 500 మంది ఉద్యోగులను డిప్యుటేషన్‌పై పంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

# ప్రయోగం.. అదో బ్రహ్మ పదార్థం



ఒంగోలు : ఇంటర్మీడియట్ సైన్స్ విద్యలో ప్రయోగ పరీక్షలు ఓ భాగం. సీనియర్ ఇంటర్ సైన్స్ విద్యార్థులకు ఇవి ఎంతో కీలకం. పరిపూర్ణమైన అవగాహనకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో దాదాపు పది వరకు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రయోగాలకు కొన్ని కళాశాలలు ప్రాధాన్యమివ్వడం లేదు. కొన్ని చోట్ల ప్రయోగశాలలు లేకుండానే మమ అనిపిస్తున్నారు. వీటి నిర్వహణ అంతా ఓ ప్రహసనంగా మారింది. తూతూ మంత్రంగా నేర్పించి విద్యార్థులను పరీక్షలకు పంపుతున్నారు. అక్కడ ఎగ్జామినర్లతో అవగాహన కుదుర్చుకుని ఉత్తీర్ణత మార్కులు వేయిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిధులివ్వని గత ప్రభుత్వం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్‌ల్లో మొత్తం 18,400 మంది ఇంటర్ విద్యార్థులున్నారు. వీరికి ఫిబ్రవరి అయిదో తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒకేషనల్ వారికి 5 నుంచి 18 వరకు, జనరల్ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి 20 వరకు దశల వారీగా వీటిని నిర్వహించనున్నారు. వీరిలో చాలామందికి ప్రయోగం అనేది ఓ బ్రహ్మపదార్థంగా మారింది. ఇందులో గత ప్రభుత్వ పాపం చాలా వరకు ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలకు గడిచిన అయిదేళ్లలో నిధుల కేటాయింపు లేదు. ఈ ఏడాది ప్రతిపాదనలు పంపినా ఇంకా సమకూరలేదు. దీంతో అందుబాటులో ఉన్న వస్తువులు, రసాయనాలతోనే అడపాదడపా ప్రయోగాలు చేయించి నిర్వాహకులు చేతులు దులుపుకొంటున్నారు.

**తనిఖీలప్పుడే పరికరాలు:** కేజీబీవీలు, హైస్కూల్ ప్లస్‌లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అసలు ప్రయోగశాలలే లేవు. సమీపంలోని ప్రభుత్వ కళాశాలలకు రెండు మూడుసార్లు విద్యార్థులను తీసుకెళ్లి మమ అనిపిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో కొంతమేరకు ల్యాబ్‌లున్నా వినియోగానికి ప్రాధాన్యమివ్వడం లేదు. ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు, పరీక్షల సమయంలో అవసరమైన పరికరాలు తెప్పించి అందుబాటులో ఉంచుతున్నారు. ఈ ప్రభావం విద్యార్థుల ఉన్నత చదువులపై పడుతోంది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి అవసరమైన నిధులు కేటాయించేలా చూడాల్సిన అవసరం ఉంది.

# కందిపప్పు.. కొందరికే



కర్నూలు : గుత్తేదారు నిర్లక్ష్యంతో ఫిబ్రవరిలో కందిపప్పు పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12,05,379 మంది కార్డుదారులున్నారు. వీరికి ప్రతినెలా 1,111. 315 టన్నుల కందిపప్పును గుత్తేదారు పౌరసరఫరాల గోదాములకు సరఫరా చేయాలి. వచ్చేనెల కోటాకు సంబంధించి ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీంతో ఈ నెలలో మిగిలిన నిల్వలను సర్దుబాటు చేసి 320.699 టన్నులు డీలర్లకు అందజేస్తున్నారు. ఫలితంగా 8.84 లక్షల మంది కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది.

**ఇక్కడ ఇవ్వడం కష్టం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 11 మండలాలు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీలు, బేతంచెర్ల నగర పంచాయతీకి వచ్చే నెల కందిపప్పు సరఫరా చేయని పరిస్థితి నెలకొంది.

బనగానపల్లి, బేతంచెర్ల, గోస్పాడు, మహానంది, అవుకు, పాములపాడు, సంజామల, వెలుగోడు మండలాలకు కందిపప్పు సరఫరా చేయలేదు. ఆయా మండలాల పరిధిలో 1,38,908 మంది కార్డుదారులున్నారు. ఆదోని గ్రామీణ, అర్బన్‌లో కలిపి 79,405 మంది కార్డుదారులున్నారు. వీరికి నెలవారీగా 73,127 క్వింటాళ్ల కందిపప్పు అవసరం.

**30 శాతం మందికే**

కర్నూలు అర్బన్‌లో 1,12,241 మంది కార్డుదారులుండగా.. రెగ్యులర్‌గా 1,05,895 మందికి కందిపప్పు సరఫరా చేస్తున్నారు. ఫిబ్రవరి కోటా కింద కేవలం 38,994 మందికి కిలో చొప్పున చౌక దుకాణాలకు చేరవేస్తున్నారు.గోనెగండ్ల మండలంలో 23,387 మందికి గాను 79 మంది కార్డుదారులు, కల్లూరు మండలంలో 20,659 మందికి 30, కర్నూలు గ్రామీణంలో 25,946 మందికిగా ను.. 308, నందవరంలో 19,016 మంది కార్డుదారులకుగాను 200 మందికి కిలో చొప్పున సరఫరా చేయనున్నారు. బండి ఆత్మకూరుకు 5 క్వింటాళ్లు, చాగలమర్రికి 9 క్వింటాళ్ల కేటాయింపులే చేశారు.

# రూ.4.4 కోట్లు తారుమారు



కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా నేతలు గుంతల్లో తట్టెడు తారు పోయలేదు.. కానీ కొత్తవి నిర్మాణం పేరిట 'సొంత' దారి చూసుకొన్నారు. కర్నూలు– బెంగళూరు, కర్నూలు–కడప ప్రధాన రహదారులను అనుసంధానం చేసేలా డోన్ పట్టణం మీదుగా జాతీయ రహదారి నిర్మించాలని ప్రతిపాదించారు. వీటికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఆమోద ముద్ర పడితే వారే నాలుగు వరుసల రహదారి నిర్మించేవారు. ఇదంతా తెలిసి కూడా రహదారులు భవనాల శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డోన్ పట్టణంలో రూ.4.4 కోట్లతో నాలుగు వరుసల మార్గం నిర్మించారు. దీన్ని నవంబరు 2022లో ప్రారంభించారు. ఇది జరిగిన కొన్ని నెలలకే డోన్ నుంచి సోమయాజులపల్లి వరకు 53 కి.మీ. మేర రూ.450 కోట్లతో జాతీయ రహదారి (340బి) నిర్మాణానికి మార్గం సుగమైంది.

**అప్పటి మంత్రి ప్రాపకం కోసమే**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రహదారులు గుంతలు పడి అత్యంత అధ్వానంగా మారినా వైకాపా నేతలు పట్టించుకోలేదు.జాతీయ రహదారి నిర్మాణం జరిగే అవకాశం ఉన్న డోన్ పట్టణ రహదారినే విస్తరించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు తలూపారు.అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన నియోజకవర్గం పరిధిలోది కావడం.. ఆర్థికశాఖ మంత్రిగా బిల్లులు మంజూరు చేసే అధికారం ఆయనదే కావడంతో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. డోన్‌లో రహదారి పనులు ప్రారంభించే సమయానికి జాతీయ రహదారి నిర్మాణానికి అనుమతులకు ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులు పచ్చజెండా ఊపారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు ఆపలేదు.

**అడ్డంగా తవ్వేస్తున్నారు.**

జాతీయ రహదారి(340బి) పనులు డోన్ పట్టణంలో చేపడుతున్నారు. రూ.4.4 కోట్లు వెచ్చించి రెండేళ్ల కిందట నిర్మించిన నాలుగు వరుసలలో అత్యధిక భాగాన్ని తొలగిస్తున్నారు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల ప్రమాణాలు వేర్వేరుగా ఉంటాయంటున్నారు.సోమయాజుల పల్లి నుంచి గోర్లగుట్ట వరకు సుమారు 26 కి.మీ. మేర రూ.7 కోట్లతో 2021లో మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పొడవునా కొత్త తారు వేశారు. తాజాగా జాతీయ రహదారి(340బి) పనులు చేస్తుండటంతో సోమయాజులపల్లి నుంచి గోరుమానికొండ వరకు 8 కి.మీ. మేర తవ్వేశారు.

# రుణానంద లహరి

ఒంగోలు : 2014–19 మధ్య తెదేపా ప్రభుత్వం స్వయం ఉపాధిని ప్రోత్సహించింది. 30 నుంచి 50 శాతం రాయితీపై ఉపాధి యూనిట్లతో పాటు, వాహనాలు మంజూరు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లతో పాటు, అగ్రవర్ణ పేదలకు అందించే స్వయం ఉపాధి రుణాలు నిలిపేసింది. ఆయా కార్పొరేషన్లకు కేటాయించిన నిధులను నవరత్నాల పథకాలకు మళ్లించింది. ఫలితంగా నిరుద్యోగ యువతీ, యువకులు ఉపాధికి ఊతం అందక ఇబ్బందులు పడ్డారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మళ్లీ స్వయం ఉపాధి కల్పనపై దృష్టిసారించింది. అగ్రవర్ణ పేదలకు రాయితీ రుణాలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా స్వయం ఉపాధి, డెయిరీ యూనిట్ల ఏర్పాటుతో పాటుబీ బీ–ఫార్మసీ అర్హత ఉన్నవారికి మండల కేంద్రాల్లో జనరిక్ దుకాణం ఏర్పాటు చేయించేలా అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది.

**నమోదు ప్రక్రియ మొదలు:** జిల్లావ్యాప్తంగా బీసీ–ఏ, బీ, డీ, ఈ విభాగాల కింద మొత్తం రూ.24.68 కోట్ల మేర అంచనాతో 1,219 యూనిట్లు మంజూరు చేయనుంది. అందులో 50 శాతం ప్రభుత్వ రాయితీగా, మరో 50 శాతం బ్యాంక్ రుణం ఇవ్వనుంది. అగ్రవర్ణ పేదలకు రూ.15.17 కోట్ల అంచనాతో 568 యూనిట్లు, కాపులకు రూ.6.32 కోట్ల వ్యయంతో 188 యూనిట్లు మంజూరు చేయనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 1,975 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి రుణాల మంజూరు నిమిత్తం రూ.46.17 కోట్ల మేర ఆర్థిక సాయం అందించేలా లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు ప్రభుత్వం వెబ్‌సైట్ విడుదల చేయడంతో జిల్లా వ్యాప్తంగా  నుంచి నమోదు ప్రక్రియ మొదలైంది. ఫిబ్రవరి 7వ తేదీ తుది గడువుగా ప్రకటించింది.

# స్మార్ట్‌గా బాదుడు!

అనకాపల్లి : విద్యుత్తు కనెక్షన్లు అన్నింటికీ దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పంపిణీ సంస్థలు ఉపక్రమించాయి. తొలిదశలో వాణిజ్య అవసరాలకు వినియోగించే కనెక్షన్లు, పరిశ్రమలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ బిగిస్తున్నారు. తొలి దశలో ఇప్పటికే దుకాణాలు, వ్యాపార సముదాయాలు, వీధిదీపాలు, తాగునీటి సరఫరా, ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ మీటర్లు బిగించారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కేటగిరి–2 (వాణిజ్య కనెక్షన్) మీటర్లకు రూ.వేలల్లో బిల్లులు రావడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. బుచ్చెయ్యపేట మండల వడ్డాది, పోలేపల్లి, రాజాంలో విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 13 ఫీడర్లు ఉండగా.. 24015 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వాణిజ్యానికి సంబంధించివని 1,820 ఉన్నాయి.సర్వీసు నంబరు 891తో ఉన్న కనెక్షన్‌కు గత నెలలో రూ.474 బిల్లు వచ్చింది. అంతకుముందు నెలల్లోనూ రూ.500కు మించి ఎప్పుడూ రాలేదు. స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత ఈ నెలలో రూ.19,611 బిల్లు



రావడం చూసి వినియోగదారు అవాక్కయ్యాడు. అలాగే 865 సర్వీసు నంబరుకు రూ.50,250 బిల్లు వచ్చింది. గతంలో రూ.500 – రూ.600 కు మించి బిల్లు రాలేదని ఆ వినియోగదారులు చెబుతున్నారు. మరికొందరు వినియోగదారులకూ రూ.వేలల్లో బిల్లులు రావడం గమనార్హం.

**వ్యతిరేకిస్తున్నా ముందుకే..**

ఒక్కసారిగా రూ.వేలల్లో బిల్లులు రావడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లతో ఆర్థికభారం తప్పదని భయపడుతున్న వినియోగదారులు ముందు నుంచీ వాటిని వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ పంపిణీ సంస్థలు పట్టించుకోకుండా ముందుకెళ్తున్నాయి. స్మార్ట్ మీటర్లు బిగించే కాంట్రాక్టును వైకాపా ప్రభుత్వం అదానీ సంస్థకు కట్టబెట్టింది. స్మార్ట్ మీటర్లు వద్దు బాబోయ్ అంటూ అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ ఎక్కడా వెనక్కు తగ్గలేదు. ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల శ్రీకారం చుట్టి ఇప్పుడు అంతటా అమలు చేస్తున్నారు. గృహ విద్యుత్తు కనెక్షన్లకూ ఈ మీటర్లు బిగించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**ఫిర్యాదులు వస్తున్నాయి:** బిల్లులు ఎక్కువగా వచ్చాయని కొంతమంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ఎందువల్ల ఎక్కువగా వచ్చాయని పరిశీలిస్తాం. ఏదైనా పొరపాటు జరిగితే సరిచేయిస్తాం.రాజు, ఏఈ, వడ్డాది సెక్షన్

**ఎంత వాడితే అంతే బిల్లు:** స్మార్ట్ మీటర్ల విషయంలో కొంతమంది అపోహ పడుతున్నారు. ఎలాంటి సమస్యలు ఉండవు. జిల్లాలో వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన వాటికే వీటిని ఏర్పాటు చేస్తాం. గృహాలు వ్యవసాయ కనెక్షన్లకు పాత మీటర్లే ఉంటాయి. ఎంత వాడితే అంతే బిల్లు వస్తుంది.జి.ప్రసాద్, సూపరింటెండెంట్ ఇంజినీర్, అనకాపల్లి

# సర్వీసుల కొరత.. నిత్యం కలత..!

విశాఖ : నగర జనాభా పెరుగుతున్న కొద్దీ... ఆర్టీసీ తన సేవల్ని విస్తృతం చేయాల్సి ఉంటుంది. కాని అందుకు విరుద్ధంగా సిటీ బస్సుల కొరతతో సర్వీసులు తగ్గించేస్తోంది. దీంతో నిత్యం బస్సులపై ఆధారపడి రాకపోకలు సాగించే పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ... ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. నగర శివారు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు నగరంలోని వాణిజ్య సముదాయాలు, దుకాణాలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులుగా పని చేస్తున్నారు. రాత్రి 9 గంటలకు విధులు ముగించుకుని, ఇంటికి తిరిగెళ్లేందుకు బస్‌స్టాపులకు చేరుకునే సరికి ఆర్టీసీ బస్సులు ఉండటం లేదు. గతంలో ఆరిలోవ, మాధవధార, మురళీనగర్, కొమ్మాది, మధురవాడ ప్రాంతాలకు పదుల సంఖ్యలో సర్వీసులు ఉండేవి. ఇప్పుడు వాటిని నాలుగు నుంచి అయిదు వరకు కుదించేశారు. రాత్రి సమయాల్లో ద్వారకా బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్‌కు చేరుకునే వారికి అనుకూలంగా ఆర్టీసీ సర్వీసులు నడపలేకపోతుంది.

**రద్దీ సమయాల్లో...**ప్రయాణికుల రద్దీ ఉండే సమయంలో బస్సులు నడపాల్సిన ఆర్టీసీ అధికారులు... బడి బస్సుల పేరుతో నగర శివారులోని కళాశాలలకు బస్సుల్ని పంపిస్తున్నారు. విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల్లో కొన్ని తిరిగివచ్చి... సర్వీసు చేసేందుకు సిద్ధమైనా, అప్పటికి ప్రయాణికుల రద్దీ తగ్గిపోతుంది. కొన్ని బస్సులు సాయంత్రం వరకు కళాశాలల వద్దనే నిలిపి ఉంచుతున్నారు.

**ఆదాయం తగ్గుతోంది..!**

ద్వారకా బస్‌స్టాండ్ నుంచి మధురవాడ, కొమ్మాది, పీఎంపాలెం, భీమిలి, తగరపువలస, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు చివరి సర్వీసు వెళ్లిపోతే, అదనంగా డబ్బులు ఖర్చు చేస్తూ ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ఇంటికి వెళ్తున్నారు. ప్రతి నెలా బస్సు సర్వీసులు తగ్గిపోవడంతో నెలవారీ పాసులు తీసుకునే వారి సంఖ్య తగ్గుతోంది. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. అలాగే ప్రయాణికులు భద్రత లేని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

**తప్పని నిరీక్షణ**

ఆర్టీసీ రాయితీ బస్సు పాసులు కొనుగోలు చేస్తున్న విద్యార్థులు నిత్యం దాకమర్రి నుంచి మధురవాడ వరకు రహదారులపైనే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. విజయనగరం నుంచి 111వీ, 211 సర్వీసులు వస్తున్నా...అక్కడి కళాశాలల వద్దకు వచ్చేసరికి రద్దీగా మారుతున్నాయి. కనీసం కాలు మోపడానికి ఖాళీ లేకపోవడంతో, విద్యార్థులు జాతీయ రహదారిపైనే వేచి ఉండాల్సి వస్తోంది.

**కొత్త వాటికి ప్రతిపాదించాం..**ప్రభుత్వం కొత్తగా సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ బస్సుల్ని అందిస్తుంది. అయితే 100 సిటీ బస్సులు అవసరమవుతాయని నివేదించాం. పాత సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్ బస్సుల్ని సిటీ బస్సులుగా మార్పు చేయిస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. కొత్తవి అందుబాటులోకి వచ్చిన తర్వాత సర్వీసుల్ని విస్తరిస్తాం. బి.అప్పలనాడు, ఆర్ఎం, విశాఖపట్నం.

# అక్రమ లేఅవుట్లతో అవస్థలు

పరిగి : పెనుకొండ నియోజకవర్గంలో ఎందుకు భూవివాదాలు ఏర్పడుతున్నాయి? సొంతింటిని నిర్మించుకోవాలన్న ఆశతో అమాయక పేదలు ఎలా మోసాలకు గురవుతున్నారు. ఏ స్థాయిలోనూ అడ్డుకట్ట పడకపోవడానికి కారణాలేంటి అన్న ప్రశ్నలకు అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న లేఅవుట్లే కారణమన్న సమాధానం అటు ప్రజలు, ఇటు అధికారుల నుంచి వినిపిస్తోంది. ఎక్కడ సక్రమమే అన్నమాట వినపడదు. అంతా అక్రమమే రాజ్యమేలుతోంది. నిబంధనలు పాటించకుండా అక్రమార్కులు ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేసి అమాయకులకు కట్టబెట్టి రూ.కోట్లు సంపాదించుకుంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. పెనుకొండ నియోజకవర్గం పారిశ్రామికంగా పరుగులు పెడుతోంది.. ఎక్కడ చూసినా పరిశ్రమలు కనిపిస్తాయి. వాటితోపాటు జాతీయ రహదారుల నిర్మాణం సాగుతోంది. దీంతో గోరంట్ల, పరిగి, సోమందేపల్లి, పెనుకొండ, రొద్దం మండలాల పరిధిలో సామాన్యులు ఇంటి స్థలం కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో గోరంట్ల మండలంలో వందకుపైగా లేఅవుట్లు కనిపిస్తుండగా పరిగి మండలంలో 30 వరకు దర్శనమిస్తున్నాయి. పెనుకొండ మండలంలో 5 చోట్ల అక్రమంగా వేయడంతో వాటిని అధికారులు పట్టించుకోవడం లేదు. అలాంటి లేఅవుట్లలోనే ప్లాట్లు అమ్ముతుండటంతో చాలామంది లబ్ధిదారులు చిక్కుల్లో పడుతున్నారు. ఆర్థికంగా నష్టపోయి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.పరిగి మండలంలో పరిగి, మోదా,



గొరవనహళ్ళి, యర్రగుంట, పెద్దిరెడ్డి పల్లి, బిందునగర్, సుబ్బరాయనిపల్లి, శాసనకోట తదితర చోట్ల అక్రమంగా లేఅవుట్లు వేశారు. కొన్నిచోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో తాఖీదుల జారీ, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందిగోరంట్లలోని విజయనగర్ కాలనీకి దక్షిణదిక్కున వేసిన అనధికార వేఅవుట్లో సుమారు 50 మంది వరకు ఇంటిస్థలాలు కొనుగోలు చేశారు. అనూహ్యంగా ఆ పొలానికి ఆనుకొని మడకశిర నుంచి హిందూపురం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 716జీ వెళుతోంది. దీంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. స్థలాలు కొనుగోలు చేసినవారు నిర్మాణాలు చేపట్టలని వెళితే ఆ స్థలాలు విక్రయించిన వ్యక్తికి మరొకరికి వివాదం ఏర్పడింది. అహుడా అనుమతులున్న లేఅవుట్లో ఇళ్ల స్థలాలు కొనుగోలుచేసి ఉంటే ఈ సమస్య ఎదురయ్యేది కాదు.

**అహుడా అనుమతులున్నచోటే కొనాలి**

మారుతి, తహసీల్దార్, గోరంట్ల

అహుడా అనుమతులు ఉన్న లేఅవుట్‌లోనే ఇంటి స్థలం కొనుగోలు చేస్తే సమస్య ఎదురైతే ప్రభుత్వ అధికారులదే బాధ్యత వహిస్తారు. అలా జరగకనే గోరంట్లలో విపరీతంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. నేను బాధ్యతలు తీసుకున్న తరువాత వ్యవసాయేతర భూమిగా మార్చడానికి ఒక దరఖాస్తు మాత్రం రావడంతో ఉన్నతాధికారులకు పంపాం.

# టిడ్కో సముదాయం.. వసతులు కనం!

చిత్తూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో ఇళ్లందించాలనే లక్ష్యంతో తెదేపా ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపేసింది. 25 శాతం పనులు దాటని గృహాలను రద్దు చేసి సామాన్యులకు షాక్ ఇచ్చింది. డిపాజిట్లు కట్టిన లబ్ధిదారుల నుంచి విమర్శలు రావడంతో చివర్లో కొన్నింటిని పూర్తి చేసి సార్వత్రిక ఎన్నికలకు ముందు తాళాలు ఇచ్చారు. మౌలిక సదుపాయాల గురించి పట్టించుకోనందున ప్రస్తుతం అక్కడ నివసించాలంటేనే పేదలు జంకుతున్నారు. గతంలో 365 చ.అ., 430 చ.అడుగుల విస్తీర్ణమున్న ఇంటిని పొందేందుకు డబ్బులు చెల్లించిన వ్యక్తులు వాటి పురోగతి ఏంటి? అనే ప్రశ్నను సంధిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపా హయాంలో పట్టణాల్లో టిడ్కో ఇళ్లపై సర్వే చేశారు. 1.01 లక్షల మంది గృహాలు అవసరమని దరఖాస్తు చేశారు. 2016- 17 నుంచి 2018- 19 వరకు కేంద్ర ప్రభుత్వం 40,250 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.1.50 లక్షల చొప్పున సాయమందించేందుకు ముందుకు వచ్చాయి. 300 చ.అ. ఇంటికి లబ్ధిదారు రూ.500, 365 చ.అ. ఇంటికి రూ.50 వేలు, 430 చ.అ. ఇంటికి రూ.లక్ష చెల్లించాలని అప్పట్లో తెలిపారు. మిగిలిన నగదును బ్యాంకులు రుణంగా ఇస్తాయని స్పష్టం చేశారు.

**ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు**

చిత్తూరు పరిధిలో పూనేపల్లి వద్ద సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు రోజుల ముందు లబ్ధిదారులకు ఇళ్లు మంజూరైనట్లు పత్రాలు ఇచ్చినా పంపిణీ మాత్రం చేయలేదు. అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించామని వైకాపా ప్రభుత్వం ఘనంగా చెప్పింది. ఇందుకు భిన్నంగా ఇప్పటికీ అక్కడ కొన్ని ఇళ్లకు విద్యుత్తు సదుపాయం లేదు. నీరు కూడా దొరకడంలేదు. ఇళ్ల వద్దకు వెళ్లడానికి సిమెంట్ రోడ్డూ వేయలేదు. దీంతో ప్రస్తుతం అక్కడ పదుల సంఖ్యలోనూ జీవించడం లేదు. గతంలో నిలిచిన 720 ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. ఈలోగా అక్కడ మౌలిక సదుపాయాలూ కల్పిస్తే పేదలకు ఇబ్బందులు తొలగుతాయి.

2014లో టిడ్కో ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు: 1.01 లక్షలు

ఉమ్మడి జిల్లాలో మంజూరైన ఇళ్లు: 40,250

జిల్లాలో పూర్తయిన ఇళ్లు: 3,648

లబ్ధిదారులకు రావాల్సిన డిపాజిట్ నగదు: రూ.37.82 కోట్లు

**వచ్చీ రాగానే రద్దు చేసిన జగన్ సర్కార్**

ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే 25 శాతం లోపు నిర్మాణాలు జరిగిన ఇళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. చిత్తూరులో 672, పుంగనూరులో 624, పుత్తూరులో 576, నగరిలో 528, తిరుపతిలో 1,200, శ్రీకాళహస్తిలో 1,632.. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 6,288 గృహ నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపేశారు. వీటి కోసం లబ్ధిదారులు రూ.37.82 కోట్లు డిపాజిట్‌గా చెల్లించారు. వైకాపా హయాంలో పదేపదే మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ డబ్బును వెనక్కు ఇవ్వడం ..లేదంటే తిరిగి నిర్మాణాలు పునః ప్రారంభించి ఇళ్లు కట్టిస్తే పేదల కల నెరవేరుతుంది.

**పుంగనూరులో ఆందోళనకు దిగి..**మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూ రులోనూ దాదాపు ఇదే పరిస్థితి. రోడ్డు, విద్యుత్తు, నీటి సౌకర్యం కల్పించినా నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది. అప్పట్లో హడావు డిగా పంపిణీ చేశారు. ఇప్పటికీ ఉపరితల ట్యాంకు నిర్మించలేదు. మురుగు నీటి సమస్య సైతం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటీవల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు.

# గొంతు తడిపేవారేరి?



తాడిపత్రి : గుత్తి పురపాలికలో వేసవి ప్రణాళిక అమలుకు నిధులు లేవు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య ముంచుకొస్తున్నా ప్రభుత్వం నుంచి అధికారులు, పాలకులు నిధులను సాధించలేక పోతున్నారు. పురపాలికలో 15 రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. ప్రైవేట్ శుద్ధ జల కేంద్రాల్లో క్యాన్‌కు రూ.10 వెచ్చించి నీటిని కొంటూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. వంటల తయారీకి రోజూ శుద్ధజలం కొనుగోలుకు రూ.30 వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని చెరువులో నీరు ఉండటంతో బోర్లలో నీటి లభ్యత పెరిగింది. దీంతో తాగునీటి సమస్య కొంత తగ్గుతోంది. గతంలో నెలకోసారి నీరు వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పురపాలికకు సొంత నీటి వనరులులేవు. పామిడి పెన్నా నుంచి గుత్తికి తాగునీరు రావాల్సి ఉంది. తరచూ పైపులైన్ దెబ్బతింటోంది. లీకేజీలను పునరుద్ధరించేందుకు వారం రోజులు పాటు సమయం పడుతోంది. రూ.173 కోట్లతో గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తికి తాగునీటిని అందించాల్సిన పథకం పనులు ఏడేళ్ల నుంచి నిలిచిపోయాయి. ఆపథకం పూర్తి అయితే 30ఏళ్లపాటు తాగునీటి సమస్య తలెత్తదు.

రూ.20 లక్షలతో బోర్లు తవ్విస్తాం జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి

గుత్తి పురపాలికలో తాగునీటి సమస్యను వేసవిలో ఎదుర్కొనేందుకు రూ.20లక్షలు సాధారణ నిధులతో బోర్లు తవ్విస్తాం. ఇప్పటికే నిధులను సమీకరించుకున్నాం. ప్రభుత్వానికి రూ.2కోట్లు నిధులు అవసరమని నివేదించాం. నిధులు మంజూరయ్యాయి. విడుదల కాలేదు. కొత్తగా బోర్లను పలు కాలనీల్లో తవ్విస్తాం. ఇప్పుడు ఆరు ట్యాంకర్లను పెట్టాం. అవసరాన్ని బట్టి వాటి సంఖ్య పెంచుతాం.

తాడిపత్రి పురపాలికలోని ప్రజలకు నిత్యం తాగునీరు అందించేందుకు 2017లో రూ.142 కోట్లతో అమృత్ పథకాన్ని ప్రారంభించారు. గండికోట నుంచి 45 కి.మీ.ల పైపులైన్ ద్వారా తాడిపత్రి పురపాలికకు సరఫరా చేయాలన్నది లక్ష్యం. దీనికి సంబంధించిన పనులు వైకాపా ప్రభుత్వం రాగానే నిధులు మంజూరు జాప్యంతో ఆగిపోయాయి. ఇప్పటి వరకు అమృత్ పథకం నిర్మాణ పనులు కేవలం 60 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం పెన్నానదిలోని బోరుబావులు, జేసీ నాగిరెడ్డి నీటి పథకం ద్వారా రెండు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారు. పురపాలికకు 16 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా ప్రస్తుతం 8 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. రానున్న వేసవిలో నీటి సమస్య తీవ్రం కానుంది. అప్పటిలోగా పథకం పూర్తయితే సమస్య ఉండదని ప్రజలు అంటున్నారు.

ప్రస్తుతం 176 ట్యాంకులను అందుబాటులోకి తెచ్చారు. మరికొన్నింటిని సరిచేస్తున్నారు. అమృత్ పథకం కాంట్రాక్టర్లకు నోటీసులు అందించి పనులను ప్రారంభించాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఇప్పటి వరకు రూ.142 కోట్లలో పురపాలిక రూ.76 కోట్లు అందజేసింది.

**ఇబ్బంది రాకుండా చర్యలు**

శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, తాడిపత్రి

రానున్న వేసవిలో తాడిపత్రి పురపాలికకు ఎలాంటి తాగునీటి కష్టాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రస్తుతం పెన్నానదిలో బోరుబాబులు, గండికోట నుంచి జేసీనాగిరెడ్డి పథకం ద్వారా నీరు అందిస్తున్నాం.

# నల్లిపేస్తోంది.. బాబోయ్

త్రిపురాంతకం : ఎర్ర బంగారంగా పేరొందిన మిరప పంటను నల్లి పురుగు(తామర) పీల్చిపిప్పి చేస్తోంది. ఇటీవల వరకు తోటలు బాగానే ఉన్నాయి. డిసెంబరు నెలాఖరులో కురిసిన వరుస వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగింది. దీంతో తామర పురుగు ఆశించింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పంట ప్రస్తుతం కీలమైన పిందె, కాయ దశకు చేరుకుంది. ఆలస్యంగా సాగు చేసిన చోట పూత, పిందె దశలో ఉంది. ఈ తరుణంలో తామర పురుగు ఆశిస్తుండటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

దెబ్బతీసిన వరుస వానలు...: జిల్లాలో 58,123 ఎకరాల్లో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులకు ఎకరాకు మరో రూ.40 వేలు అదనంగా వ్యయమవుతుంది. ఎకరాకు 25



నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే కష్టాలు తీరుతాయని కర్షకులు భావించారు. కాపు ముమ్మరంగా వస్తున్న దశలో వరుణుడు వారి ఆశలపై నీళ్లు చల్లాడు. డిసెంబరు చివరి వారంలో వచ్చిన ముసురు వాన పంటను దెబ్బతీసింది. త్రిపురాంతకం మండలం రామసముద్రం, మిట్టపాలెం, సోమేపల్లి, మేడపి, ఎండూరివారిపాలెం, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు మండలాలతో పాటు జిల్లాలోని అధిక ప్రాంతాల్లో సాగు చేసిన మిరప పంటను నల్లతామర చుట్టుముట్టింది. ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చి వేస్తోంది. ఫలితంగా ఆకులు ముడుచుకుపోతున్నాయి. నివారణకు మందులను విపరీతంగా వినియోగిస్తున్నప్పటికీ అంతగా ఫలితం ఉండటం లేదు. ఒక పొలం నుంచి మరో పొలానికి విస్తరించే అవకాశం ఉండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# దశలవారీగానైనా.. దిశ మార్చాలి



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వం తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనుల్ని ఐదేళ్లపాటు అటకెక్కించింది. దీంతో అంచనా వ్యయం అమాంతం పెరిగిపోయింది. ఐదేళ్ల ఆర్థిక విధ్వంసం తర్వాత పెండింగ్ పనులకు నిధుల మంజూరు అతిపెద్ద సమస్యగా మారింది. అయినా కూటమి ప్రభుత్వం ఆయకట్టు రైతులకు మేలు చేసేలా అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే అత్యవసర మరమ్మతుల కోసం రూ.35 కోట్లు కేటాయించి టెండరు ప్రక్రియ సైతం మొదలుపెట్టింది. మరమ్మతులతోనే సరిపెట్టకుండా ఆధునికీకరణ పనుల్ని పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. ఒకేసారి కాకపోయినా విడతలవారీగానైనా నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు. ఆధునికీకరణ పూర్తయితేనే చివరి ఆయకట్టు బతుకుతుందని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు.

**ఇబ్బందులు లేకుండా మరమ్మతులు**

ప్రవాహానికి ఇబ్బందిగా మారిన ప్రదేశాల్లో మరమ్మతు పనులు చేసేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. త్వరలోనే పనులు మొదలయ్యే అవకాశం ఉంది. రూ.9.8 కోట్ల అంచనా వ్యయంతో 115 కి.మీ. నుంచి 130 కి.మీ. వరకు లైనింగ్ పనులు చేపట్టనున్నారు.

కణేకల్లు ట్యాంకు వద్ద మరమ్మతులు, 147వ కిలోమీటరు వద్ద రూ.4.21 కోట్లతో అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు.వివిధ ప్రాంతాల్లో కూలిపోయిన, శిథిలావస్థకు చేరిన వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించారు. 137వ కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్‌ను పునర్నిర్మించనున్నారు.

నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులు మొదలుపెట్టి వచ్చే సీజన్ నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

నాలుగింతలు పెరిగిన వ్యయం

2009లో రూ.450 కోట్ల అంచనా వ్యయంతో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. 6 ప్యాకేజీలుగా విభజించి సుమారు 67 శాతం పనులు పూర్తి చేశారు. 2019 వరకు పలు దఫాలుగా రూ.300 కోట్ల విలువైన పనులు చేశారు. రూ.150 కోట్ల విలువైన పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. 2019లో వైకాపా పనుల్ని రద్దు చేసింది. ఐదేళ్లలో కొత్తగా ప్రతిపాదనలు పంపినా ఆమోదించలేదు. దీంతో పెండింగ్ పనుల అంచనా వ్యయం రూ.600 కోట్లకు పెరిగిపోయింది. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిధుల మంజూరు కష్టతరంగా మారింది. అయినా కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీని బాగుచేసే సంకల్పంతో ముందుకెళుతోంది.

**కష్టాలు తీరుతాయి**

సోమనాథ్‌గౌడ్, గోవిందవాడ, హెచ్చెల్సీ రైతు

హెచ్చెల్సీలో బలహీనంగా మారి కోతకు గురైన కాలువ గట్లు, శిథిలావస్థకు చేరిన వంతెనల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం శుభపరిణామం. రూ.35 కోట్లతో చేపట్టబోయే పనులతో నీటి నష్టం తగ్గి చివరి ఆయకట్టుకు నీరందుతుంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో హెచ్చెల్సీకి పైసా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం గత జూన్‌లో అత్యవసర మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఆధునికీకరణ పూర్తిచేస్తే రైతులకు కొన్ని దశాబ్దాల పాటు ఇబ్బందులుండవు.

# వైకాపా నిర్లక్ష్యం రహదారి అధ్వానం

చిత్తూరు : వైకాపా పాలన నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ రోడ్డు.. చిత్తూరు నగరంలోని కట్టమంచి నుంచి కొంగారెడ్డిపల్లి వరకు ఉన్న పుత్తూరు బైపాస్ రోడ్డు ఇది. తిరుపతి, పీలేరు మార్గాల నుంచి పుత్తూరు మార్గంలో వెళ్లేందుకు చిత్తూరు నగరంలో ప్రవేశించకుండా నిర్మించిన బైపాస్ రోడ్డు ఇది. వైకాపా నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా ఈ రోడ్డు గోతులమయమైంది. ఇటుగా వెళ్లాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక కార్లు, ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి



వర్ణనాతీతం. గోతుల్లో దిగి పైకి ఎక్కే సమయాల్లో కింది భాగం తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ మార్గంలో నూతన రోడ్డు నిర్మించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

# ప్రయోగం.. శూన్యం..!

భీమవరం : ప్రయోగాలే నూతన ఆవిష్కరణకు వారధులు. దేశ సమగ్ర ప్రగతికి ఇవే ఆయువుపట్టుగా నిలుస్తాయి. దీనికి పాఠశాల, కళాశాల స్థాయిలో 'ప్రయోగ' విద్య ఎంతో కీలకం. కానీ ప్రభుత్వ జూనియర్, హైస్కూలు ప్లస్ కళాశాలల్లో ప్రయోగాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. పట్టుకోవడానికి పరీక్ష నాళిక లేదు... పరీక్షించడానికి రసాయనాలు కానరావు..అన్నరీతిలో కళాశాలలో ప్రయోగాలు పడకేశాయి.జిల్లాలోని చాలా కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించి సిలబస్ పూర్తి కాలేదు. కొన్ని కళాశాలల్లో గదుల కొరత, సామగ్రి లేకపోవడం, అరకొర రసాయనాలతో విద్యార్థులు ప్రయోగ విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొన్ని చోట్ల ల్యాబులున్నా పరికరాలు లేవు. హైస్కూలు ప్లస్‌ల్లో ల్యాబులే లేవు.

**తరగతులకే పరిమితం**

పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 229కు గాను సైన్స్ విద్యార్థులు 38 మంది ఉన్నారు. ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 102 మంది ఉన్నారు. గతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఒకే ప్రాంగణంలో నిర్వహించగా సుమారు ఎనిమిదేళ్ల కిందట జూనియర్ కళాశాలను దగ్గరలో మరో ప్రాంతానికి మార్చారు. అక్కడ ప్రయోగశాలకు గదులు లేకపోవడంతో డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**అరకొర వసతులే..**ఆకివీడు మండలం దుంపగడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్సు విద్యార్థులు 97 మంది ఉన్నారు. అరకొర పరికరాలు.. అందుబాటులో రసాయనాలు లేకపోవడంతో విద్యార్థులుప్రయోగాలకు దూరంగా ఉంటున్నారు.

**ఉన్నతీకరించి..సౌకర్యాలు విస్మరించి...**

గత వైకాపా హయాంలో 16 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో ఇంటర్ విద్య ప్రవేశపెట్టింది. కానీ ఆ మేర సౌకర్యాల కల్పన విస్మరించడంతో విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు. కనీస వసతులు, అధ్యాపకుల నియామకం అంతంత మాత్రంగా ఉన్నా తరగతులు ప్రారంభించారు.

**15 కి.మీ దూరం వెళ్లి..**నరసాపురంలో మూడు ఉన్నత పాఠశాలలను హైస్కూలు ప్లస్‌గా ఉన్నతీకరించి ఇంటర్మీడియట తరగతులు ప్రారంభించారు. ముత్యాలపల్లి బండిముత్యాలమ్మ జడ్పీఉన్నత పాఠశాలలో ఎంపీసీలో ముగ్గురు, కేపీపాలెంనార్తులోని బాలికోన్నత పాఠశాలలో బైపీసీ రెండో ఏడాది చదువుతున్న వారు 13, కొప్పర్రు ఉన్నత పాఠశాలలో ఎంపీసీ రెండో ఏడాది చదువుతున్న వారు పది మంది చొప్పున ఉన్నారు. ఎక్కడా ప్రయోగశాలలు లేకపోవడంతో సుమారు 15 కి.మీ దూరంలో ఉన్న వై.ఎన్. కళాశాలకు వెళ్లి ప్రయోగ పరీక్షలు చేయిస్తున్నారు.తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమై రెండు దశాబ్దాలు దాటినా అద్దె భవనాల్లో కొనసాగుతోంది. ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కలిపి సుమారు 370 మంది విద్యార్థులుండగా ఆ స్థాయిలో తరగతులు, ప్రయోగశాలలు అందుబాటులో లేవు.శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూలు ప్లస్‌గా మార్చి రెండు గ్రూపులు ఏర్పాటు చేశారు. బైపీసీలో ప్రవేశం పొందిన నలుగురు విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఇతర కళాశాలలకు వెళ్తున్నారు.పరీక్ష.. ప్రయాసడిసెంబరు 1 నుంచి 90 రోజుల ప్రణాళికతో సిలబస్ పూర్తిచేసి, పునశ్చరణ తరగతులు నిర్వహించాలని ఇంటర్మీడియట బోర్డు ఆదేశించింది. సైన్సు విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తేనే సాధ్యమవుతుంది.

# స్థిరాస్తి ముసుగులో.. చెక్‌డ్యాంలకు ముప్పు



పరిగి : మరో నెలరోజుల్లో మండు వేసవి సమీపిస్తున్న తరుణంలో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలలో చుక్కనీరు కానరాక పాడి, పశుపక్షాదులు తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి. దీంతో అటవీ ప్రాంతంలో ఉన్న వన్య ప్రాణులు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. పడిన ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భజలాలను అభివృద్ధి చేయవచ్చనే లక్ష్యంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరవు మండలంగా గుర్తింపు పొందిన పరిగి మండలంలోని తిరుమలదేవరపల్లి, యర్రగుంట, హొన్నంపల్లి, సోమందేపల్లి మండలంలోని వెలగమేకలపల్లి, సోమందేపల్లిలో గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలను కొందరు స్వార్థపరులు వాటిని పూర్తిగా ధ్వంసం చేశారు. వాగులు వంకలకు అడ్డంగా రూ.లక్షలు వ్యయంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో విరివిగా చెక్‌డ్యాంల నిర్మాణాలను చేపట్టింది. అయితే వీటి నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో పలు చెక్‌డ్యాంలు దెబ్బతిని ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మరికొన్నింటిని కొందరు తమ స్వార్థప్రయోజనాల కోసం పలు చోట్ల చెక్‌డ్యాంలను ధ్వంసం చేయడంతో అవి వాటి స్వరూపమే కోల్పోయాయి. నేడు వాటిలో చుక్కనీరు కానరాని పరిస్థితి నెలకొంది. సోమందేపల్లి మండలంలోని వెలగమేకలపల్లి, సోమందేపల్లి మణికంఠ కాలనీ వద్ద గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు చెక్‌డ్యాంలు స్థితిలావస్థకు చేరకున్నాయి. చెక్‌డ్యాంలు నిర్మించినప్పటి నుంచి వాటి ఆలనా పాలన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఈ దుస్థితి నెలకొంది. వెలగమేకలపల్లి వద్ద చేపలు పట్టుకునేందుకు చెక్‌డ్యాంకు ఇరువైపుల సిమెంట్ బెడ్డింగ్‌ను ధ్వంసం చేశారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో నెలరోజులకే చెక్‌డ్యాంల నుంచి నీరు ఖాళీ అవుతున్నాయి. మణికంఠ కాలనీ వద్ద చెక్ డ్యాం అన్ని వైపులా ఆక్రమణదారులు మట్టితో పూడ్చి వేస్తున్నారు. ఇళ్లు నిర్మించుకొనేందుకు పునాదులు ఏర్పాటు చేసుకుంటున్నారు. చెక్‌డ్యాం చుట్టూ సరిహద్దు రాళ్లను పాతారు. దీంతో వర్షపు నీటి నిల్వ తగ్గిపోయింది. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో చెక్‌డ్యాంలలో చుక్కనీరు కానరావడం లేదు. ఈ విషయమై నీటి యాజమాన్య సంస్థ అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సోమందేపల్లి, పరిగి మండలాల్లో అన్యాక్రాంతం అయిన చెక్‌డ్యాంలను పరిశీలించి వాటి పునరుద్ధరణకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.


చురకలు






## చీర కట్టిన సుందరి నడుము అందం..!

హీరోయిన్స్‌లో మల్టీ ట్యాలెంటెడ్ ముద్దుగుమ్మలు కొద్ది మంది మాత్రమే ఉంటారు. అలాంటి మల్టీ ట్యాలెంటెడ్ హీరోయిన్స్‌లో ఆండ్రియా జెరెమియా ఒకరు అనడంలో సందేహం లేదు. హారిష్ జయరాస్ సంగీతం అందించిన అన్నియన్ సినిమాలో కన్నుమ్ కన్నుమ్ నోకియా పాటతో ఆండ్రియా సింగర్‌గా ఎంట్రీ ఇచ్చింది. మొదటి పాటతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడు ఆ తర్వాత ఎన్నో పాటలు పాడి అలరించింది. స్టేజ్ షోల్లోనూ తెగ సందడి చేసింది. ఒక మ్యూజిక్ డైరెక్టర్‌తో ప్రేమలో ఉందనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత బ్రేకప్ అంటూ ప్రచారం జరిగింది. కెరీర్ ఆరంభం నుంచి ఈ అమ్మడు సినిమాలతోనే కాకుండా ఏదో ఒక విధంగా వార్తల్లో ఉంటూనే ఉంది. ఆండ్రియా తమిళనాడులోని ఆంగ్లో ఇండియన్ ఫ్యామిలీలో జన్మించింది. తండ్రి మద్రాస్ హైకోర్ట్‌లో న్యాయవాదిగా చేస్తూ ఉండేవారు. చెన్నైలోని సెయింట్ జోసెఫ్స్ సెకండరీ స్కూల్లో, ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజ్‌లో చదువు కొనసాగించింది. ఆండ్రియా 8 ఏళ్ల వయసులోనే పియానో వాయించడం నేర్చుకుంది. 10 ఏళ్ల వయసులో యంగ్ స్టార్స్ అనే ఈవెంట్ బృందంలో భాగం అయింది. అందులో ఆండ్రియా పాటలు పాడుతూ ఉండేది. అలా థియేటర్ ఆర్టిస్ట్‌గా పలు నాటకాల్లోనూ కనిపించింది. కాలేజ్ రోజుల నుంచే ఆమెకు నటనపై సింగింగ్ పై ఆసక్తి పెరగడంతో ఇండస్ట్రీ వైపు అడుగులు వేసింది. తెలుగు సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. కానీ ఈమె నటించిన తమిళ సినిమాలు డబ్ అయ్యి తెలుగులో మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో తెలుగులోనూ మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. మొత్తానికి ఆండ్రియా హీరోయిన్ గా బిజీ బిజీగా ఉంది. సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన చీర కట్టు ఫోటోను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి నడుము అందం చూపిస్తూ ఆండ్రియా ఇచ్చిన ఫోటో ఫోజ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చీర కట్టులో ముద్దుగుమ్మ ఆండ్రియా చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ కామెంట్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. సాధారణంగా ఆండ్రియా ఎక్కువగా మోడ్రన్ డ్రెస్‌ల్లో కనిపిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఆమె ఎక్కువగా మోడ్రన్ డ్రెస్‌ల్లో ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ వచ్చింది. కానీ ఇప్పుడు చీర కట్టులో కనిపించి సర్ ప్రైజ్ చేసింది. చీర కట్టులో నడుము అందం చూపిస్తున్న ఆండ్రియా సరికొత్తగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. ఇక ఈ అమ్మడు ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. తమిళ్‌లో నాలుగు సినిమాలు చేస్తుంది. ఆ నాలుగు సినిమాలతో పాటు మరో రెండు మూడు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో కనీసం మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఆండ్రియా రెడీ అవుతోంది.



## ఇంట్లో రాత్రి పూట కర్ఫ్యూ విధించారన్న నటి

ఒక వయసు వచ్చాక అమ్మాయి అయినా.. అబ్బాయి అయినా స్వేచ్ఛ కోరుకుంటారు. తమకు నచ్చిన లేదా ప్రేమించిన యువతి లేదా యువకుడిని పెళ్లాడాలని కూడా కలలు కంటారు. అయితే తనకు 30 ఏళ్ల వయసు వచ్చాక కూడా రాత్రి వేళ తనపై తల్లిదండ్రులు కర్ఫ్యూ విధించేవారని సోనాక్షి సిన్హా తెలిపింది. తనపై ఇంట్లో కఠినమైన ఆంక్షలు ఉండేవని వెల్లడించారు. తన తల్లి పూనమ్ సిన్హా అర్ధరాత్రి తనను నిశితంగా గమనించేవారని, కానీ తాను ఏదోలా దొంగచాటుగా తప్పించుకునేదానిని అని కూడా సోనాక్షి వెల్లడించారు. తాను ఇంటి నుంచి తప్పించుకుని వెళ్లాను అంటే.. అది కేవలం తన ప్రియుడిని కలుసుకునేందుకు మాత్రమేనని తెలిపారు. నేను వృత్తి రీత్యా షూటింగ్ లకు వెళ్లే సమయంలో కూడా తెల్లవారుజామున 1:30 గంటలకు ఇంట్లో కర్ఫ్యూ విధించారని సోనాక్షి సిన్హా అన్నారు. నాకు 32 ఏళ్ల వయసు వచ్చే వరకు ఈ పరిస్థితి ఇలాగే ఉండేది. జహీర్‌కు ఇది అతిపెద్ద సమస్యగా ఉండేది. నేను కర్ఫ్యూను ఉల్లంఘించానంటే.. అది అతడి వల్లనే. నేను రామాయణం అనే కోటలో నివసించేదానిని అని సోనాక్షి వ్యాఖ్యానించారు. తాను ఇంట్లో పదో అంతస్తులో ఉంటే, అమ్మా నాన్న ఐదవ అంతస్తులో నివశించేవారని తెలిపింది. అలాగే తాను ఇంటి నుంచి బయటకు వెళ్లినా లేదా తను ఇంటికి వచ్చినా వెంటనే తనను గమనించే టెలీఫోన్ ఆపరేటర్ మిస్టర్ ఝా అమ్మానాన్నకు ఫోన్ చేసి సమాచారం అందించేవారని కూడా సోనాక్షి గుర్తు చేసుకున్నారు. నా కారు ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన నిమిషంలోనే అతడు ఐదవ అంతస్తుకు ఫోన్ చేసి పాప వచ్చేసింది అని చెప్పేవాడు. అయితే తన తల్లిదండ్రులకు ఫోన్ చేయవద్దని ఫోన్ ఆపరేటర్ ని అడిగానని కూడా సోనాక్షి తెలిపింది. అర్ధరాత్రి తర్వాత ఎక్కడికి వెళ్లినా దాని గురించి అమ్మా నాన్న అడిగేవారని, తిట్టేవారని కూడా తెలిపింది సోనాక్షి. ఇది ప్రతి ఇంటి కథ అని అన్నారు. అలాగే తన తండ్రికి ఫిర్యాదు అందితే ఏమనుకుంటాడో అని భావించేది. కానీ నాన్న గారు ప్రపంచంలోనే అత్యంత కూల్ గా ఉండే వ్యక్తి అని సోనాక్షి అంది. తండ్రి శత్రుఘ్న సిన్హా తనను ఎప్పుడూ తిట్టలేదని కూడా గుర్తు చేసుకుంది. సోనాక్షి సిన్హా గత సంవత్సరం జహీర్ ఇక్బాల్‌ను పెళ్లాడింది. కొన్నేళ్ల పాటు ప్రేమకోసం పోరాడి చివరికి గెలిచింది. సోనాక్షి - జహీర్ ప్రత్యేక వివాహ చట్టం నిబంధనల కింద వివాహం చేసుకున్నారు. పెళ్లికి ముందు కొన్నేళ్ల పాటు ఈ జంట ప్రేమాయణం సాగించింది.



# అఖండ 3కి పర్ఫెక్ట్ లీడ్..?



నందమూరి బాలకృష్ణ ఈమధ్య వరుస సినిమాలతో సూపర్ ఫామ్ లో ఉన్నాడు. రీసెంట్ గానే సంక్రాంతికి డాకు మహారాజ్ తో వచ్చి సక్సెస్ అందుకున్న బాలయ్య నెక్స్ట్ అఖండ 2 తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే నెక్స్ట్ లెవెల్ అన్నట్టే లెక్క. బాలయ్య ని ఎలా చూపిస్తే ఫ్యాన్స్ ఊగిపోతారో బోయపాటికి బాగా తెలుసు అందుకే ఆయన సినిమాల్లో బాలకృష్ణ ఉగ్ర రూపం చూపిస్తారు. ఇక వీరి కాంబినేషన్ లో వచ్చిన అఖండ అయితే అప్పటివరకు ఉన్న బాలయ్య సినిమా రికార్డులను బ్రేక్ చేసి సరికొత్త సంచలనాలు సృష్టించింది. ఐతే ప్రస్తుతం ఆ సినిమా సీక్వెల్ గా అఖండ 2 సినిమా చేస్తున్నారు. అఖండ ఎంత హిట్ అయ్యిందో ఆ సీక్వెల్ ని అదే రేంజ్ లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అందుకే ఈమధ్య జరిగిన మహా కుంభమేళాలో ఈ సినిమా షూటింగ్ చేశారు. ఇక ఇప్పుడు హిమాలయాల్లో కూడా షూట్ చేయబోతున్నారని తెలుస్తుంది. అఖండ 2 తో బాలకృష్ణ ఫస్ట్ టైం పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తున్నారు. అఖండ సినిమా నార్త్ ఆడియన్స్ కూడా ఇష్టపడ్డారు. అఖండ హిందీ డబ్బింగ్ కి మంచి వ్యూస్ వచ్చాయి. అందుకే అఖండ 2 ని డైరెక్ట్ గా రిలీజ్ చేసేలా చూస్తున్నారు. ఐతే అఖండ 2 తో బోయపాటి ప్లానింగ్ ఎవరు ఊహించని విధంగా ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా సినిమా లో బాలయ్య ఎలివేషన్స్, యాక్షన్ వేరే లెవెల్ అని తెలుస్తుంది. అంతేకాదు అఖండ 2 లో పార్ట్ 3 కి సంబందించిన అదిరిపోయే ట్విస్ట్ రివీల్ చేస్తారని తెలుస్తుంది. అఖండ 2 చివర్లో అఖండ 3 కి లీడ్ ఇస్తారట. అఖండ 2 లో కథ వేరే మలుపు తీసుకోగా పార్ట్ 2 పూర్తి స్థాయిలో ఆధ్యాత్మికతతో ఉంటుందని అంటున్నారు. అంతేకాదు ఈ సినిమాలో బాలయ్య అఘోరా రోల్ మరింత పవర్ ఫుల్ గా ఉండబోతుందని తెలుస్తుంది. మొత్తానికి బోయపాటి అఖండ ని చాలా ప్రెస్టీజియస్ గా తీసుకున్నారని అనిపిస్తుంది. అఖండ 2 మాత్రమే కాదు అఖండ 3 కూడా ఉంటుందని పార్ట్ 2 లో మూడో భాగానికి సంబందించిన ట్విస్ట్ ఉంటుందని అది ఆడియన్స్ కి ఫ్యూజులు ఎగిరిపోయేలా చేస్తుందని చెప్పుకుంటున్నారు. మరి బాలయ్య, బోయపాటి ఏం చేస్తున్నారో కానీ అఖండ తరహాలో అఖండ 2 థియేటర్ లు కూడా ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోయేలా ఉన్నారని మాత్రం అర్థమవుతుంది.


# మ్యాడ్ స్క్వేర్ రిలీజ్ డేట్.. నాగవంశీ సడన్ ట్విస్ట్



ఈ ఏడాది ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు మరోసారి సిద్ధమవుతోంది మ్యాడ్ గ్యాంగ్. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్' సినిమా ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పరుచుకుంది. అయితే ఇప్పటి వరకూ మార్చి 29న థియేటర్లలో సందడి చేయాల్సిన ఈ చిత్రం తాజాగా ఒక రోజు ముందుకు చేరుకుంది. నిర్మాత ఎస్. నాగవంశీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. నాగవంశీ ఈ అప్‌డేట్‌ను షేర్ చేస్తూ.. "మా డిస్ట్రిబ్యూటర్ల సూచనతో, అలాగే వారి మద్దతుతో మ్యాడ్ స్క్వేర్ విడుదలను ఒక రోజు ముందుకు తీసుకురావడం జరిగింది. మార్చి 28న ఈ మూవీ థియేటర్లలో సందడి చేయనుంది" అని తెలిపారు. మార్చి 29న అమావాస్య కావడంతో, డిస్ట్రిబ్యూటర్ల సూచన మేరకు విడుదల తేదీని మార్చినట్లు ఆయన వివరించారు. అదే రోజు నితిన్-వెంకీ కుడుముల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'రోబిన్‌హుడ్' కూడా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ రెండు సినిమాలు ఒకేసారి రిలీజ్ అవడం విశేషం. అయితే నాగవంశీ దీనిపై కూడా స్పందిస్తూ, "మార్చి 28 తెలుగు సినిమాకు ఒక గొప్ప రోజుగా మారనుంది. రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలు బిగ్ స్క్రీన్‌పై అలరించబోతున్నాయి" అంటూ స్పందించారు. 'మ్యాడ్' సినిమా బిగ్ హిట్ కావడంతో, ఆ సినిమాకు రెండో భాగంగా 'మ్యాడ్ స్క్వేర్' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. ముఖ్యంగా 'లడ్డు గాని పెళ్లి' పాటకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో విడుదల తేదీ మారడం, ప్రమోషన్‌లో మరింత హైప్‌ను క్రియేట్ చేసే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. నాగవంశీ తన ట్వీట్‌లో నితిన్, వెంకీ కుడుములకు కూడా ఆల్ ద బెస్ట్ చెబుతూ, "ఈ సమ్మర్ నవ్వుల పండుగ" అంటూ సినిమా మీద కాన్ఫిడెన్స్‌ను చూపించారు. అయితే 'మ్యాడ్ స్క్వేర్'కు 'రాబిన్‌హుడ్' పోటీగా నిలిచే అవకాశం ఉన్నప్పటికీ, రెండు సినిమాలకూ వేరే టార్గెట్ ఆడియెన్స్ ఉండటంతో పెద్దగా ప్రభావం ఉండదని భావిస్తున్నారు. మొత్తానికి, 'మ్యాడ్ స్క్వేర్' థియేటర్లలో ఇంకోరోజు ముందే నవ్వుల విందు అందించబోతోంది. ఈ మార్చి 28 ప్రేక్షకులకు నిజంగానే ఓ ఫుల్ కామెడీ ట్రీట్ కానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరి బాక్సాఫీస్ వద్ద ఈ రెండు సినిమాల మధ్య అసలైన ఫైట్ ఏలా ఉంటుందో చూడాలి.

## ప్రగ్యా అందాల షో అరాచకం

తెలుగు ప్రేక్షకులకు మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో పరిచయం అయినా 'కంచె' సినిమాతో స్టార్‌డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. మెగా హీరో వరుణ్ తేజ్ హీరోగా క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమా కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ముఖ్యంగా హీరోయిన్‌గా నటించిన ప్రగ్యా జైస్వాల్‌పై ఆ సమయంలో పాజిటివ్ కామెంట్స్ వచ్చాయి. ముందు ముందు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా సినిమాలు చేయబోతుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేశారు. కానీ కట్ చేస్తే టాలీవుడ్‌లో కంచె తర్వాత ఆ స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిన పాత్ర ఆమెకు దక్కలేదు. ఒకటి రెండు హిట్స్ ఆమె ఖాతాలో పడ్డా అవి ఆమెకు ఆఫర్లు తెచ్చి పెట్టలేక పోయాయి. అయినా కెరీర్‌లో నిలదొక్కుకోవడం కోసం పదేళ్లుగా ఇండస్ట్రీలో ఆఫర్ల కోసం కుస్తీ పడుతుంది. అడపా దడపా ఆఫర్లు వస్తూ ఇంకా ఇండస్ట్రీలో కొనసాగుతోంది. సక్సెస్ దక్కాలి, మంచి పాత్ర పడాలని ప్రగ్యా చాలా కాలంగా వెయిట్ చేస్తుంది. ఇండస్ట్రీలో హిట్ లేకున్నా ఇన్నాళ్లు కొనసాగడంకు ప్రధాన కారణం ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు అనడంలో సందేహం లేదు. రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. దాంతో ఈ అమ్మడు ఎప్పుడు చూసినా వార్తల్లో ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి ఇన్నర్స్‌ను చూపిస్తూ వయ్యారాలు ఒలకబోస్తూ కవ్విస్తున్నట్లుగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. దాంతో ఈ అమ్మడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం ప్రగ్యా జైస్వాల్‌కే సాధ్యం అంటూ నెట్టింట కొందరు కామెంట్ చేస్తున్నారు. ఇంత అందం ఉన్నా కూడా ప్రగ్యాకి సరైన ఆఫర్లు రాకపోవడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ముందు ముందు అయినా ఆఫర్లు రావాలని అభిమానులు, ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. ఈ ఫోటోల్లో ప్రగ్యా అందాలు అరాచకం అంటూ తెగ లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు. ప్రగ్యా ఇటీవల బాలకృష్ణతో కలిసి వచ్చిన డాకు మహారాజ్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా వెంటనే ఈ అమ్మడికి ఆఫర్లు రావడం లేదు. తెలుగులో ఈ అమ్మడు అఖండ 2 సినిమాలో నటించే అవకాశాలు దక్కించుకుంది. అఖండ సినిమాలో నటించిన ప్రగ్యా కి సీక్వెల్‌లో నటించే అవకాశం దక్కింది. బాలయ్యతో మూడో విజయాన్ని అఖండ 2 తో దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఆ విజయంతో అయినా టాలీవుడ్‌లో ప్రగ్యా జైస్వాల్ బిజీ అయ్యేనా చూడాలి.



## తమన్నా.. నిజంగా పాలరాతి శిల్పమే..

హీరోయిన్ తమన్నా భాటియాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి తనదైన గుర్తింపు... మంచి ఫేమ్ సంపాదించుకుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. పరిశ్రమలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా అదే క్రేజ్.. అదే గ్లామర్.. ఆమె సొంతమనే చెప్పాలి. మరాఠీ బ్యూటీ అయిన తమన్నా.. నార్త్ టు సౌత్ అందరినీ అలరిస్తూ దూసుకుపోతోంది. కెరీర్ స్టార్టింగ్ లోనే టాలీవుడ్ ను ఓ రేంజ్ లో ఏలిందని చెప్పొచ్చు. స్టార్ హీరోలందరితో ఆడిపాడి తక్కువ టైమ్ లోనే ఎక్కువ గుర్తింపు సొంతం చేసుకుంది తమన్నా. ఇప్పుడు హీరోయిన్ గా నటిస్తూనే.. స్పెషల్ సాంగ్స్ తో అలరిస్తోంది. రీసెంట్ గా రజినీ కాంత్ జైలర్ లో కావాలయ్యా పాటతో ఓ ఊపు ఊపేసింది తమన్నా. ఆమె డ్యాన్స్ అండ్ ఎక్స్ప్రెషన్స్ కు అంతా ఫిదా అయిపోయారు. ఆ తర్వాత బాలీవుడ్ మూవీ స్త్రీ 2లోని ఆజ్ కీ రాత్ సాంగ్ తో మరోసారి మెప్పించింది. తన అందచందాలు, స్టెప్పులతో ఓ రేంజ్ లో అందరినీ అలరించింది అమ్మడు. అయితే కెరీర్ పరంగా బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తమన్నా చేసే సందడి వేరే లెవెల్. ఎప్పటికప్పుడు గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంటోంది. తాజాగా మరో బ్యూటిఫుల్ పిక్స్ తో తళుక్కుమంది అమ్మడు. వైట్ కలర్ మిడ్డీ డ్రస్ లో తమన్నా అదరగొట్టేసిందనే చెప్పాలి. క్లాసీ లుక్ లో తన గ్లామరస్ స్కిన్ తో మైండ్ బ్లాక్ చేసేసింది. బ్లాక్ కలర్ ఫ్లోరల్ ప్రింట్ తో ఉన్న వైట్ డ్రెస్ అదిరిపోగా.. గ్లాసీ మేకప్ తో ఫుల్ షైనీగా కనిపించి క్లీన్ బౌల్డ్ చేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. రకరకాల పోజులను పోస్ట్ చేసిన తమన్నా.. తెల్ల పావురాల ఎమోజీలను క్యాప్షన్ గా ఇచ్చింది. ప్రస్తుతం తమన్నా కొత్త పిక్స్.. సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పిక్స్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సో షైనీ అని చెబుతున్నారు. పాలరాతి శిల్పంలా ఉన్నారని, నిజంగా మిల్కీ బ్యూటీనే అని కొనియాడుతున్నారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో ఓదెల 2 మూవీ చేస్తుండగా.. ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అటు బాలీవుడ్? లో డార్లింగ్ పార్ట్ నర్స్ తో త్వరలోనే సందడి చేయనుంది.



PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536